PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 257 | విజయవాడ, సోమవారం 22 ఏప్రిల్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 22 April 2024 | Rs

అచ్చేదిన్ తూచ్..
అంతా ఆకలి రాజ్యమే
- బిజెపి పాలనలో 2015 నుంచీ ధరల దరువే
- పేదలు, సామాన్య ప్రజల బాధలు వర్ణనాతీతం

7

గెలుపు ముంగిట బెంగళూరు బోల్తా
- ఒక్క పరుగు తేడాతో కోల్‌కతా చేతిలో ఓటమి

8

రాంచీలో నిర్వహించిన సభలో అభివాదం చేస్తున్న 'ఇండియా' వేదిక నాయకులు

బిజెపికి బుద్ధి చెప్పాలి

జైళ్లలో పెడితే బెదిరిపోం • యువత ఆలోచించి ఓటేయాలి
రాంచీ ర్యాలీలో ఇండియా బ్లాక్ నేతల పిలుపు • ఏచూరి సంఘీభావం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో నియంతృత్వ పాలన సాగిస్తున్న బిజెపికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ఇండియా బ్లాక్ నేతలు పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాలంటే 'ఇండియా' బ్లాక్‌ను గెలిపించు కోవాలన్నారు. మోడీ నియంతృత్వానికి వ్యతిరేకంగా సాగే ఈ పోరాటంలో విజయం సాధించి తీరుతామన్నారు. మోడీ పదేళ్ల పాలన అన్ని తరగతుల ప్రజానీకాన్ని తీవ్ర కడగండ్ల పాల్జేసిందన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సిఎం హేమంత్ సోరెన్ అరెస్ట్‌కు నిరసనగా ఆదివారం జార్ఖండ్ రాజధాని రాంచీలో ప్రభాత్ తారా గ్రౌండ్ వేదికగా 'ఇండియా' బ్లాక్ ఉల్గులాన్ న్యాయ్ ర్యాలీ నిర్వహించింది. సభా వేదికపై అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు కుర్చీలను ఖాళీగా ఉంచారు. ఇందులో పాల్గొన్న జెఎంఎం కార్యకర్తలు సోరెన్ మాస్కులు ధరించి వచ్చారు. "జైలు కా తాలా తూటేగా, హేమంత్ సోరెన్ చుటేగా" (జైలు తాళం పగలగొడతాం. హేమంత్ సోరెన్‌ను విడుదల చేస్తారు), "జార్ఖండ్ జుకేగా నహీ" (జార్ఖండ్ తలవంచదు)" వంటి నినాదాలు హోరెత్తాయి. ఈ ర్యాలీలో మల్లికార్జున ఖర్గే (కాంగ్రెస్), తేజస్వి యాదవ్ (ఆర్జేడి), అఖిలేష్ యాదవ్ (సమాజ్‌వాది పార్టీ), ఫరూక్ అబ్దుల్లా (నేషనల్ కాంగ్రెస్), భగవంత్ సింగ్ మాన్ (పంజాబ్ ముఖ్యమంత్రి), చంపై సోరెన్ (జార్ఖండ్ సిఎం) వంటి అగ్ర నేతలతోబాటు జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి భార్య కల్పనా సోరెన్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద కేజ్రీవాల్ భార్య సునీత కేజ్రావాల్ కూడా పోల్గొన్నారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కేరళలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనాల్సి రావడంతో ఈ ర్యాలీకి హాజరుకాలేకపోతున్నానని, అయితే, ఈ ర్యాలీకి తమ పూర్తి మద్దతు ఉంటుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హేమంత్ సోరెన్ భార్య కల్పన సోరెన్ కు రాసిన లేఖలో పేర్కొన్నారు. దాన్ని ఆమె సభలో చదివి వినిపించారు.

బిజెపి తుడిచిపెట్టుకుపోతుంది: ఖర్గే

వచ్చే ఎన్నికల్లో బిజెపి తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. "మేము ప్రజలకు భయపడతాం తప్ప, మోడీ లాంటి నాయకులకు కాదు. ఇద్దరు ముఖ్యమంత్రులను జైలులో పెట్టారు. దీనికి మేం భయపడం. ఇండియా బ్లాక్‌తో తెగతెంపులు చేసుకోవాలని జార్ఖండ్ ముఖ్యమంత్రిపై బిజెపి ఒత్తిడి తెచ్చింది.. అందుకు ఆయన నిరాకరించడంతో జైలులో పెట్టించింది. వారు మమ్మల్ని ఇసుకలో పాతిపెట్టినా, పైకి లేస్తాం.. గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్న బిజెపికి ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారు

నియంతృత్వ పాలనకు చరమగీతం: జార్ఖండ్ సిఎం చంపై సోరెన్

జార్ఖండ్ సిఎం చంపై సోరెన్ మాట్లాడుతూ నియంత పాలనకు చరమగీతం పాడాలన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ఇండియా బ్లాక్‌ను గెలిపించాలన్నారు. జార్ఖండ్ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పన్నిన కుట్రలో భాగమే మిగతా 2లో

ప్రతి అవయవ మార్పిడికి విశిష్ట గుర్తింపు సంఖ్య

- తప్పనిసరి చేస్తూ కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ : జీవించివున్న దాతల నుంచి కానీ, మరణానంతరం దాతల నుంచి కానీ అవయవాల మార్పిడికి సంబంధించిన ప్రతీ కేసుకూ ఆధార్ తరహా ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (ఎన్‌ఒటిటిఒ–నొట్టో) ద్వారా ఈ గుర్తింపు కేటాయించనున్నట్లు తెలిపింది. అవయవ మార్పిడి చికిత్స నిర్వహించే సంబంధిత ఆసుపత్రులే 'నొట్టో వెబ్‌సైట్' ద్వారా ఈ గుర్తింపు సంఖ్యను జారీ చేయవచ్చునని పేర్కొంది. అవయవాల అమ్మకానికి, ప్రత్యేకించి విదేశీ అమ్మకాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఉత్తర్వులు జారీ చేసింది. 'మరణానంతరం అవయవ దానాలను పరిగణనలోకి తీసుకోవడానికి నొట్టో ఐడి గుర్తింపు తప్పనిసరి. జీవించి ఉన్న దాత నుంచి అవయవదానం విషయంలో అవయవ మార్పిడి శస్త్రచికిత్స జరిగిన 48 గంటల్లోపు నొట్టో గుర్తింపు జారీ చేయాలి' అని ఉత్తర్వుల్లో పేర్కొంది. మానవ అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం 1994 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకున్న అథారిటీలు ఆయా రాష్ట్రాల్లో విదేశీయులకు జరిగిన అవయవ దానాలపై దర్యాప్తు నిర్వహించాలని ఈ నెల ప్రారంభంలోనే కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ చట్టంలోని నిబంధనలు ఉల్లంఘించినట్లు అందిన ఫిర్యాదులపై విచారణ జరిపి తక్షణమే తగిన చర్యలు కోవాలని ఆదేశించింది.

వర్షపు జల్లులతో చల్లబడిన అరకులోయ

6 జిల్లాల్లో వర్షాలు

ఒక్కసారిగా మారిన వాతావరణం • కొన్ని జిల్లాల్లో తప్పని వడగాడ్పులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూర్యుని ప్రకోపానికి అట్టుడికిపోయిన రాష్ట్ర ప్రజలకు ఉపశమనం కలిగించేలా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గడిచిన 20 రోజులుగా ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజానీకంపై వరుణుడు కరుణ చూపించి, చల్లటి చిరుజల్లులను కురిపించాడు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆరు జిల్లాల్లో తేలికపాటి జల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. నంద్యాల జిల్లాలో అత్యధికంగా 18.25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లా ముక్తాపురంలో 13 మిల్లీమీటర్లు, విజయనగరం జిల్లా బొండపల్లిలో 12.5, అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీలో 14.5, వై రామవరంలో 10, తిరుపతి జిల్లా నాగులాపురం మండలంలో 7.5, అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో 7.25 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. సోమవారం కూడా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాలతోపాటు రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి జల్లుల నుంచి ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

హుకుంపేటలో షాపుపై కూలిన చెట్టు

అల్లూరి జిల్లా హుకుంపేటలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి మూడు షాపులపై చెట్టు కూలింది. ఆ సమయంలో మటన్, టైలర్ షాపులు, టీ పాయింట్ల వద్ద ఉన్న వారు బయటకు పరుగులు తీశారు. కొంత మేర ఆస్తినష్టం జరిగింది.

నేడు 90 మండలాల్లో వడగాడ్పులు

వాతావరణం చల్లబడినప్పటికీ, కొన్ని జిల్లాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని వాతావరణ సంస్థ హెచ్చరించింది.

సోమవారం రాష్ట్రంలోని దాదాపు 90 మండలాల్లో వడగాడ్పులు ఉంటాయని పేర్కొంది. శ్రీకాకుళంలోని 9 మండలాలు, విజయనగరంలోని 8, పార్వతీపురం మన్యంలోని 9 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, తిరుపతిలోని 3, ప్రకాశంలోని 9, ఎన్‌టిఆర్‌లోని 1, అనకాపల్లిలోని 3, విజయనగరంలోని 16, శ్రీకాకుళంలోని 10 మండలాల్లో వడగాడ్పులు వీస్తాయని పేర్కొంది.

36 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు

ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 36 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీయగా.. 82 మండలాల్లో వడగాడ్పులు వీచాయి. తిరుపతి జిల్లా రేణిగుంటలో ఆదివారం గరిష్టంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని 14 మండలాల్లో రాబోయే 48 గంటల్లో 45 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

భారీగా మద్యం పట్టివేత

ప్రజాశక్తి - యంత్రాంగం

నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన సెబ్ అధికారులు

నెల్లూరు జిల్లాలో ఆదివారం భారీగా మద్యం పట్టుబడింది. మూడు కార్లలో తరలిస్తున్న మద్యాన్ని, సచివాలయంలో నిల్వ చేసిన మద్యం, బియ్యం బస్తాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎలక్షన్ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ అధికారుల ఇచ్చిన ప్రకటన మేరకు.. నెల్లూరు అడిషనల్ ఎస్‌పి (సెబ్) ఆదేశాల మేరకు ఇంటెలిజెన్స్ వింగ్, నెల్లూరు ఇందుకూరుపేట ఎస్ఇబి అధికారులు ముత్తుకూరు మండలం, పంటపాలెం గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మూడు కార్లలో తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెలంగాణ రాష్ట్రం కె.వి రంగారెడ్డి ప్రాంతానికి చెందిన మారు సుధాకర్ రెడ్డి, బేగంపేటకు చెందిన చిలక రాము, అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం బోడపాలెం గ్రామానికి చెందిన లోకవరపు వెంకట రమణ, ముత్తుకూరు మండలం పంటపాలెం ఈపూరు గ్రామానికి చెందిన పుచ్చకాయల నాగేశ్వరావులను అరెస్టు చేశారు. అక్రమం మద్యం ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరి హస్తం ఉందనే వివరాలు తెలియాల్సి ఉంది. కావలి పట్టణం బుడమగుంట సచివాలయంలో మద్యం నిల్వ చేస్తున్నారని 'సి' విజిల్ యాప్‌లో స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఎలక్షన్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు గ్రామ సచివాలయం తాళాలు పగులకొట్టి, తనిఖీ చేశారు. 43 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు ఎనిమిది బస్తాల ప్రజాపంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యాన్ని కూడా స్వాధీనం పర్చుకున్నారు.

రూ.4,60,880ల విలువైన వెండి సీజ్

ఎన్నికల తనిఖీల్లో భాగంగా గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గం పరిధిలో రూ.4,60,880లు విలువ గల 6,584 గ్రామాల వెండిని ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ రూ.2,31,26,840ల విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేశారు. తెనాలి రూరల్ పరిధిలోని నందివెలుగు చెక్‌పోస్టు వద్ద ఆర్‌టిసి బస్సులో 6.50 కిలోల వెండిని పోలీసులు పట్టుకున్నారు.

పదేళ్లుగా బిజెపి వెన్నుపోటు
- ఆ పార్టీకి వైసిపి, టిడిపి గులాంగిరీ
- ఎపిన్యాయ్ యాత్రలో వైఎస్ షర్మిల

కాషాయీకరణ కుట్రకు నాంది
- దూరదర్శన్ రంగు మార్పుపై స్టాలిన్ ఆగ్రహం

మాల్దీవుల్లో ముగిసిన పార్లమెంటు ఎన్నికలు
- నేడు ఫలితాలు
- ముయిజ్జుకే విజయావకాశాలు

లోపలి పేజీలో..

ఐదు చోట్ల మార్పు

- టిడిపి అభ్యర్థులకు బి ఫారాలు అందించిన చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బి ఫారం చూపుతున్న చంద్రబాబు

టిడిపి ముందుగా ప్రకటించిన జాబితాలో ఐదు చోట్ల అభ్యర్థులను మార్చింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండి, ఉమ్మడి విశాఖపట్నంలోని మాడుగుల, పాడేరు, అనంతపురం జిల్లాలోని మడకశిర, నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్పుచేసింది. టిడిపి నుంచి లోక్‌సభ, శాసనసభకు పోటీచేస్తున్న అభ్యర్థులకు బి ఫారాలను ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో అందజేశారు. ఉండికి ముందుగా ప్రకటించిన సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజుకు బదులు నరసాపురం వైసిపి సిట్టింగు ఎంపి రఘురామ కృష్ణరాజుకు, మాడుగులకు పైలా ప్రసాద్‌కు బదులు మాజీ మంత్రి బండారు సత్యనారాయణకు, పాడేరు.. వెంకట రమేష్‌నాయుడుకు బదులు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి, వెంకటగిరి.. కురుగొండ్ల లక్ష్మీప్రియకు బదులు ఆమె తండ్రి రామకృష్ణకు బి ఫారాలు అందజేశారు.

ఉండి, అనపర్తి సీట్ల విషయంలో బిజెపి తన మాట నెగ్గించుకొంది. అనపర్తి బిజెపి అభ్యర్థి శివకృష్ణరాజు వైసిపి అభ్యర్థి సత్తి సూర్యనారాయణ రెడ్డికి పోటీ ఇవ్వలేరని, ఈ సీటు ఓడిపోతుందనే ఆందోళన కూటమిలో మొదటి నుంచి నెలకొంది. అక్కడ టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న నల్లిమిల్లి రామకృష్ణారెడ్డిని పార్టీలో చేర్చుకుని పోటీలో నిలిపేందుకు బిజెపి ప్రయత్నాలు చేసింది. నల్లిమిల్లి బిజెపిలో చేరేందుకు ముందుగా సుముఖత వ్యక్తం చేయలేదు. పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించిన అనపర్తి నియోజకవర్గాన్ని టిడిపికి ఇచ్చి దెందులూరును ఇవ్వాలన్న టిడిపి ప్రతిపాదనలను అంగీకరించలేదు. దీంతో గత్యంతరం లేక ఇప్పుడు నల్లిమిల్లిని బుజ్జగించి బిజెపిలోకి పంపేందుకు టిడిపి అధినాయకత్వం చర్చలు జరుపుతోంది. మరోవైపు వైసిపి నుంచి గెలిచి ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్న రఘురామ కృష్ణరాజుకు నరసాపురం లోక్‌సభ స్థానాన్ని కేటాయించాలని బిజెపిని టిడిపి కోరింది. రఘురామ కృష్ణరాజుకు నరసాపురం టికెట్ రాకుండా వైఎస్ జగన్ బిజెపిని ప్రభావితం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో గత్యంతరం లేక టిడిపినే ముందుగా ప్రకటించిన అభ్యర్థిని మార్చి ఉండి శాసనసభ నుంచి రఘురామను బరిలోకి దింపుతోంది. మడకశిరకు ముందుగా ప్రకటించిన ఎంఇ సునీల్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి వ్యతిరేకించడంతో టిడిపి ఎస్‌సి సెల్ ఇన్‌ఛార్జి ఎంఎస్ రాజుకు టికెట్ కేటాయించారు. మాడుగుల, పాడేరు, వెంకటగిరి అభ్యర్థులను మార్పు చేస్తేనే అవకాశాలు ఉన్నాయని సర్వేలు రావడంతో ఈ మూడు నియోజకవర్గాల్లో టిడిపి మార్పులు చేసింది. దెందులూరు, తంబళపల్లె అభ్యర్థులకు బి ఫారాలు ఇవ్వలేదు. అనపర్తి మార్పు మిగతా 2లో

ప్రతి రాజకీయ పార్టీ
స్టీల్‌ప్లాంట్ అంశాన్ని మ్యానిఫెస్టోలో పెట్టాలి

- ఉక్కు మహా గర్జన ధర్నాలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉక్కు మహా గర్జన ధర్నాలో నినదిస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

ప్రతి రాజకీయ పార్టీ విశాఖ ఉక్కు పరిరక్షణ అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టాలని వక్తలు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చ్ వద్ద 1165 రోజులుగా జరుగుతున్న రిలే దీక్షల శిబిరంలో ఆదివారం ఉక్కు మహా గర్జన పేరిట ధర్నా నిర్వహించారు. పోరాట కమిటీ చైర్మన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడుతున్నా పట్టించుకోని కేంద్ర బిజెపి నాయకులు నేడు అబద్ధాలతో కార్మికులను, ప్రజలను మోసపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించబోమని, పూర్వవైభవం తీసుకొస్తామని, ఉత్పత్తిని పెంచుతామని ఎన్నికల ముందు బిజెపి నాయకులు చెప్పడం మోసగించడమేనని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఖనిజం అందకుండా అదానీ గంగవరం పోర్టు, మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నాయన్నారు. దీనిలో భాగంగానే బొగ్గును నిలుపుదల చేశాయని వివరించారు. నెల రోజులకు సరిపడా ముడిసరుకు స్టీల్‌ప్లాంట్‌లో ఎప్పుడూ ఉండేదని, నేటి పరిస్థితి దానికి భిన్నంగా ఉందని తెలిపారు. కోక్ ఓవెన్ బ్యాటరీలలో కోల్ లేకుండా చేయడం వెనుక స్టీల్ యాజమాన్యం కుట్ర దాగి ఉందన్నారు. పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై స్పష్టమైన ప్రకటన చేసిన పార్టీకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. లాభాల్లో ఉన్న ప్లాంట్‌పై ఆంక్షలు పెట్టి, ఇబ్బందులకు గురిచేసి పాలకులు నష్టాలవైపు నెట్టేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే విశాఖ ఉక్కు కర్మాగారం నేడు సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు. రానున్న కాలంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో–కన్వీనర్లు నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల జెఎసి చైర్మన్ మరడాన జగ్గునాయుడు, పోరాట కమిటీ ప్రతినిధులు యు.రామస్వామి, మసేన్‌రావు, కారు రమణ, డివి.రమణారెడ్డి పాల్గొన్నారు.

9 మంది ఎంపి అభ్యర్థులతో
కాంగ్రెస్ జాబితా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది మంది కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల జాబితా విడుదలైంది. ఆదివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఎపిలో 9, జార్ఖండ్‌కు చెందిన ఇద్దరు అభ్యర్థులతో కలిపి మొత్తం 11 మందితో కూడిన జాబితాను విడుదల చేశారు. ఎపికి సంబంధించి తొలి జాబితాలో 6, రెండో జాబితాలో ఐదు స్థానాలకు అభ్యర్థులను గతంలో ప్రకటించారు. ఇప్పుడు మూడో జాబితాలో తొమ్మిది మంది అభ్యర్థులను ప్రకటించారు.

పి పరమేశ్వరరావు (శ్రీకాకుళం), బొబ్బిలి శ్రీను (విజయనగరం), జంగా గౌతమ్ (అమలాపురం), గొల్లు కృష్ణ (మచిలీపట్నం), వల్లూరు భార్గవ్ (విజయవాడ), ఈద సుధాకర్‌రెడ్డి (ఒంగోలు), జె లక్ష్మీ నరసింహ యాదవ్ (నంద్యాల), మల్లికార్జున్ వజ్జల (అనంతపురం), బిఎ సమద్ షహీన్ (హిందూపురం)లను ప్రకటించారు. మొత్తం 25 లోక్‌సభ స్థానాలకు ఇండియా బ్లాక్‌లో భాగంగా సిపిఎం, సిపిఐ అరకు, గుంటూరు చెరొక్కటి పోటీ చేయగా, కాంగ్రెస్ 23 స్థానాల్లో పోటీ చేస్తుంది.

ఇజ్రాయిల్ దాడుల్లో ధ్వంసమైన భవనం, రోదిస్తున్న చిన్నారులు

రఫాపై వరుస బాంబు దాడులు

- 14 మంది చిన్నారులతో సహా 19 మంది మృతి
- వెస్ట్ బ్యాంక్‌పైనా దాడులు
- ఇజ్రాయిల్‌కు మరో 2,600 కోట్ల డాలర్లు అందజేయనున్న అమెరికా

గాజా సిటీ: అమెరికా అండ చూసుకుని యథేచ్ఛగా చెలరేగుతున్న ఇజ్రాయిల్ తాజాగా దక్షిణ గాజాలోని రఫాపై పెద్దయెత్తున దాడులకు తెగబడింది. దక్షిణ గాజాలోని ఈ నగరంపై జరిపిన వైమానిక దాడుల్లో 14 మంది పిల్లలతో సహా 19 మంది చనిపోయారు. అంతకు ముందు రోజు ఇదే ప్రాంతంలో ఆరుగురు చిన్నారులతో సహా తొమ్మిది మందిని ఇజ్రాయిల్ సైన్యం పొట్టనబెట్టుకుంది. మరణించినవారిలో ఓ నిండు గర్భిణి కూడా ఉంది. ఆమె ప్రాణాలను కాపాడేందుకు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కానీ, ఆమె గర్భంలో ఉన్న బేబీని సురక్షితంగా బయటకు తీశామని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. మరో వైపు వెస్ట్ బ్యాంక్‌లోని శరణార్థి శిబిరాలపైనా అది బాంబు దాడులకు తెగబడి అనేక మందిని అమానుషంగా పొట్టనపెట్టుకుంది. అదే సమయంలో అమెరికా ఇజ్రాయిల్‌కు 2, 600 కోట్ల అత్యవసర మిగతా 2లో

వైసిపి రహిత రాష్ట్రంగా మార్చాలి: చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని వైసిపి రహితంగా మార్చాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. 'బాబును మళ్లీ రప్పిద్దాం' కార్యక్రమంలో భాగంగా టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. అయిదేళ్లుగా ప్రజలపై పన్నులు, ఛార్జీల బాదుడును జగన్ నిర్విరామంగా కొనసాగించారని అన్నారు. పోలవరం, అమరావతిని విధ్వంసం చేసి రాష్ట్ర బ్రాండ్‌ను దెబ్బతీశారని, వీటన్నింటిపై ప్రజలను చైతన్యవంతం చేయాలని చెప్పారు. ఇసుక మాఫియా వల్ల రాష్ట్రంలో భూగర్భ జలాలు అడుగంటిపోయే పరిస్థితి నెలకొందన్నారు. జగన్ బటన్ నొక్కానని డబ్బా కొట్టుకుంటున్నారని, బటన్ నొక్కడానికి జగన్ అవసరం లేదని అన్నారు. రైతు కూలీలను నట్టేట ముంచారని తెలిపారు. టిడిపి హయాంలో తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన తిండి గింజలు పండించేలా రైతులను ప్రోత్సహించామని చెప్పారు. పట్టిసీమను పూర్తిచేసి 13 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని పేర్కొన్నారు.

వడదెబ్బకు కార్మికుడు మృతి

ప్రజాశక్తి - వెదురుకుప్పం (చిత్తూరు జిల్లా)

ఎండవేడిమి, వేడి గాలులు తాళలేక ఓ కార్మికుడు మరణించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం వెదురుకుప్పం పంచాయతీ చిన్నమ్మరెడ్డి కండ్రిక దళితవాడకు చెందిన బొమ్మసముద్రం నాగరాజా (57) ఆదివారం ఉదయం కూలి పనులకు వెళ్లారు. ఎండకు తాళలేక పని ప్రదేశంలోని తీవ్ర అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయారు. గమనించిన స్థానికులు పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు.

ప్రజలకు అభివాదం చేస్తూ..

విశాఖలో మౌనంగా సాగిన జగన్ బస్సు యాత్ర

- సిఎం మాట్లాడకపోవడంతో పలువురు నిరాశ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ ఎంవిపి కాలనీ

విశాఖ నగరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ప్రజలకు అభివాదం చేస్తూ మౌనంగానే ముందుకు సాగింది. జనం పెద్ద సంఖ్యలో హాజరైనప్పటికీ ఎక్కడా ఆయన ప్రసంగించలేదు. హనుమంతువాక, ఎండాడ వంటి చోట్ల జగన్ మాట్లాడతారని జనం ఆశించారు. తొలుత ఆయన పెందుర్తి మండలం మీదుగా గోపాలపట్నంకు చేరుకున్నారు.

ఎన్ఎడి, దుర్గాలమ్మ గుడి, మర్రిపాలెం, ఐటిఐ జంక్షన్, ఊర్వశి మీదుగా కంచరపాలెం, సత్యం జంక్షన్, మద్దిలపాలెం, వెంకోజీపాలెం, హనుమంతవాక మీదుగా బస్సు యాత్ర సాగింది. ఎండాడలో ఎక్కడికక్కడ జనం సిఎం జగన్‌కు పూలు, హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్ళు, ఒంటెలు, కోలాటాలు, పులి వేషాలు రోడ్‌షోలో ప్రధాన ఆకర్షణగా కనిపించాయి. రాత్రి 8 గంటలకు బిఆర్‌టిఎస్ రోడ్డు హనుమంతవాక జంక్షన్ జనసందోహంతో కిక్కిరిసిపోయింది. ఎండాడ జంక్షన్‌లో ఒక మహిళ జగన్‌ను పిలుస్తూ తన వద్దగల దరఖాస్తును ఇవ్వాలని చూడగా గమనించిన జగన్ ఆమె వద్దగల కాగితాలను తీసుకోవాలని సెక్యూరిటీని ఆదేశించగా వారు తీసుకున్నారు. విశాఖలోని పెందుర్తి, పశ్చిమం, దక్షిణం, తూర్పు, ఉత్తరం, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ బస్సు యాత్ర సాగింది. బస్సు యాత్రలో విశాఖపట్నం వైసిపి పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి, విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు పాల్గొన్నారు.

విశాఖ నగరంలో రోడ్డు షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్

పలువురు వైసిపిలో చేరిక

2019 ఎన్నికల్లో విశాఖ దక్షిణం నుంచి పోటీచేసిన జనసేన నాయకులు గంపల గిరిధర్, మూగి శ్రీనివాస్, భీమిలికి చెందిన విద్యావేత్త ఆలివర్‌రాయ్, శంకర్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ కృష్ణకుమార్, ఉడా మాజీ డైరెక్టర్ డి.భారతి, టిడిపి యువజన విభాగం నాయకులు చరణ్, సందీప్, కిరణ్మయి, దాసు వైసిపిలో జగన్ సమక్షంలో చేరారు.

నోరు విప్పని జగన్

జగన్ రోడ్ షోకు జనం హోరెత్తినా ఆయన నోరు విప్పలేదు. దీంతో పలువురు నిరాశచెందారు. గంటల తరబడి జనం వేచిచూడగా.. ఒక్క నిమిషం పాటు అలా అభివాదం చేస్తూ జగన్ వెళ్లిపోవడంతో పలు చోట్ల జనం అసంతృప్తికి లోనయ్యారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు మూడేళ్లుగా పోరాడుతున్నా వారి వైపు జగన్ కన్నెత్తి చూడలేదు. జీతాల సమస్యపై అదానీ గంగవరం పోర్టు కార్మికులు సమ్మెలోకి దిగడంతో కార్గో హేండ్లింగ్ మొత్తం పోర్టులో నిలిచిపోయింది. ఏళ్ల తరబడి పంచగ్రామాల భూ సమస్య కొనసాగింది. ఈ అంశాలపై మాట్లాడతారని ఆశించిన వారికి నిరాశే మిగిలింది.

వడగాడ్పులపై అప్రమత్తం

- వైద్యారోగ్యశాఖ కమిషనరు వెంకటేశ్వర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వడగాడ్పులు పెరుగుతున్న దృష్ట్యా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వడగాడ్పుల తీవ్రతను పర్యవేక్షించేందుకు, వడగాడ్పులకు గురైన వారికి చికిత్స అందించేందుకు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఒక ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లల విషయంలో మరింత శ్రద్ధ వహించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక, ఏరియా, ప్రభుత్వాస్పత్రుల్లోనూ సరిపడా ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచుకోవాలని, అంబులెన్స్‌లలో ఐస్ ప్యాక్స్‌ను తగినన్ని సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వడగాడ్పులకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం 18 రాష్ట్రాల సిఎస్‌లు, వైద్యారోగ్య శాఖాధికారులతో సమావేశం నిర్వహించిందని తెలిపారు. అధికారులంతా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను విజిట్ చేసి వడగాడ్పులపై తీసుకున్న చర్యలను, అగ్నిమాపక సంరక్షక చర్యలను పరిశీలించాలని ఆ సమావేశంలో కేంద్రం ఆదేశించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలనుసారం అన్ని బస్టాండులు, రైల్వేస్టేషన్లలో తాగునీటి సౌకర్యం, శీతల గది సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలందరికీ ఎప్పటికప్పుడు వడగాడ్పులపై అవగాహన కల్పించేందుకు వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నామని, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.



విద్యుత్ వెలుగుల్లో ఒంటిమిట్ట రామాలయం

నేడు సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట (వైఎస్ఆర్ జిల్లా)

బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండ రాముని కల్యాణానికి ఆలయ ప్రాంగణం విద్యుత్తు దీపాలు, ఆకాశమంత పందిళ్లతో కళకళలాడుతోంది. ఏకశిలానగరిలో సోమవారం సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. రాష్ట్రం నలుమూలల నుంచి రాములవారి కల్యాణానికి యాత్రికులు, సేవకులు ఒంటిమిట్టకు చేరుకున్నారు. ఆలయంలోని దత్తమండపం, ధ్వజస్తంభం, కల్యాణవేదిక విద్యుత్తు కాంతులతో కల్యాణశోభను సంతరించుకుంది. టిటిడి అధికారులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు.

మోహినీ రూపంలో శ్రీరాముడు

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం మోహినీ అలంకారంలో శ్రీరాముడు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 నుండి వైభవంగా స్వామివారి ఊరేగింపు జరిగింది. కేరళ డ్రమ్స్, చెక్కభజనలు, కోలాటాలతో, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం 5.00 గంటల నుండి ఊంజలుసేవ, రాత్రి 7 నుండి గరుడ వాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ధార్మిక, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్‌బాబు, సూపరింటెండెంట్లు హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, విశేష సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు.

ప్రతి చేతికీ పని.. ప్రతి చేనుకూ నీళ్లు

- అతి తక్కువ కాలంలో 'పోలవరం' పూర్తి
- జిఒ 217ను రద్దు చేస్తాం
- ఆక్వా రంగాన్ని ఆదుకుంటాం
- నరసాపురం, భీమవరం సభల్లో పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

టిడిపి, బిజెపి, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి చేతికీ పని, ప్రతి చేనుకూ నీళ్లు ఇస్తామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం, భీమవరంల్లో జరిగిన సభల్లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో రెండు చోట్ల తాను ఓడిపోయినా ఇంకా నిలబడి ఉన్నానంటే.. అది మీ అందరి అభిమానమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలో అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలనూ కొనసాగిస్తామని, ఎటువంటి కోతా విధించబోమని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును అతితక్కువ కాలంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 50 ఏళ్లు దాటిన బిసిలకు రూ.5 వేలు పింఛను ఇంటి వద్దకే అందిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం ఉండే బిసి రిజర్వేషన్లను వైసిపి ప్రభుత్వం 24 శాతానికి కుదించిందని విమర్శించారు. గతం మాదిరిగానే 34 శాతానికి తీసుకెళ్తామన్నారు.

లేసు అల్లికలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆక్వా రైతుల అభివృద్ధికి కృషి చేస్తామని, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. 2019 నుంచి సీడ్ ధర రూ.11 వందలకు పెరిగిందని, హేచరీలకు యూనిట్ విద్యుత్ రూ.8కు పెంచడమే కారణమన్నారు. మత్స్యకార కుటుంబాలకు హాని కలిగించే జిఒ 217ను రద్దు చేస్తామని, 51 మత్స్యకార సొసైటీలకు రుణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నరసాపురంలో నియంతృత్వ పాలన సాగుతోందని, దీన్ని తిప్పికొట్టాలని కోరారు. సజ్జల రామకృష్ణారెడ్డి తన సోదరుడు చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. రాష్ట్రంలో ఎవరికీ స్వేచ్ఛ లేకుండాపోయిందని, ప్రశ్నిస్తే కేసులు పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం సభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

వైసిపి ప్రభుత్వం కులాలను విడగొట్టుకుంటు వెళ్తే తాను కలుపుకుంటూ వెళ్తానన్నారు. బిజెపి మద్దతు లేకపోతే రాష్ట్రం అభివృద్ధి అసాధ్యమన్నారు. తాను ఈ నెల 23న పిఠాపురంలో నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. భీమవరంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజ్యం పోవాలని, ప్రశాంతమైన భీమవరం రావాలంటే అనుభవజ్ఞుడైన పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను గెలిపించాలని పవన్ కల్యాణ్ అన్నారు. గ్రంధి శ్రీనివాస్ భీమవరంలో అర్బన్ బ్యాంక్ లేకుండా చేశారని ఆరోపించారు. భీమవరంలో పోటీ చేయడానికి తన దగ్గర రూ.200 కోట్లు డబ్బు లేదని, ఓటుకు రూ.ఆరు వేలు ఇచ్చే స్తోమత లేదని తెలిపారు. గ్రంధికి డిపాజిట్లు కూడా రాకుండా చేస్తానని హెచ్చరించారు. సభలో జనసేన నరసాపురం అభ్యర్థి బొమ్మిడి నాయకర్, భీమవరం అభ్యర్థి పి.రామాంజనేయులు, బిజెపి ఎంపి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

విద్య కాషాయీకరణపైనే కన్ను!

- మోడీ హయాంలో తగ్గుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనారిటీలకు దూరమవుతున్న చదువులు
- నిలిచిన స్కాలర్‌షిప్‌లు

న్యూఢిల్లీ : కేంద్రంలో ఉన్న మోడీ సర్కారు విద్య కాషాయీకరణను పూర్తి స్థాయిలో అమలు చేస్తూనే... విద్యారంగాన్ని నానాటికీ దిగజారుస్తోంది. మోడీ హయాంలో హిందూ మతతత్వ వాదుల వాదనలకు సరిపోయేలా చరిత్ర, రాజకీయ శాస్త్రం, ఇతర విభాగాల్లో మార్పులు వచ్చాయి. ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు విద్యను పొందటంలో అంతరాయం ఏర్పడిందని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. మోడీ ప్రభు త్వం చేసిన వాగ్దానాలు, విద్యా రంగంలో వాస్తవికతపై ఫైనా న్షియల్ అకౌంటబిలిటీ నెట్‌వర్క్ ఇండియా (ఎఫ్ఎఎన్-ఇండి యా).. 'ఎడ్యుకేషన్ రిపోర్ట్ కార్డ్-2014-24' రూపొందించింది. ఈ రిపోర్ట్ కార్డ్ ప్రకారం.. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఇపి)-2020 ప్రకారం ప్రభుత్వ పాఠశాలల ఏకీకరణ ఇటీవలి సంవత్సరాలలో పెరిగింది. ఇది విద్యా హక్కు చట్టం యొక్క ఉద్దేశాన్నే దెబ్బతీస్తున్నది. 2023లోనే దేశవ్యాప్తంగా నాలుగు వేల పాఠశాలలు విలీనమయ్యాయి. మహారాష్ట్రలో పాఠశాలల విలీనం దాదాపు 2 లక్షల మంది పిల్లలపై ప్రభావం చూపింది. ఒడిశా 7,478 పాఠశాలలను మూసివేసింది. మధ్యప్రదేశ్ 35,000 పాఠశాలలను 16,000 స్థాపనలుగా విలీనం చేయాలని ప్రతిపాదించింది. ఈ చర్యలతో మారుమూల ప్రాంతాలలో చిన్నారులకు విద్య దూరమవుతోంది.

61,885 సర్కారు బడుల తగ్గుదల...
47,680 ప్రయివేటు స్కూళ్ల పెరుగుదల

2018-19 నుంచి 2021-22 మధ్య భారత్‌లో మొత్తం పాఠశాలల సంఖ్య 61,885 తగ్గింది. అంటే, 15,51,000 నుండి 14,89,115కి పడిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత ముఖ్యమైన క్షీణత (61,361) నమోదైంది. ప్రయివేటు పాఠశాలల సంఖ్య పెరగటంతో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఇది అట్టడుగు వర్గాలకు విద్యను పొందే అవకాశాన్ని పెద్ద ప్రశ్నగా మార్చింది. 2014-15లో దేశవ్యాప్తంగా 11,07,118 ప్రభుత్వ పాఠశాలలు, 83,402 ప్రభుత్వ-ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. 2021-22లో ప్రభుత్వ పాఠశాలలు 10,22,38కి, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు 82,480కి తగ్గాయి. 2014-15లో ప్రయివేట్ పాఠశాలల సంఖ్య 2,88,164 కాగా, 2021-22 నాటికి 3,35,844కి చేరాయి. అంటే, 47,680 ప్రయివేటు స్కూళ్ల పెరిగాయన్నమాట. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదిక సైతం వెల్లడించింది. మంజూరైన 62.71 లక్షల పోస్టులలో 10 లక్షల పోస్టులు రాష్ట్ర స్థాయిలో ఖాళీగా ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో అపాయింట్‌మెంట్ లెటర్ల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్థూల నమోదు నిష్పత్తి (జిఇఆర్) ప్రాథమిక నుంచి ఉన్నత స్థాయి వరకు అన్ని స్థాయిలలో క్షీణతను చూసింది. జిఇఆర్ ప్రాథమిక స్థాయిలో 103.39 తగ్గి హయ్యర్ సెకండరీ స్థాయిలో 57.56కు చేరుకున్నది. అత్యంత నష్టపోయిన అట్టడుగు వర్గాలుగా ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలు ఉన్నారు. 2022లో 2022-23 విద్యా సంవత్సరానికి ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మతపరమైన మైనారిటీలకు 1-8 తరగతులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు నిలిపివేయబడ్డాయి. ఉన్నత విద్యలోనూ ఈ వర్గాల వారికి వివిధ స్కాలర్‌షిప్‌లు నిలిచిపోయాయి. 2022లో, మోడీ ప్రభుత్వం మైనారిటీల కోసం మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌లను నిలిపివేసింది. ఇక ప్రొఫెషనల్, టెక్నికల్ కోర్సుల మెరిట్-కమ్-మీన్స్ స్కాలర్‌షిప్ కూడా 2013-14లో రూ. 243 కోట్ల నుంచి 2024-25 నాటికి రూ.33.80 కోట్లకు పడిపోయింది.

45 కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 33 శాతం ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఐఐటిలలో 40 శాతం, ఐఐఎంలలో 31.6 శాతం ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉన్నత విద్యారంగంలో దుస్థితిపై లోక్‌సభలో కేంద్రం సమాధానాన్ని నివేదిక ఉటంకించింది. పాఠశాల విద్య, అక్షరాస్యత శాఖకు మొత్తం బడ్జెట్ వ్యయంలో వాటాగా కేటాయింపులు 2013-14లో 3.16 శాతం నుంచి 2024-25లో 1.53 శాతానికి.. అంటే దాదాపు సగానికి పడిపోయాయి. ఉన్నత విద్యా శాఖకు మొత్తం బడ్జెట్ వ్యయంలో వాటాగా కేటాయింపులు 2013-14లో 1.6 శాతం నుంచి 2024-25లో 1 శాతానికి తగ్గాయి. పదేళ్ల పాలనలో మోడీ ప్రభుత్వం విద్యను కాషాయీకరణ చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నదని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. గాంధీ హత్యలో హిందూ మతతత్వ సంస్థల పాత్ర, తదుపరి సంఘ్ నిషేధం, ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల నుంచి 2002లో గుజరాత్ మత హింసకు సంబంధించిన సూచనలకు సంబంధించిన పాఠ్యాంశాల్లో వివిధ మార్పులు, తొలగింపుల గురించి ఎఫ్ఎఎన్ - ఇండియా రిపోర్ట్ కార్డ్ పేర్కొన్నది. కుల వివక్ష, దళిత ఉద్యమకారులు, కవుల రచనలు, మత సామరస్యానికి సంబంధించిన అంశాలూ తొలగిపోయాయని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.

ఛార్జిషీట్‌లో ఉన్నది మాట్లాడితే

న్యాయ స్థానం ఆంక్షలెందుకు?

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిబిఐ ఛార్జిషీట్‌లో ఉన్నది ఉన్నట్లు మాట్లాడకుండా న్యాయ స్థానాలు రాజకీయ పార్టీలకు ఆంక్షలు విధించడం సరికాదని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అభిప్రాయపడ్డారు. విజయవాడలోని దాసరిభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వివేకా హత్య కేసు గురించి, సిఎం జగన్ కేసుల గురించి మాట్లాడవద్దని కడప కోర్టు ఆదేశించడం సరికాదన్నారు. సిబిఐ ఛార్జిషీట్‌లో ఫైల్ చేసిన అంశాలే పత్రికల్లో వస్తాయని, వాటిపైనే రాజకీయ పార్టీలు మాట్లాడకూడదని ఆంక్షలు పెడితే రాజకీయ పార్టీలు ఏం మాట్లాడాలని ఆయన సందేహం వెలిబుచ్చారు. ప్రధాని మోడీ ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్తామని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. దేశంలో అవినీతికి పాల్పడి విదేశాలకు పారిపోయిన అవినీతిపరుల్ని వెనక్కి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఉత్తర భారతదేశంలో సీట్లు తగ్గుతున్నాయని అర్థంకావడంతో బిజెపి దక్షిణ భారతదేశంపై దృష్టి పెట్టిందన్నారు. తొలి విడతలో ఎన్నికలు జరిగిన తమిళనాడులో డిఎంకె, వామపక్షాలు విజయదుందుభి మోగించబోతున్నా యన్నారు. వామపక్షాలు, కాంగ్రెస్‌తో కలిసి పోటీచేస్తే వైసిపి లాభపడుతుందని కొందరు వ్యాఖ్యలు చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వామపక్ష పార్టీలు బలపడ్డాయని, కమ్యూనిస్టుల ప్రభావం కనబడుతుందని అన్నారు. కేశినేని బ్రదర్స్‌లో ఎవరు గెలిచినా ఢిల్లీలో మోడీ బ్రదర్సేనన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మద్య నిషేధం చేసి 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని చెప్పిన జగన్.. ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలు సభలు పెట్టుకోవాలంటే పోలీసులు అనుమతినివ్వడం లేదన్నారు. మీడియా సమవేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, కెవివి ప్రసాద్, ఎపి ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, కోశాధికారి ఆర్ పిచ్చయ్య పాల్గొన్నారు.

నేడు 'పది' ఫలితాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ విజయవాడలో 11 గంటలకు విడుదల చేయనున్నారు.

మార్చి 18 నుంచి 30 వరకు నిర్వహించిన పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 6.3 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను results.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చును.

అవాకులు, చవాకులు పేలితే సహించం : జనసేన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై ఎమ్మెల్యే సీటు దక్కలేదన్న అక్కసుతో వైసిపిలో చేరిన పోతిన మహేష్ అవాకులు, చవాకులు పేలుతున్నారని, ఇకపై సహించేది లేదని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ పేర్కొన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తే పెద్ద నాయకులు అయిపోరని, పోతిన మహేష్‌కు పార్టీలో ఎంతో ప్రాధాన్యమున్న పదవులు ఇచ్చారని అన్నారు. పాణ్యం నియోజకవర్గంలో జనసేన కార్యకర్త షేక్ సలామ్.. వైసిపి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ప్రశ్నించినందుకు అతనిపై దాడి చేశారని జనసేన అధ్యక్షులకు రాజకీయ కార్యదర్శి పి హరిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఐదుచోట్ల మార్పు

(మొదటిపేజీ తరువాయి)

జరగకపోవడంతో చింతమనేని ప్రభాకర్‌ను దెందులూరు నుంచి నామినేషన్ వేసుకోవాలని అధినాయకత్వం చెప్పినట్లు తెలిసింది. తంబళ్లపల్లి అభ్యర్థి జయచంద్రారెడ్డికి బదులు శంకర్‌యాదవ్‌కు టికెట్ కేటాయించే అవకాశం ఉంది.

అభ్యర్థుల చేత ప్రతిజ్ఞ

బి ఫారాలు అందుకున్న అభ్యర్థుల చేత చంద్రబాబు ప్రతిజ్ఞ చేయించారు. రానున్న 20 రోజులు కీలకమని చంద్రబాబు అభ్యర్థులతో ఈ సందర్భంగా చెప్పారు. ప్రతి అభ్యర్థీ గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టాలని కోరారు. ప్రజలు, కార్యకర్తల అభీష్టం మేరకే అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. కార్యకర్తతో ప్రతి అభ్యర్థీ అనుసంధానం కావాలని తెలిపారు. మూడు పార్టీల నేతల మధ్య సమన్వయం ఉండాలని, ఓటు బదిలీ జరగాలని సూచించారు. కొత్తగా చేరిన వారు పార్టీ లైన్ ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. వైఎస్ జగన్ ప్రతిసారీ సానుభూతితో గెలవాలని ప్రయత్నిస్తున్నారని, రాష్ట్రానికి ఏం చేశారో చెప్పుకోలేక డ్రామాలకు తెరతీస్తున్నారని విమర్శించారు. పింఛన్ల విషయంలో జగన్ చేసిన కుట్రలు, ఆడిన రాయి డ్రామాను ప్రజలు ఛీ కొట్టారని చెప్పారు.

బిజెపికి బుద్ధి చెప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

హేమంత్ సోరెన్ అరెస్టు అని ఆయన అన్నారు.

ఇండియా బ్లాక్‌కు ఓటు దేశానికి రక్ష: ఫరూక్ అబ్దుల్లా

నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా మాట్లాడుతూ "ప్రతి రాష్ట్రానికి దాని స్వంత భాష ఉంటుంది. మనమందరం కలిసినప్పుడే భారతదేశం అవుతుంది. ఈ దేశ సౌందర్యం వివిధ రంగులతో కూడుకుని ఉంది. భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన భారత దేశ సంస్కృతికి ప్రతీకగా ఉన్న రాజ్యాంగాన్నే నాశనం చేయాలని బిజెపి చూస్తోందని, ఆ ఆటలు సాగనివ్వరాదని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

రాజ్యాంగాన్ని ఎవరూ మార్చలేరు: తేజస్వి

బీహార్ మాజీ డిప్యూటీ సిఎం, ఆర్జెడీ నేత తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ "బిజెపి నేతలు, మంత్రులు రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్నారు.. ఇది బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం, దాన్ని మార్చే శక్తి ఎవరికీ లేదు. బీహార్‌లో కూడా రాజ్యాంగాన్ని మార్చుతామని వారి మంత్రులు, అభ్యర్థులు చెబుతున్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని చెప్పే మిమ్మల్ని ప్రజలే ఇంటికి సాగనంపుతారని ఆయన అన్నారు.

బిర్సా ముండా స్ఫూర్తితో బిజెపికి బుద్ధి చెబుదాం: అఖిలేష్ యాదవ్

యుపి మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ . "ఇది లార్డ్ బిర్సా ముండా పుట్టిన నేల. ఇక్కడి ప్రజలు అన్యాయానికి ఎన్నడూ తలవంచరు. ఓటు వేయడానికి వెళ్లినప్పుడు ఈ గడ్డ పోరాట చరిత్రను గుర్తుకు తెచ్చుకోండి. మీకు అన్యాయం చేసినవారికి తగిన బుద్ధి చెప్పంది ఈసారి ఓటు వేయడానికి వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఓటు వేయండి" అని పిలుపు ఇచ్చారు. ఎలక్టోరల్ బాండ్ల స్కీములో బిజెపి బండారం బయటపడిందని అన్నారు. 2014లో వచ్చిన వారు 2024లో వెళ్లిపోతారని అఖిలేష్ యాదవ్ అన్నారు. మన దేశాన్ని పదేళ్లలో వెనక్కి నెట్టడానికి కృషి చేసిన వారికి వీడ్కోలు కూడా అదే స్థాయిలో ఉండాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సారి 400 దాటుతుందనే నినాదాన్ని బిజెపి నిరంతరంగా ఇస్తోందని, కానీ వీరు నైతికంగా ఓడిపోయారని, ఢిల్లీ ముఖ్యమంత్రి, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి ఇద్దరినీ జైలుకు పంపడమే ఇందుకు నిదర్శనమని అన్నారు.

ఆకాశాన్నంటుతున్న ధరలు: ప్రియాంక చతుర్వేది

శివసేన నాయకురాలు ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ మోడీ పాలనలో ధరలు ఆకాశాన్నంటాయని, నిరుద్యోగం విల య తాండవం చేస్తోందని విమర్శించారు. మహిళలకు భద్రత లేదన్నారు. దేశంలో చాలా మంది ఓటర్లు.. తొలి దశ పోలింగ్‌కు దూరంగా ఉన్నారని, ఇది సరికాదని అన్నారు. .

యువ ఓటర్లు బయటకు వచ్చి ఓట్లు వేస్తేనే.. కేంద్రం లోని అధికారాన్ని మార్చగలమన్నారు.

రాంచీ సభకు హాజరైన హేమంత్ సోరేన్ భార్య కల్పన, కేజ్రీవాల్ భార్య సునీత

నేరం రుజువుకాకుండానే వారిని జైల్లో పెట్టారు: సునీతా కేజ్రీవాల్

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద కేజ్రీవాల్, జార్కండ్ మాజీ సిఎం హేమంత్ సొరెన్‌లపై ఆరోపణలు రుజువుకాకుండానే వారిని జైల్లో పెట్టడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వాన్ని తెలియజేస్తోందనికేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్ విమర్శించారు. అందరికీ మెరుగైన విద్య, వైద్య సౌకర్యాలు సమకూర్చడమే ఆయన చేసిన తప్పా అని ఆమె ప్రశ్నించారు. ఢిల్లీ ప్రజల కోసం కేజ్రీవాల్ తన జీవితాన్ని పణంగా పెట్టారని, ఐఐటి గ్రాడ్యుయేట్ అయిన కేజ్రీవాల్ తలుచుకుంటే విదేశాలకు వెళ్లేవారని, కానీ ఆయన దేశభక్తికే మొగ్గుచూపారని చెప్పారు. తన భర్తను తీహార్ జైలులో అంతమొందించేందుకు బిజెపి కుట్ర పన్నిందని విమర్శించారు. ఆయన తీసుకునే భోజనంపై కెమెరాలతో నిఘా పెడుతున్నారని ఆమె ఆరోపించారు. మధుమేహానికి 12 ఏళ్లుగా రోజూ ఇన్సులిన్ తీసుకుంటున్న కేజ్రీవాల్‌కు జైలులో ఇన్సులిన్ ఇవ్వడానికి కూడా నిరాకరిస్తున్నారని ఆమె అన్నారు.

రఫాపై వరుస బాంబు దాడులు

(మొదటిపేజీ తరువాయి)

సాయాన్ని అడ్వాన్స్‌గా అందజేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనను అమెరికన్ కాంగ్రెస్ శుక్రవారం ఆమోదించింది.

గత ఏడు మాసాలుగా ఇజ్రాయిల్ గాజాలో సాగిస్తున్న ఊచకోతలో మృతుల సంఖ్య 34 వేలు దాటింది. గాజాలోని రెండు అతిపెద్ద నగరాలు ధ్వంసమయ్యాయి. గాజా జనాభాలో 80 శాతానికి పైగా ఇళ్లను వీడి ఇతర ప్రాంతాలకు పారిపోయారు. గాజా ప్రజలకు మానవతా సాయం అందకుండా ఇజ్రాయిల్ అడ్డుకోవడంతో అనేక మంది చిన్నారులు, వృద్ధులు ఆకలి రక్కసిబారిన పడుతున్నారు. గాజలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలితో సహా అంతర్జాతీయ సమాజం చేస్తున్న విజ్ఞప్తులను నెతన్యాహు ప్రభుత్వం బేఖాతరు చేస్తోంది. రఫాపై నిరంతర దాడులు చేస్తూ ఈ ప్రాంతంలో పెను విపత్తును సృష్టిస్తోంది. ఇంకో వైపు వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనా శరణార్థి శిబిరంపై భయంకరమైన దాడులకు దిగుతోంది. పాలస్తీనీయులపైకి ఇజ్రాయిలీ సెటర్లచే దాడులు చేయిస్తోంది. మానవ హక్కులను కాలరాస్తోంది. ఇజ్రాయిల్ దాష్టీకాలకు వ్యతిరేకంగా వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనీయులు పెద్దయెత్తున ఆందోళనలు చేపట్టారు. ఇదేదో ఇజ్రాయిల్ సైన్యంలోని ఒక చిన్న విభాగం చేసిన తప్పిదంగా చిత్రించేందుకు అమెరికా ప్రయత్నించింది. ఇజ్రాయిల్ రక్షణ దళానికి చెందిన నెట్జా యహుదా బెటాలియన్‌పై ఆంక్షలు విధించబోతున్నట్లు అమెరికన్ మీడియా ద్వారా లీకులిస్తోంది. ఇరాన్ ఇజ్రాయిల్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు అలానే కొనసాగుతున్నాయి. ఇజ్రాయిల్‌పై ప్రతీకార చర్య తీసుకున్న ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్‌ను ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఆదివారం ప్రశంసించారు. మరోవైపు హమాస్ చీఫ్ హనీయేతో టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ఆదివారం ఇస్తాన్బుల్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈజిప్టు సరిహద్దును ఆనుకుని వున్న దక్షిణ గాజాలోని రఫాపై ఇజ్రాయిల్ హంతక దాడులతో తలెత్తిన పరిస్థితిపై వీరిరువురూ చర్చించినట్లు తెలిసింది.

ప్రజావాణి వినిపిస్తాం

అసెంబ్లీకి కమ్యూనిస్టులను గెలిపించండి • సిపిఎం అభ్యర్థుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తూ.. ప్రజలకు అండగా ఉంటున్న తమను గెలిపించాలని సిపిఎం అభ్యర్థులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శాసన సభకు కమ్యూనిస్టులను పంపాలని, ప్రజల వాణి వినిపించే అవకాశం ఇవ్వాలని కోరారు. కూటమికి, వైసిపికి ఓటేస్తే రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. పదేళ్ల బిజెపి పాలనలో రాష్ట్రానికి ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమ కూడా రాలేదని, ఉన్న విశాఖ ఉక్కును కూడా అమ్మేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని సింగ్‌నగర్, రాజీవ్‌నగర్, హుడా కాలనీలో సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు ముమ్మరంగా ప్రచారం చేశారు. సామాన్యులకు అందుబాటులో ఉండేది కమ్యూనిస్టులేనని తెలిపారు. విజయవాడ అభివృద్ధి చెందాలంటే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సింగ్‌నగర్ నుండి రాజీవ్‌నగర్ కండ్రిక వరకు కమ్యూనిస్టులు కార్పొరేటర్‌గా ఉన్న సమయంలోనే అభివృద్ధి జరిగిందని తెలిపారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలో గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలోని అగ్రహారం కొండమొదలు, మంటూరు, ఏనుగులపేట, బీంపల్లి గ్రామాల్లో అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్స, రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ప్రచారం చేపట్టారు. విఆర్.పురంలో ఆటో మైక్ ప్రచారం సాగింది. డుంబ్రిగుడ, అరకులోయ, జి.మాడుగుల మండలాల్లోని ఇంటింటి ప్రచారం చేశారు. మారేడుమిల్లి మండల కేంద్రంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇండియా వేదిక అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు 65వ వార్డులోని భానోజీతోట, బాపూజీ కాలనీ, నేతాజీ కాలనీ, వాంబే కాలనీ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయన ప్రచారానికి కార్మికవర్గం నుంచి విశేష స్పందన లభించింది. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం కొట్టు, గుణదతీలేసు, కెమిశీల, తొడుము, పాలెం పంచాయతీల్లో, గుమ్మలక్ష్మీపురం మండలంలోని రాయగడ జమ్మూ, చాపరాయి బిన్నిడి గ్రామాల్లో, కురుపాం మండలం ఊసకొండలో అభ్యర్థి మండంగి రమణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలోని షరీన్‌నగర్, రాఘవేంద్రనగర్, బద్రీనాథ్ నగర్‌లో డి.గౌస్‌దేశాయ్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ తనకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. తనను గెలిపిస్తే పాణ్యం నియోజకవర్గం దశ, దిశ మారుస్తామని హామీ ఇచ్చారు. కల్లూరు అర్బన్ పరిధిలోని 37, 41 వార్డుల్లో గౌస్ దేశాయ్ గెలుపును కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. కల్లూరు కాలనీలలో ప్రజలకు తాగునీటి కష్టాలు తీరాలంటే ఇండియా వేదిక బలపరుస్తున్న సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. నెల్లూరు నగరంలోని రేబాల వీధి, స్టోన్ హౌస్ పేట, తడికల బజారు సెంటర్, రామచంద్రపురం ప్రాంతాల్లో సిపిఎం అభ్యర్థి మూలం రమేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెల్లూరు నగరాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి, తాడేపల్లిలో సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావును గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. మరోసారి బిజెపి అధికారంలో వస్తే దళితులు, ముస్లిం, క్రైస్తవుల మనుగడ ప్రశ్నార్థకంగా ఉంటుందని వివరించారు. బిజెపితో అంటకాగిన టిడిపి, వైసిపిని ఓడించాలని కోరారు.

ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సిహెచ్.బాబూరావు

విశాఖలోని 65వ వార్డులో జగ్గునాయుడుకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

కూటమికి చిరంజీవి మద్దతిచ్చినా మా విజయానికి ఢోకాలేదు

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి 80 శాతం ప్రజలకు అందిందని, ఎవరు.. ఎవరితో కలిసొచ్చినా గెలుపు మాత్రం వైసిపిదేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. టిడిపి, బిజెపి, జనసేన కూటమికి చిరంజీవి మద్దతిచ్చినా తమకు ఏమాత్రం నష్టం లేదని, జగన్ విజయానికి ఏమాత్రం డోకా లేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పెనుమలూరులో మీడియాతో మాట్లాడారు. చిరంజీవి కూటమికి మద్దతు ప్రకటించడంతో తమకు మరింత క్లారిటీ వచ్చిందన్నారు. రాష్ట్రంలో అధికారం కోసం నానా జాతి సమితి ఒకవైపు, మంచి చేసిన మేము ఒకవైపు ఉన్నామని చెప్పారు. కూటమికి ఎలాంటి రాజకీయ అజెండా లేదని, కేవలం అధికారం కోసం అనైతిక కూటమి కట్టారని అన్నారు. పెనుమలూరు వైసిపి నుంచి గెలిచిన ఎమ్మెల్యే టిడిపిలోకి ఫిరాయించారని, ఈసారి పెనుమలూరు నుంచి జోగి రమేష్ గతం కంటే ఎక్కువ మెజారిటీతో విజయం సాధిస్తారని అన్నారు. పవన్‌కల్యాణ్ ఒక పరిపక్వతలేని రాజకీయ నాయకుడని విమర్శించారు.

బాబు, పవన్ రెచ్చగొట్టడం వల్లే సిఎంపై దాడి

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రెచ్చగొడుతూ చేసిన ప్రసంగాల వల్లే సిఎం జగన్‌పై దాడి చేసి, హత్యాయత్నానికి ప్రయత్నించారని వైసిపి ఎమ్మెల్యే ఎంఎ హాఫీజ్‌ఖాన్ అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమికి ఓటమి తప్పదనే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని దౌర్జన్యాలతో అడ్డదారుల్లో పోతోందని అన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, ఇలాంటి విషం గక్కే ప్రసంగాలను ఎన్నికల కమిషన్ నియంత్రించాలని కోరారు. బిజెపితో కలిసి వెళ్తున్న టిడిపికి రాష్ట్రాభివృద్ధిపై చిత్తశుద్ధి వుంటే విశాఖ స్టీల్ ప్లాంట్‌పై, ప్రత్యేక హోదాపై బిజెపితో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

టిడిపి ఎన్‌ఆర్‌ఐ విభాగంపై చర్యలు తీసుకోండి

- సిఇఒ మీనాకు వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల నిబంధనావళికి వ్యతిరేకంగా టిడిపి ఎన్‌ఆర్‌ఐ విభాగం వ్యవహరిస్తోందని, దానిపై చర్యలు తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఇఒ ఎంకె మీనాను వైసిపి తరపున మాజీ మంత్రి రావెల కిశోర్‌బాబు, పార్టీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి, లీగల్ సెల్ నాయకులు శ్రీనివాసరెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. టిడిపి ఎన్‌ఆర్‌ఐ విభాగం మంగళగిరిలోని వారి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కనీసం వెయ్యి మంది ఓటర్లను కొనుగోలు చేయాలని కన్వీనర్ కోమటి జయరామ్ మాట్లాడారని, ఈ అంశంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. సిఎం జగన్‌పై చంద్రబాబు, పురందేశ్వరి, పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్‌ను 26లోపు సమర్పించాలి

- సిఇఒ మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు వారి పోస్టల్ బ్యాలెట్ (ఫారమ్ నెంబరు 12)ను సమర్పించే తేదీని ఈ నెల 26 వరకు పొడిగించినట్లు సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 22 వరకు పోస్టల్ బ్యాలెట్ సమర్పించేందుకు చివరి తేదీ అనే ప్రచారంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటి వరకు చాలా మందికి పోస్టల్ బ్యాలెట్లు అందకపోవడం, ఏ జిల్లాలో ఓటు వేయాలో లేదా ఏ నియోజకవర్గంలో సమర్పించాలో తెలియక చాలా మంది ఉద్యోగుల్లో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలో సిఇఒ ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. ఉద్యోగులు ఎక్కడ పనిచేస్తుంటే అక్కడే ఫారం-12ను పూర్తి చేసి, అక్కడే సమర్పించాల్సి ఉంటుంది. ఇతర జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ ఫస్ట్ సెంట్రల్ ఎక్స్ఛేంజ్‌ను ఈ నెల 28న సచివాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఎక్స్ఛేంజ్-2 ఓటు వేయని పోస్టల్ బ్యాలెట్లు మే 3న, మే 8న ఫెసిలిటేషన్ సెంటర్‌లో సమర్పించాల్సి ఉంటుంది. ఉపయోగించని బ్యాలెట్లు, మిగిలిపోయిన వాటిని మే 10న వెలగపూడిలోని కలెక్టర్ల సమావేశం హాలులో నోడల్ అధికారులకు అప్పజెప్పి రసీదులు తీసుకోవాల్సి ఉంటుందని సిఇఒ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మే 8లోపు ఓటు హక్కు వినియోగించుకోని వారు తర్వాత ఓటు హక్కును వినియోగించుకునే హక్కు ఉండదని పేర్కొన్నారు. అన్ని బ్యాలెట్ పేపర్లు అనెగ్జర్-6తో సహా వాటిని స్ట్రాంగ్ రూమ్స్‌లో భద్రపరచాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

పదేళ్లుగా బిజెపి వెన్నుపోటు

- ఆ పార్టీకి వైసిపి, టిడిపి గులాంగిరీ
- ఎపి న్యాయ్ యాత్రలో వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

పదేళ్లుగా రాష్ట్రానికి బిజెపి వెన్నుపోటు పొడుస్తోందని, అలాంటి బిజెపికి రాష్ట్రంలోని వైసిపి, టిడిపి గులాంగిరీ చేస్తున్నాయని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల విమర్శించారు. ఆమె చేపట్టిన ఎపి న్యాయ్ యాత్ర ఆదివారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సాగింది. కర్నూలు చౌక్ బజార్, నంద్యాల జిల్లా నందికొట్కూర్ పటేల్ సెంట్రల్‌లో నిర్వహించిన బహిరంగ సభల్లో షర్మిల మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో కర్నూలు అభివృద్ధి చెందిందా? అని ప్రశ్నించారు. కనీసం మంచి నీళ్ల కూడా ఇవ్వలేని పరిపాలన రాష్ట్రంలో సాగుతోందన్నారు. కర్నూలును న్యాయ రాజధాని చేస్తామని సిఎం ఆర్భాటంగా ప్రకటించారని, కనీసం ఇక్కడ ఒక్క ఇటుకైనా వేశారా? అని ప్రశ్నించారు. వైఎస్ఆర్ ప్రారంభించిన ప్రాజెక్టులన్నీ అలాగే నిలిచిపోయాయన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి బిజెపి అధికారంలోకి వచ్చిందని, కనీసం లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. నాలుగున్నరేళ్ల సిఎం జగన్ నిద్రపోయి ఎన్నికల ముందు సిద్ధం అంటూ బయలు దేరారన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయని, కరెంట్, బస్సు ఛార్జీలను పెంచేశారని, రూ.వంద ఇచ్చి రూ.వెయ్యి తీసుకుంటున్నారని, అన్ని రకాలుగా దోచుకుంటున్నారని వివరించారు. రాష్ట్రంలో టిడిపి వచ్చినా, వైసిపి వచ్చినా బిజెపితో కలుస్తాయని, ప్రజలు ఆలోచించి ఓటువేయాలని కోరారు. మతాల మధ్య చిచ్చు పెట్టి ఆ మంటలో బిజెపి చలి కాచుకుంటుందని, అలాంటి బిజెపికి వైసిపి, టిడిపి మద్దతునిస్తున్నాయని తెలిపారు. సంక్షేమ పాలన కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాద రాజ్యం నడుస్తోందన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను దెబ్బకొట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్థర్ మాట్లాడుతూ..ఐదేళ్ల వైసిపి పాలనలో నరకం అనుభవించానని, కనీసం మాట్లాడేందుకు సిఎం జగన్ అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ నాయకులు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వివేకా జీవితాన్ని తప్పుగా చూపిస్తున్నారు

వివేకానందారెడ్డి జీవితాన్ని తప్పుగా చూపిస్తున్నారని, అది దారుణమని షర్మిల అన్నారు. బస్సు యాత్ర భోజన విరామ సమయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఎన్నికల ప్రచారం కోసం వివేకా హత్యను వాడుకుంటున్నామని అనేది సరైంది కాదన్నారు. నిందితులకు శిక్ష పడి ఉంటే తాము రోడ్ల మీదకు వచ్చే వాళ్లం కాదని తెలిపారు. జగన్ తనకు అప్పు ఇచ్చారని, అదే తాను అఫిడవిట్‌లో పేర్కొన్నానని చెప్పారు. చెల్లికి ఏ అన్న అయినా వాటా ఇవ్వాలని, అది ఆడబిడ్డ హక్కు అని తెలిపారు.

కర్నూలు చౌక్ బజార్‌లో మాట్లాడుతున్న షర్మిల

పోస్టల్ బ్యాలెట్‌ను తగ్గించేందుకు కుట్ర

- టిడిపి ఎమ్మెల్సీ అశోక్ బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపికి గుణపాఠం చెప్పేందుకు ఉద్యోగులు సిద్ధమయ్యారని తెలిసి పోస్టల్ బ్యాలెట్లపై కుట్రలకు తెరలేపారని టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్ బాబు విమర్శించారు. టిడిపికి ఓటు వేస్తారనే భయంతోనే తగ్గించేందుకు కొందరు అధికారులతో చేతులు కలిపి కుట్ర చేస్తుందని ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓట్లు నమోదు కాకుండా చేసేందుకు అయోమయానికి గురి చేస్తూ ఎలక్షన్ కమిషన్ సర్క్యూలర్ అందకుండా చేశారని తెలిపారు. ఆదేశాలు లేవంటూ ఫారం 12ను తీసుకోవడం లేదని, ఫారం 12ను తీసుకున్నా ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. నోడల్ ఆఫీసర్లు ఎవరో ఇంకా స్పష్టత లేదన్నారు. ఫారమ్ 12ను ఉద్యోగస్తుల నుంచి తీసుకోవాల్సిన బాధ్యత నియోజకవర్గాల్లో డ్యూటీలో ఉన్న ఎఆర్ఒ, ఆర్ఒలదేనని అన్నారు. ఎన్నికల విధుల్లోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ఓటు తప్పనిసరిగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల కమిషన్‌కు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య లేఖ రాశారు. 5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వర్తించబోతున్నారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్లపై పిఒ, ఎపిఒలకు ట్రైనింగ్ ఇచ్చినట్లుగా ఒపిఒలకు శిక్షణ ఇవ్వాలని కోరారు.

జగన్ వల్లే ఐసియులో స్టీల్ ప్లాంటు : పట్టాభిరామ్

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 90 శాతం ఉత్పత్తి పడిపోయిందని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. కోకింగ్ కోల్ దిగుమతి కోసం ఉన్న ప్రత్యేక బెర్త్, వందెకరాల స్టాక్‌యార్డ్ మాయం అయ్యాయని విమర్శించారు. గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పోర్టు స్తంభించిందని, దీంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా నిలిచిపోయిందని పేర్కొన్నారు. గంగవరం పోర్టు మూసివేతకు, స్టీల్ ప్లాంట్ ఐసియులో చేరడానికి కారకుడు జగన్ అని విమర్శించారు.

పొలిట్‌బ్యూరోలోకి సీతారామలక్ష్మి

రాజ్యసభ మాజీ సభ్యులు తోట సీతారామలక్ష్మిని టిడిపి పొలిట్‌బ్యూరోలోకి తీసుకుంది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎన్నికల సమన్వయకర్తగా, నరసాపురం పార్లమెంటు అధ్యక్షులుగా మంతెన రామరాజును నియమించారు. కొమ్మి లక్ష్మయ్య నాయుడును పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించారు.

హత్య చేసి.. ఆపై భయంతో.. సెల్ టవర్ ఎక్కి యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పట్టణంలో జులాయిగా తిరుగుతున్న ఓ యువకుడు 13 ఏళ్ల బాలుడితో దొంగిలించిన వస్తువులు పంచుకునే విషయంలో మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో బాలుడి గొంతు నులిమి హత్య చేశాడు. ఈ హత్యోదంతం బయటపడుతుందన్న భయంతో సెల్‌టవర్ ఎక్కి.. ఆ యువకుడు ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలో ఆదివారం జరిగింది. సిఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వడ్డే నాగరాజు (24) జులాయిగా తిరుగుతూ పట్టణంలోని ఓ స్క్రాప్ దుకాణంలో పనిచేస్తున్న శేఖర్ (13)తో పరిచయం పెంచుకున్నారు. వీరిద్దరూ కలిసి రెండ్రోజుల క్రితం శేఖర్ పనిచేస్తున్న స్క్రాప్ దుకాణంలోనే కేబుల్ వైర్‌ను దొంగతనం చేశారు. అయితే ఆ వైర్‌ను పంచుకునే విషయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో దొంగతనం విషయం యజమానికి శేఖర్ చెప్పాడు. యజమాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విషయం తెలిసిన నాగరాజు.. శనివారం శేఖర్ గొంతు నులిమి బావిలో పడేశాడు. ఈ హత్య విషయం కూడా బయటకు వస్తుందేమోనన్న భయంతో సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకున్నాడు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (भारत सरकार का उपक्रम / భారత ప్రభుత్వ రంగ సంస్థ)
గవర్నర్‌పేట బ్రాంచి (01451): # 27-18-85, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, ఎ.పి - 520002

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి ఆధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు /హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, భౌతికంగా స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన బకాయి మొత్తమును ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా ది. 14-05-2024న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు రిజర్వు ధర మరియు ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.

1) ఋణగ్రహీత / హామీదారుల వివరములు : మెస్సర్స్ విక్టరీ ఎంటర్‌ప్రైజెస్, శ్రీ మునగాల శ్రీ రామచంద్రమూర్తి, డి.నెం. 76/14/244/2, టీచర్స్ కాలనీ, భవానీపురం, విజయవాడ, ఎపి - 520012. 2) శ్రీమతి మునగాల ఉమా శ్రీలక్ష్మి, భర్త : మునగాల శ్రీరామచంద్రమూర్తి, ఫ్లాట్ నెం. ఎ-405, వజ్ర రెసిడెన్సీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా, ఎపి - 522502. 3) శ్రీ గోలి రాజేష్ కుమార్, తండ్రి : గోలి పూర్ణ చంద్రరావు, డోర్ నెం. 41-20/8-1, హైస్కూల్ రోడ్డు, కృష్ణలంక, విజయవాడ- 520013, ఎపి.
బకాయి మొత్తం : ది. 15-04-2021 నాటికి రూ. 13,71,823.33/- (అక్షరాలా పదమూడు లక్షల డెభై ఒక్క వేయి ఎనిమిది వందల ఇరవై మూడు రూపాయలు ముప్పై మూడు పైసలు మాత్రమే) మరియు ఒప్పందం చేసుకున్న రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : (సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 3102/2006, తేది : 25-08-2006) శ్రీ మునగాల శ్రీరామచంద్రమూర్తి గారి పేరిట కృష్ణా జిల్లా, విజయవాడ, రామవరప్పాడు గ్రామం & పంచాయితీ, రాజుల బజారు, పాత అసిస్‌మెంట్ నెం. 324, ఆర్.ఎస్.నెం. 121/4, డి.నెం. 4-104/23, డి.నెం. 3-82/2 వద్ద నిర్మించిన సాయి టవర్స్ నందు 3వ అంతస్తులోని ఫ్లాట్ నెం. టిఎఫ్-3. అపార్ట్‌మెంట్‌కి హద్దులు : తూర్పు : పంచాయితీ రోడ్డు, దక్షిణం : పంచాయితీ రోడ్డు, పడమర : శ్రీ లక్ష్మణరాజు, శ్రీమతి తులసమ్మ గార్ల ఆస్తి, ఉత్తరం : శ్రీ అద్దగిరి రాజు గారి ఆస్తి, ఫ్లాట్‌కి హద్దులు : మొత్తం 645 చ॥గ॥ల స్థలములోని అవిభక్త వాటా 20.5 చ॥గ॥ల స్థలము మరియు 582.00 చ॥అ॥ల విస్తీర్ణంలోని నిర్మాణము ఉన్నది. హద్దులు : తూర్పు : ఫ్లాట్ నెం. టిఎఫ్-4కి మరియు ఈ ఆస్తికి మధ్య జాయింట్ గోడ, దక్షిణం : కారిడార్, పడమర : కారిడార్, ఉత్తరం : శూన్యాకాశము.

రిజర్వు ధర : రూ. 13,00,000/- ధరావత్తు : రూ. 1,30,000/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

2) ఋణగ్రహీత / హామీదారుల వివరములు : శ్రీ వేమూరు వెంకటేశ్వర్లు, తండ్రి : శ్రీ విశ్వేశ్వరరావు, డి.నెం. 29-28-5, దాసరి వారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ.
బకాయి మొత్తం : ది. 30-04-2021 నాటికి రావలసిన బకాయి మొత్తం రూ. 18,83,510.28 /- (అక్షరాలా పద్దెనిమిది లక్షల ఎనభై మూడు వేల ఐదు వందల పది రూపాయల ఇరవై ఎనిమిది పైసలు మాత్రమే) మరియు ది. 01-05-2021 నుండి ఒప్పందం చేసుకున్న రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : సెక్యూరిటీ డాక్యుమెంట్ నెం. 3070/2013, తేది : 18-05-2013 : శ్రీ వేమూరు వెంకటేశ్వర్లు, తండ్రి : విశ్వేశ్వరరావు గారి పేరిట ఎపి, విజయవాడ, విజయవాడ రూరల్, ప్రసాదంపాడు, డి.నెం. 5-84, అసిస్ట్ నెం. 479, ఆర్.ఎస్.నెం. 57/7 నందు అవిభక్తవాటా 32.0 చ॥గ॥ల ఆస్తితోపాటు మొత్తం 484.00 చ॥గ॥ల విస్తీర్ణంలో నిర్మించిన రాజగోపాల్ టవర్స్ గ్రూప్ హౌస్ నందు 935 చ॥అ॥ల విస్తీర్ణంతో మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం. ఎఫ్ఎఫ్. -3. అపార్ట్‌మెంట్‌కి హద్దులు : ఉత్తరం : ఇతరుల ఆస్తి, దక్షిణం : రోడ్డు, తూర్పు : ఇతరుల ఆస్తి, పడమర : మండవ వెంకట రత్న కుమార్ గారి ఆస్తి, ఫ్లాట్‌కి హద్దులు : ఉత్తరం : శూన్యాకాశము, దక్షిణం : శూన్యాకాశము, తూర్పు : శూన్యాకాశము, పడమర : కామన్ కారిడార్

రిజర్వు ధర : రూ. 18,79,000/- ధరావత్తు : రూ. 1,87,900/- బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://www.ibapi.in మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్ సైట్ : www.unionbankofindia.co.in నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు, ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం పైన పేర్కొన్న తేది నందు అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్ శ్రీమతి టి. శ్రీలక్ష్మి గారి మొబైల్ నెం. 73061 42248 (M) బ్రాంచి Mail ID : ubin0801453@unionbankofindia.bank లలో సంప్రదించవచ్చు.

చట్టబద్ధమైన ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/ రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు

చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఈ-వేలం అమ్మకం నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీత / సహబాధ్యతగల వారికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని చట్టం 8(6) రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

తేది : 19-04-2024
ప్రదేశం : విజయవాడ
సం/- ఆథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

HDFC BANK
We understand your world
రిజిష్టర్డ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్, ముంబాయి-400013.
బ్రాంచ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్, # 50-96-5, ప్లాటు నెం.175, సీతమ్మధార, పాత ఎస్‌బిహెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

డిమాండ్ నోటీసు

Letter No.HDFC/DFSO/13(2)/19-03/1 తేది.19.03.2024

టు,
1) మెస్సర్స్ మహేంద్ర జ్యూయలరీ మార్ట్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : శ్రీ సోలంకి భవేష్, డోర్ నెం.11/49/49, శివాలయం వీధి, వన్ టౌన్, విజయవాడ-500001.
2) శ్రీ సోలంకి భవేష్, తండ్రి. శ్రీ శాంతిలాల్ సోలంకి, డోర్ నెం.11-10-27, 1వ అంతస్తు, అమ్మిశెట్టి వారి వీధి, వన్ టౌన్, విజయవాడ, కృష్ణా జిల్లా-520001.
3) శ్రీమతి స్నేహ కొత్తారి, తండ్రి. అశోక్ కుమార్ కొత్తారి, డోర్ నెం.11-10-27, 1వ అంతస్తు, అమ్మిశెట్టి వారి వీధి, వన్ టౌన్, విజయవాడ, కృష్ణా జిల్లా-520001.
4) శ్రీమతి చంపా దేవి సోలంకి, భర్త. శ్రీ శాంతిలాల్ సోలంకి, డోర్ నెం.11-10-27, 1వ అంతస్తు, అమ్మిశెట్టి వారి వీధి, వన్ టౌన్, విజయవాడ, కృష్ణా జిల్లా-520001.
శ్రీ/శ్రీమతి,

విషయం : సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ యొక్క సెక్షన్ 13(2) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ - 2002 (సర్ఫేసి యాక్ట్ - 2002) ప్రకారం జారీ చేయబడిన నోటీసు

మీ కోరిక ప్రకారం హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్ వారు క్యాష్ క్రెడిట్ ఋణ సౌకర్యం కల్పించినారని మీకు తెలియును. దిగువ తెలిపిన సదరు ఋణం కొరకు వివిధ పత్రములను సెక్యూరిటీ క్రింద బకాయి చెల్లించుట కొరకు మీరు అమలు చేసినారు. నెం.1 గా ఉన్న మీ పేరున బ్యాంకు వారు మంజూరు చేసిన సదరు ఋణ వివరములు దిగువ తెలుపబడినవి.

వ.నెం.	సౌకర్యం యొక్క స్వభావం	పరిధి	తేది.29.02.2024 నాటికి బకాయి మొత్తం
1)	Cash Credit (A/c No.50200046230172)	430.00 లక్షలు	రూ.4,68,85,393.49
2)	WC-Term Loan-GECL (A/c No.8108014)	75.00 లక్షలు	రూ.24,07,866.38
3)	ADHOC Cash Credit	140.00 లక్షలు	0
మొత్తం		645.00 లక్షలు	రూ.4,92,93,259.87

ఈ పై ఋణసౌకర్యము పొందుటకు, మీరు అనేక భద్రత పత్రములను, హామీతో కూడిన దస్తావేజులను, ఇతర భద్రతా పత్రములను మరియు నిల్వల తాకట్టు, పుస్తక జమలు మరియు భద్రతా ఆసక్తితో కూడిన ఈ క్రింది షెడ్యూలులో వివరముగా చెప్పిన సమాన నిష్పత్తితో ఆస్తులను తనఖా ఉంచినారు.

మీచే పొందబడిన ఋణసౌకర్యము ఖాతా సక్రమముగా నిర్వహించబడక మీలో నెం.1 వారు ఋణమొత్తము మరియు వడ్డీ సకాలములో చెల్లింపక, విఫలమైనారు. కనుక మీ ఋణఖాతా తేది.15.11.2023 న ఆర్‌బిఐ వారి నిబంధనల ప్రకారం నిరర్థక ఆస్తిగా వర్గీకరించటమైనది.

కనుక బ్యాంక్ వారు బకాయి మొత్తములను తిరిగి పొందుటకై మీలో నెం.1, ప్రొప్రయిటర్ 2, హామీదారులు 3 మరియు 4 అందరూ కలిసిగాని, లేక విడివిడిగా కాని తేది.29.02.2024 నాటికి (చెల్లించవలసిన) బకాయి మొత్తములను పూర్తిగా రూ.4,92,93,259.87 పై (అక్షరాల నాలుగు కోట్ల తొంభై రెండు లక్షల తొంభై మూడు వేల రెండు వందల యాభై తొమ్మిది రూపాయల ఎనభై ఏడు పైసలు మాత్రమే) మరియు భవిష్య వడ్డీతో కలిపి చెల్లించవలసిందిగా కోరటమైనది.

సర్ఫేసి చట్టం 2002 నందలి నిబంధనల ద్వారా ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంటు) రూల్స్ 2002 ద్వారా ఈ దిగువ సంతకందారుడు బ్యాంకు వారిచే అధీకృత అధికారిగా నియమించబడినారు.

సదరు చట్టం సెక్షన్ 13(2) ద్వారా సంక్రమించిన అధికారములతో మీరు అందరు కలిసిగాని లేక విడివిడిగా కాని బ్యాంక్ వారికి చెల్లించవలసిన ఋణ మొత్తములను తేది.29.02.2024 నాటికి రూ.4,92,93,259.87 పై (అక్షరాల నాలుగు కోట్ల తొంభై రెండు లక్షల తొంభై మూడు వేల రెండు వందల యాభై తొమ్మిది రూపాయల ఎనభై ఏడు పైసలు మాత్రమే) చెల్లించవలసిన మరియు భవిష్యవడ్డీ, కాస్ట్స్ మరియు అన్ని ఇతర ఖర్చులు, ఈ ప్రకటన అందిన 60 రోజులలోగా చెల్లించవలెను. అట్లు చెల్లించని ఎడల, సదరు చట్టం సెక్షన్ 13(4) ప్రకారం ఈ దిగువ తెల్పిన ఆస్తుల పై తదుపరి చర్యలు తీసికొనగలరు.

సదరు చట్టంలో గల సెక్షన్ 13(13) ప్రకారం మీరు అమ్మకం / లీజు లేదా ఇతర విధములుగానూ నోటీసులోని తనఖాలో ఉన్న సెక్యూర్డు ఆస్తులను గాని అందలి భాగములు గాని ఏవిధముగానూ బ్యాంకు వారి వ్రాత పూర్వక అనుమతి లేనిదే బదిలీ చేయరాదు.

సదరు చట్టంలో గల సెక్షన్ 13(6) ప్రకారం బ్యాంకు వారికి సంక్రమించిన అధికారములతో ఈ సెక్యూర్డ్ ఎసెట్స్‌పై పూర్తి హక్కులు, బదిలీ హక్కులతో సహా కలిగి ఉన్నది. బ్యాంకు వారిచే జరుపబడే అన్ని బదిలీలు, చర్యలు ఆస్తి యజమానిచే చేయబడినవిగా భావించవలెను. ఇందుమూలముగా మీరు ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజులలోగా అన్ని ఋణ మొత్తములను మరియు అట్టి వసూలు కొరకు అగు అన్ని ఖర్చులు, కాస్ట్స్ మరియు ఛార్జీలు పూర్తిగా చెల్లించని యెడల బ్యాంకు వారు సదరు పై చట్టము ప్రకారము తదుపరి చర్యలు తీసుకొనగలరు. అయిననూ బ్యాంకు వారి పూర్తి బకాయి మొత్తములు వసూలు కాని యెడల చట్ట ప్రకారం మీపై మరియు హామీదారుల పై తగు చర్యలు తీసుకొనగలరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇతర చట్టబద్ధ / చర్యల ప్రకారం ఇతర చట్ట బద్ధంగా ప్రస్తుతం అమలులో ఉన్న నియమముల ప్రకారంగా అనుకూలమైన చర్యలు బ్యాంకు వారు తీసుకొనుటకు ఎటువంటి పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీచేయబడినది. సదరు చట్టం ప్రకారం మీరు సదరు ఆదేశములకు విరుద్ధము / ఏదేని నిరోధము విరుద్ధంగా ప్రవర్తించుట నేరముగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఆస్తుల వివరములు

షెడ్యూల్-ఎ : 1) విజయవాడ రూరల్ మండలం-521212, నున్న గ్రామం & గ్రామ పంచాయితీ, ఆర్.ఎస్.నెం.722/1, పాత అసెస్‌మెంట్ నెం.2029, ప్రస్తుతం అసెస్‌మెంట్ నెం.3704 వద్ద గల విస్తీర్ణం 173.13 చ॥గ॥లులోని పాత డోర్ నెం.15-35, కొత్త డోర్ నెం.15-21 తో ఉన్న ఖాళీ భూమి ఆస్తి. (దస్తావేజు నెం.6472/2022, తేది.02.11.2022 ఎస్.ఆర్.ఓ నున్న, దస్తావేజు హోల్డర్ శ్రీ భవేష్ సోలంకి గారి పేరున కలదు) దస్తావేజు ప్రకారం హద్దులు : ఉత్తరం : 0.00 అ॥లు - హద్దు లేదు, దక్షిణం : 48 అ॥లు - శారత ఫౌండ్రీ గోడ, తూర్పు : 65 అ॥లు - కొనుగోలుదారునికి అమ్మినది, పడమర : 80.9 అ॥లు - విజయవాడ నుండి నూజివీడు రోడ్డు.
2) విజయవాడ రూరల్ మండలం-521212, నున్న గ్రామం & గ్రామ పంచాయితీ, ఆర్.ఎస్.నెం.722/1, పాత అసెస్‌మెంట్ నెం.2029, ప్రస్తుతం అసెస్‌మెంట్ నెం.3704 వద్ద గల విస్తీర్ణం 357.12 చ॥గ॥లులోని పాత డోర్ నెం.15-35, కొత్త డోర్ నెం.15-21 తో ఉన్న ఖాళీ భూమి ఆస్తి. (దస్తావేజు నెం.6470/2022, తేది.02.11.2022 ఎస్.ఆర్.ఓ నున్న, దస్తావేజు హోల్డర్ శ్రీమతి చంపా దేవి సోలంకి గారి పేరున కలదు) దస్తావేజు ప్రకారం హద్దులు : ఉత్తరం : 49.6 అ॥లు - 30 అ॥ల రోడ్డు, దక్షిణం : 49.6 అ॥లు - శారత ఫౌండ్రీ గోడ, తూర్పు : 65 అ॥లు - ఎ. సాయి కుమారి, పడమర : 65 అ॥లు - పి. రమేష్ గారికి అమ్మినది.
3) విజయవాడ రూరల్ మండలం-521212, నున్న గ్రామం & గ్రామ పంచాయితీ, ఆర్.ఎస్.నెం.722/1, పాత అసెస్‌మెంట్ నెం.2029, ప్రస్తుతం అసెస్‌మెంట్ నెం.3704 వద్ద గల విస్తీర్ణం 241.66 చ॥గ॥లులోని పాత డోర్ నెం.15-35, కొత్త డోర్ నెం.15-21 తో ఉన్న ఖాళీ భూమి ఆస్తి. (దస్తావేజు నెం.6471/2022, తేది.02.11.2022 ఎస్.ఆర్.ఓ నున్న, దస్తావేజు హోల్డర్ శ్రీ భవేష్ సోలంకి గారి పేరున కలదు) దస్తావేజు ప్రకారం హద్దులు : ఉత్తరం : 33.6 అ॥లు - 30 అ॥ల రోడ్డు, దక్షిణం : 33.6 అ॥లు - శారత ఫౌండ్రీ గోడ, తూర్పు : 65 అ॥లు - పి. మీనాక్షి గారికి అమ్మినది, పడమర : 65 అ॥లు - కొనుగోలుదారునికి అమ్మినది.
షెడ్యూల్-బి : యజమాని మరియు ఆస్తి యజమానుల వ్యక్తిగత హామీదారు, పుస్తక ఋణములు & రావలసినవి మరియు నిల్వలు.

స్థలం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,

త్రిపుర రాష్ట్రానికి సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన సిపిఎం నేత మాణిక్ సర్కార్ తన భార్యతో ఇలా రిక్షాలో వచ్చి శుక్రవారం ఓటు వేశారు.

మణిపూర్‌లో 11 చోట్ల నేడు రీపోలింగ్

ఇంఫాల్: లోక్‌సభ తొలిదశ ఎన్నికలు ఈ నెల 19న జరిగాయి. ఇందులోభాగంగా ఇన్నర్ మణిపూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని 11 చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ కేంద్రాల్లోకి దుండగలు చొరబడి బెదిరింపులకు పాల్పడ్డారు. ఇవిఎంలను ధ్వంసం చేశారు. దీంతో ఆ 11 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 22న (సోమవారం) రీపోలింగ్ నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈమేరకు మణిపూర్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ప్రకటించారు. తొలి దశ లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ 19న ఈ పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికల్ని లెక్కలోకి తీసుకోలేదని వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం రీపోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా లోక్‌సభ తొలి దశలో భాగంగా శుక్రవారం మణిపూర్‌లోని ఇన్నర్ మణిపూర్, ఔటర్ మణిపూర్ స్థానాల్లో 72 శాతం పోలింగ్ నమోదయింది.

కొన్ని చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని, కాంగ్రెస్ ఇన్నర్ మణిపూర్‌లో 36 చోట్ల, ఔటర్ మణిపూర్‌లో 11 పోలింగ్ కేంద్రాల్లో, మొత్తం 47 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని ఎన్నికల ప్రధాన అధికారికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది.

పార్లమెంట్‌లో ప్రజల గొంతుక ఎలమరం కరీం



- రాజ్యసభలో కీలక ప్రసంగాలు
- మోడీ ప్రభుత్వ దురాగతాలపై నిలదీత
- మంత్రిగా, ఎంఎల్‌ఎగా, కార్మిక నేతగా ప్రజలకు చేరువ
- కోజికోడ్ సిపిఎం అభ్యర్థి

జె జగదీష్

కేరళలో కోజికోడ్ లోక్‌సభ నియోజకవర్గానికి సిపిఎం తరపున పోటీ చేస్తున్న ఎలమరం కరీం తన రాజకీయ జీవితాన్ని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలతో ప్రారంభించారు. ఆయన ఉత్తమ పార్లమెంటేరియన్. రాజ్యసభలో కార్మిక గొంతుగా నిలిచిన ఎలమరం కరీం, ఇప్పుడు లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. శ్రామిక వర్గ రాజకీయాల అంస్సారాన్ని ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేసే అద్భుతమైన ఉపన్యాసశైలి ఉన్న కరీం, దేశంలోనే పేరున్న ట్రేడ్ యూనియన్ నాయకునిగా పేరుగడించారు.

మోటారు కార్మికుల సమస్యలపై పోరాటాలు

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. కేరళ స్టూడెంట్ ఫెడరేషన్ (కెఎస్‌ఎఫ్)తో ప్రజా క్షేత్రంలోకి వచ్చిన ఆయన, రాష్ట్రంలో ప్రైవేట్ మోటారు రవాణా రంగంలోని సమస్యలపై అనేక ఆందోళనలు నిర్వహించారు. మోటారు కార్మికుల సంఘాల ఐక్య వేదిక ఏర్పడటంలో కీలక పాత్ర పోషించారు. మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. మోటారు వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో సభ్యుడయ్యారు. 1996లో కోజికోడ్ రెండవ నియోజకవర్గం నుంచి, 2006లో, 2011లో బేపూర్ నుంచి ఎమ్మెల్యే గా గెలిచారు. 2006లో పరిశ్రమల శాఖ మంత్రిగా జెనీవాలో జరిగిన ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఓ) సదస్సులో పాల్గొన్నారు. లేబర్, టెక్స్‌టైల్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు. పార్లమెంటులో భారీ పరిశ్రమల కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడుగా ఉన్నారు. కోజికోడ్ మెడికల్ కాలేజీ సమీపంలోని కోవూరులో నివసిస్తున్నారు. ఆయనకు భార్య రహమత్, పిల్లలు పికె సుమి, పికె నిమ్మి ఉన్నారు.

పిఎస్‌యుల పటిష్టానికి కృషి

రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎలమరం 2006లో విఎస్ అచ్యుతానందన్ మంత్రివర్గంలో వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల సహకారంతో కొత్తగా ఏడు పారిశ్రామిక ప్రాజెక్టులు ప్రారంభించారు.

లౌకికవాదం కోసం...

ప్రస్తుతం రాజ్యసభ సభ్యునిగా ఉన్న ఎలమరం... లౌకికవాద భారతదేశం కోసం ఎలాంటి శషభిషలూ లేకుండా అందరికంటే ముందుండి పోరాడుతున్న సిపిఎం విధానాన్ని రాజ్యసభ ద్వారా ప్రజల చెంతకు తీసుకెళ్లారాయన. రాజ్యసభలో సిపిఎం పక్ష నాయకునిగా కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను, ఫాసిస్టు తరహా చర్యలను వ్యతిరేకించినందుకు కరీంను రెండుసార్లు పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేశారు. సభలో ప్రతిపక్ష పార్టీలను సమన్వయం చేస్తూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హెూదా, నల్ల వ్యవసాయ చట్టాలు, కార్మిక చట్ట సవరణలు, ట్రిపుల్ తలాక్‌ను తొలగింపు బిల్లులపై కరీం సభలో చేసిన ప్రసంగాలు జాతీయ దృష్టిని ఆకర్షించాయి.



మా పార్టీ బిజెపిలో విలీనం కాదు : హెచ్‌డి కుమారస్వామి

బెంగళూరు : బిజెపిలో జనతాదళ్ (సెక్యులర్) పార్టీ విలీనం అవుతుందనే వార్తలపై ఆ పార్టీ అధ్యక్షుడు హెచ్.డి కుమారస్వామి స్పందించారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'మా పార్టీని వేరే పార్టీలో విలీనం చేసే ప్రశ్నే లేదు. ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇరు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి ' అని ఆయన అన్నారు. ప్రధాని మోడీకి, దేవెగౌడకు మధ్య సంబంధాలపై ఆయన ఈ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... 'మోడీ జాతీయ రాజకీయాల్లోకి వచ్చిన సమయంలో దేవెగౌడ సైతం ఆయనను విమర్శించారు. అయినా మోడీ ప్రధాని అయ్యాక దేవెగౌడను కలిశారు. కాంగ్రెస్‌ను ఓడించే సత్తా మా పార్టీకే ఉంది. కాంగ్రెస్ పార్టీ పేరులో సెక్యులర్ అనే పదాన్ని తొలగించారు' అని కుమారస్వామి విమర్శించారు.

'నాకు, నా మేనల్లుడికి రక్షణ లేదు'.. మమతా బెనర్జీ

కోల్‌కతా : తనకు, తన మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి భద్రత లేదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కుమార్ గంజ్ టీఎంసీ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి బిప్లబ్ మిత్రా తరుపున ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మమతా మాట్లాడుతూ.. 'బీజేపీ తనను, తన మేనల్లుడిని టార్గెట్ చేస్తోంది. రాష్ట్రంలో మాకు భద్రత లేదు. మేము సురక్షితంగా లేము. అయితే బిజెపి కుట్రలకు మేం భయపడం. టిఎంసి నాయకులు, రాష్ట్ర ప్రజలపై కుట్ర జరగకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నాము.' అని ఆమె అన్నారు.

సోమవారం ఓ అంశం టీఎంసీని, ఆ పార్టీ అగ్రనేతల్ని కుదిపేస్తుందంటూ ప్రతిపక్ష బీజేపీ నేత సువేందు అధికారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలపై మమతా బెనర్జీ తాజాగా స్పందించారు. సువేందు అధికారిని ఉద్దేశించి మమతా మాట్లాడుతూ.. 'తన కుటుంబాన్ని అక్రమ సంపదను కాపాడుకోవడానికి బీజేపీలో చేరిన ఒక దేశద్రోహి. అతని తాటాకు చప్పుళ్లకు మేం బెదరబోము.' అని ఆమె స్పష్టం చేశారు.

1952 నుంచి ఇప్పటివరకూ ఐదుసార్లు విభిన్న కారణాలతో మధ్యంతర ఎన్నికలు నిర్వహించకుండా ఉంటే, ప్రతి లోక్‌సభ తన ఐదేళ్ల కాలాన్ని పూర్తి చేసి ఉంటే 15వ లోక్‌సభ ఎన్నికలు 2021లో జరిగేవి. కాగా స్వతంత్ర భారతంలో 1952 మొదటి లోక్‌సభ ఎన్నికలు ఎంతో ఆసక్తికరం. 1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అనుసరించడం ద్వారా ప్రపంచంలో భారతదేశం అతిపెద్ద పోలింగ్ దేశమైంది.

మొదటి ఎన్నిక

లోకసభ స్థానాలు	489
ఓటర్లు	17,32,12,343
నిరక్షరాస్యులు	10,59,00,000
సమయం	4 మాసాలు
బ్యాలెట్ పెట్టెలు	12 లక్షలు
బ్యాలెట్ పత్రాలు	62 కోట్లు

తొలి సార్వత్రికం సాగిందిలా..

హిమాచల్‌లో మొదటి ఓటు

అక్టోబర్ 25, 1951న మొదటి ఓటు ప్రస్తుత హిమచల్ ప్రదేశ్‌లోని 'చీని' ప్రాంతంలో పడింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 364 సీట్లను గెలిచి కేంద్రంలో అధికారం చేపట్టింది. భారత కమ్యూనిస్టు పార్టీ 16 సీట్లు గెలిచి, రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆచార్య నరేంద్ర యాదవ్, జయప్రకాష్ డాక్టర్ లోహియా నేతృత్వంలోని సోషలిస్టు పార్టీకి 12, ఆచార్య జె.బి కృపాలనీ నేతృత్వంలోని కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ 9, హిందూ మహాసభకి 4, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ నేతృత్వంలో భారతీయ జనసంఘ్‌ 3, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ 3, షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫెడరేషన్‌కు రెండు సీట్లు లభించాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ సుమారు 4కోట్ల 76లక్షల 65వేల 951 (44.99 శాతం) ఓట్లు సాధించింది. భారత కమ్యూనిస్టు పార్టీ 34లక్షల 84వేల 401 (3.29 శాతం) ఓట్లు సాధించింది.ఆ సమయంలో నియోజకవర్గాల్లో ఒకటికంటే ఎక్కువ సీట్లు (ద్విసభ్య నియోజకవర్గాలు) ఉండేవి. కాబట్టి 489 స్థానాల కోసం 401 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. ద్విసభ్య విధానాన్ని 1960లో ఆపేశారు.

నాలుగు నెలల ప్రహసనం

మొదటి సాధారణ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. 489 లోక్‌సభ స్థానాలు, రాష్ట్రాల శాసనసభలకు సంబంధించి 3,283 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. దేశ వ్యాప్తంగా 17కోట్ల 32 లక్షల 12 వేల 343 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఇందులో 10కోట్ల 59 లక్షల మంది, అంటే సుమారు 85 శాతం మంది నిరక్షరాస్యులు. వారి విలువైన ఓటుతో ప్రజా ప్రతినిధులను ఎన్నుకొని ప్రపంచాన్ని ఆశ్చర్య పడేలా చేశారు. 25 అక్టోబర్ 1951 నుంచి 21 ఫిబ్రవరి 1952 వరకూ సుమారు నాలుగునెలలపాటు జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియలో భారతదేశం ఓ కొత్త శకంలోకి అడుగుపెట్టింది.

తొలి సిఇసి సుకుమార్ సేన్

భారత తొలి ఎన్నికలకు సుకుమార్ సేన్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. ఓటర్లు ఓటు నమోదు చేసుకునే ప్రక్రియ నుంచి రాజకీయ నాయకుల ఎన్నికల గుర్తులను, పోలింగ్ కేంద్రాలు పరిశుభ్రంగా ఉంచే పని, అర్హత కలిగిన అధికారులను ఎంపిక చేసే ప్రక్రియ ఇవన్నీ ఆయనే స్వయంగా ఎలాంటి పొరపాట్లు లేకుండా చేశారు.

అభ్యర్థికో బాక్స్

అప్పట్లో లోక్‌సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికలు పూర్తిచేయాలంటే అంత సులవైన పనేమీ కాదు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను నమోదు చేసుకోవడం, మెజారిటీ ఓటర్ల నిరక్షరాస్యతను దృష్టిలో ఉంచుకుని పార్టీలు, అభ్యర్థులు ఎన్నికలగుర్తులను ఎంపిక చేసేవారు. అప్పట్లో బ్యాలెట్‌కాగితాలపై పేరు, గుర్తులు ఉండేవి కాదు. ప్రతి పార్టీకి ఒక బ్యాలెట్ బాక్సు ఉండేది. వాటిపై ఎన్నికల గుర్తును ప్రచురించేవారు. వీటికోసం ఐరన్‌తో చేసిన రెండు కోట్ల 12 లక్షల బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేశారు. సుమారు 62 కోట్ల బ్యాలెట్లు ముద్రించబడ్డాయి. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్లు సంబంధిత పోలింగ్ ప్రాంతాలకు చేర్చడమంటే అప్పట్లో బాగా సమస్యాత్మకంగా ఉండేది. రవాణా మార్గాలు ఇప్పటిలా లేవు. ఇలాంటి పరిస్థితిలో కొండలు, అడవులు, మైదాన ప్రాంతాలను నదులు దాటుకుని సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకునేవారు. చాలామంది అనారోగ్యాల బారిన పడడం, కొంతమంది చనిపోవడం, మరికొందరు తప్పిపోవడం వంటివి కూడా జరిగాయి. ఈశాన్య మయన్మార్ (బర్మా) సరిహద్దు ప్రాంతం నుంచి మణిపూర్‌లోని పర్వత ప్రాంతాల్లోని స్థానిక ప్రజలతో అక్కడి అధికారులు కొన్ని ఒప్పందాలను కుదుర్చుకునేవారు. అదేంటంటే, ఓటింగ్ మెటీరియల్‌ను పోలింగ్ ప్రాంతాలకు సురక్షితంగా చేరిస్తే, వారికి బదులుగా ఒక దుప్పటి, లైసెన్స్ గన్ ఇస్తామని చెప్పడమే. ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఒప్పందాలు చేసుకునేవారు.

కలం బాణాలు

ఎపిలో ఎన్డీఏ కూటమి మంచి పరిణామం : చిరంజీవి

తమ్ముడిపై చిరంజీవి
ప్రేమతెలుసు గానీ
అందుకొరకు ఎన్డీయే
వంతపాడనేమి?

కేంద్రంతో సంబంధం
అందరికీ వున్నా
ఆంధ్రావనికేంవొరిగెను
అక్షరాల సున్నా!

రిక్షాలో వెళ్లి ఓటు వేసిన త్రిపుర మాజీ ముఖ్యమంత్రి

ఇరువదేళ్ళ ఓ సిఎం
రిక్షాలో ప్రయాణం
సతీమణితో జీవితమే
అరుణారుణ ప్రస్థానం

పదవులతో విర్రవీగు
మిడిమేలపు కాలం
ఆడంబరమే గిట్టని
ఆశయాల మాణిక్యం



దూరదర్శన్ న్యూస్ చిహ్నానికి కాషాయ రంగు

దేశానికే మతరంగు
పూసిన మన మోడీ
చిన్ని చిహ్నమే నిన్ను
వదిలేనా డీడీ!

పాతబడిన రేడియోతో
కనిపెట్టెను మన్ కీ బాత్
ప్రచారక్ ప్రధానికద
ధ్యాసఅదే అనుదిన్ రాత్

తె.ర

గిరిజనోద్యమాల సారథి.. అప్పలనర్స

- సిపిఎం అరకు ఎంపి అభ్యర్థిగా పోటీ

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అరకు లోక్‌సభ (ఎస్‌టి రిజర్వుడ్) నియోజకవర్గం నుంచి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదివాసీ ఉద్యమ నేత పాచిపెంట అప్పలనర్స ఇప్పటికే ప్రచారంలో గిరిజన గ్రామాల్లో దూసుకుపోతున్నారు. ఆయన ప్రస్తుతం సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శిగా, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులుగా, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1983లో అరకులోయ మండలం, బొండం గ్రామంలో గిరిజన రైతు కుటుంబంలో ఆయన జన్మించారు. విద్యార్థి దశ నుంచే పోరాటాల్లో మమేకమయ్యారు. ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ కార్యవర్గ సభ్యులుగా పనిచేశారు. 2008లో విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంపుదల కోసం నాటి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఏడు రోజులు నిరాహార దీక్ష చేపట్టారు. 2011 నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో గిరిజనోద్యమాలకు నాయకత్వం వహిస్తూ వచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతమంతటా విస్తృతంగా పర్యటించారు. తన ఉద్యమ ప్రస్థానంలో 15 రోజులపాటు జైలు జీవితం గడిపారు. 2013లో హుకుంపేట మండలంలో

ఆదివాసీలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని నిర్వహించిన భూ పోరాటంలో కీలకపాత్ర పోషించారు. ఆదివాసీలకు స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని 2010 నుంచి నేటి వరకూ ఉద్యమాలు నడుపుతూ వస్తున్నారు. పారా మెడికల్ సిబ్బంది సమస్యలపైనా, సిహెచ్‌డబ్ల్యుల సమస్యలపైనా ఉద్యమించారు. బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ పోరాటాలు చేపట్టారు. బాక్సైట్ పోరాటంలో కీలక భూమిక పోషించారు. కాఫీ రైతులు, మాతృభాషా వాలంటీర్ల సమస్యలపైనా ఉద్యమించారు. జిఓ 3 పునరుద్ధరణ కోసం న్యాయ పోరాటం సాగిస్తున్నారు.

ఆదివాసీల హక్కులను హరిస్తున్న వారిని ఓడించండి

'ఆదివాసీల హక్కులను హరిస్తున్న బిజెపిని, దానికి మద్దతు పలుకుతున్న టిడిపి, జనసేనను, వినాశకర వైసిపిని ప్రజలు ఓడించాలి. ఆదివాసీలకు అండగా నిలుస్తున్న సిపిఎంను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి అరకు పార్లమెంటు పరిధిలోని ప్రజలు గెలిపించాలి. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్‌ను కల్పించే జిఓ 3 రద్దుతో ఆదివాసీ యువత తీవ్రంగా నష్టపోయింది. ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నా వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే పార్లమెంటులో ఈ ప్రాంత ప్రజల గొంతు వినిపిస్తా' అని అప్పలనర్స 'ప్రజాశక్తి'కి తెలిపారు.

40 ఏళ్లుగా ప్రజలతో ఉన్నా..!

నెల్లూరు సిటీ సిపిఎం అభ్యర్థి మూలం రమేష్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజలతో 40ఏళ్లుగా కలిసి ఉన్నా... విద్యార్థి దశ నుంచే వామపక్షాల పట్ల ఆకర్షితుడయ్యా.. విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల్లో పనిచేశా..ఇప్పటికీ ప్రజలతోనే నడుస్తున్నా పార్టీ పోటీచేయాలని ఆదేశాలిచ్చింది. గతంలో కార్పొరేటర్‌గా పనిచేశాను.. అతి సాధారణ కుటుంబంలో పుట్టాను. 1983లో ఎస్‌ఎఫ్‌ఐలో చేరారు. అప్పటి నుంచి విద్యార్థి సమస్యలపై పోరాటం చేశాను. అప్పటి నుంచి పార్టీ, ప్రజా సంఘాల్లో పనిచేస్తున్నా..జక్కా వెంకయ్య పార్టీ పెద్దల స్ఫూర్తితో నేటికి నమ్మిన సిద్ధాంతం కోసం ముందుకు సాగుతున్నా, జిల్లాలో జరిగిన అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొన్నా. సారా వ్యతిరేక ఉద్యమంలో నడిచా. పాదయాత్ర చేశాను, నలభై సంవత్సరాల్లో జరిగిన ప్రజా పోరాటాల్లో ఉన్నాను. జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నా పార్టీ ఇక్కడ నుంచి పోటీయాలని నిర్ణయించింది. నెల్లూరు నగర ప్రజలు చాలా తెలివైనవారు. జిల్లాలోనూ, నెల్లూరు నగరంలో జరిగే అనేక ప్రజాఉద్యమాల కారణంగానే హక్కులు సాధించుకున్నారు. నెల్లూరు నగరంలో ప్రభుత్వం పది వేల ఇళ్ల స్థలాలు పంపిణీ చేసుంటుంది. సిపిఎం నిర్వహించిన పోరాట ఫలితంగా సుమారు 20 వేల మందికి ఇంటి స్థలాలు ఇచ్చాం. రేషన్‌కార్డులు, ఇంటి పన్నులు, విద్యుత్ పోరాటం, రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సదుపాయాలు ఇవన్నీ సిపిఎం పోరాట ఫలితంగానే అధికార పార్టీలు చేశాయంటే అతిశయోక్తి కాదు. ఇది నెల్లూరు ప్రజలకు తెలుసు. ఈ విషయాలనే నేను ప్రచారం చేస్తున్నా, ఓ వైపు వేల కోట్లు ఉన్న పి.నారాయణ టిడిపి నుంచి పోటీ చేస్తున్నారు. అధికార వైసిపి అండతో ఖలీల్ కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నారు. మా పార్టీ , ప్రజల ఇస్తున్న ధైర్యంతో వాళ్ల ముందుకు వెళుతున్నా ప్రజా తీర్పు ఎలా ఉన్నా మేం ఏం చేశామో అదే చెబుతున్నాం

ఏ రంగంలోనైనా మహిళలదే విజయం

- డ్వాక్రా, స్త్రీనిధి లబ్ధిదారులు, మహిళలతో నారా బ్రాహ్మణి

ప్రజాశక్తి - మంగళగిరి, రూరల్ (గుంటూరు జిల్లా)

భూమి కంటే ఎక్కువ భారం మోసేది మహిళ అని, పిల్లలను పెంచడమే కాదు... పెద్ద పెద్ద పరిశ్రమలను నడపడం కూడా తెలుసని, మహిళలు ఏ రంగంలో అడుగుపెట్టినా విజయం ఖాయమని నారా బ్రాహ్మణి అన్నారు. స్త్రీ శక్తి లేకపోతే ఈ సృష్టే లేదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరి విటిజెఎస్ డిగ్రీ కళాశాల ఫంక్షన్ హాలులో స్త్రీనిధి లబ్ధిదారులు, మహిళా మిత్ర, డ్వాక్రా గ్రూపు మహిళలతో ఆమె సమావేశమయ్యారు. మహిళల కోసం ఎన్‌టి రామారావు ఎంతోచేశారని, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పంచాయతీల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తు చేశారు. ఆయన బాటలోనే మహిళా సంక్షేమానికి మాజీ సిఎం చంద్రబాబునాయుడు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని, రాష్ట్రంలో పెద్ద ఎత్తున డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి, దీపం పథకం కింద లక్షలాది మందికి గ్యాస్ కనెక్షన్లు అందించారని చెప్పారు. చంద్రబాబుపై నమ్మకంతో అమరావతి రైతులు భూములిచ్చారని, వైసిపి ప్రభుత్వ వైఖరి వల్ల నేడు వారు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో సంక్షేమం, అభివృద్ధిని తిరిగి గాడిలో పెట్టాలంటే టిడిపి-జనసేన-బిజెపి కూటమి ప్రభుత్వం రావాలని అన్నారు. అంతకుముందు మంగళగిరి రూరల్ మండలం బెతపూడిలో మల్లెతోటల వద్ద మహిళా కార్మికులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

బేతపూడిలో మల్లె తోటల వద్ద మహిళలతో మాట్లాడుతున్న బ్రాహ్మణి

రోజా హ్యాట్రిక్‌కు 'అసమ్మతి' సెగ

- నామినేషన్ రోజూ కీలక నేతలు దూరం
- నగరి నియోజకవర్గంలో గ్రూపుల పోరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానని సవాల్ చేస్తున్నారు. అయితే సొంత పార్టీ వైసిపిలోనే ఆమెకు గత నాలుగేళ్లుగా అసమ్మతి సెగ వెంటాడుతూనే ఉంది. నగరి మున్సిపల్ ఎన్నికల్లో మొదలైన విభేదాలు అసెంబ్లీ ఎన్నికలొచ్చేసరికి తారాస్థాయికి చేరుకున్నాయి. శుక్రవారం రోజా నామినేషన్ సందర్భంగా నగరి వినాయకస్వామి ఆలయం వద్ద పూజలు చేశారు. అయితే కీలక నేతలు ఎవరూ ఆమె వెంట ఉండకపోవడం నియోజకవర్గంలో చర్చగా నిలిచింది. సొంత గూటిలో వాళ్లు వెంట లేకుండా, కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఈ నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు.

రెండు ఎన్నికల్లోనూ స్వల్ప మెజార్టీనే

2014, 2019 ఎన్నికల్లో రోజా స్వల్ప మెజార్టీతోనే గట్టెక్కారు. 2014లో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడుతో తలపడ్డారు. 871 ఓట్ల తేడాతో హమ్మయ్యా అని బయటపడ్డారు. 2019లో ముద్దుకృష్ణమనాయుడు తనయుడు గాలి భానుప్రకాష్‌రెడ్డిపై పోటీచేసి 2,007 ఓట్లు తేడాతో గెలుపొందారు. వైసిపి అధికారంలోకి రావడంతో రోజా దశ తిరిగింది. ఎపిఐఐసి ఛైర్మన్‌గానూ, క్రీడా, టూరిజం శాఖ మంత్రిగానూ పనిచేశారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఇండియా వేదిక నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి బరిలో ఉన్నారు. అతనికి బంధువర్గం నగరి, పుత్తూరులో ఎక్కువగా ఉంది. అలాగే రోజా గెలుపునకు కృషి చేసిన రెడ్డివారి చక్రపాణిరెడ్డి, జడ్‌పిటిసి మురళీనాథరెడ్డి తమ సపోర్టు గాలి భానుప్రకాష్‌కే అని పరోక్షంగా ప్రకటించారు. అమ్ములు, వెంకటముని, లక్ష్మీపతి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. పుత్తూరు, నగరి, విజయపురం, వడమాలపేట, నింద్ర మండలాలు ఉండగా, మంత్రి రోజాకు గత ఎన్నికల్లో వడమాలపేట, నింద్ర ఓట్లే ఎక్కువ మెజార్టీని తెచ్చాయి. దీంతో అప్పట్లో గట్టెక్కారు. అయితే ఈసారి అసమ్మతి సెగ ఈ మండలాల్లో ఎక్కువగా ఉంది. రెండు ఎన్నికల్లోనూ స్వల్ప మెజార్టీనే

మున్సిపల్ ఎన్నికలపుడు ముసలం

నగరి, పుత్తూరు మున్సిపల్ ఎన్నికల్లో రోజా తన మార్కు రాజకీయాన్ని చాటుకున్నారు. ఛైర్మన్ గిరి.. పదవులు ఆశిస్తున్న సీనియర్లను పక్కన పెట్టి టిడిపి నుంచి వైసిపిలోకి వలసొచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడంతో ముసలం ప్రారంభమైంది. నగరికి చెందిన పిజె కుమార్, శ్రీశైలం బోర్డు ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, వడమాలపేట జడ్‌పిటిసి మురళీనాథ్‌రెడ్డి, నింద్ర సింగిల్ విండో ఛైర్మన్ లక్ష్మీపతి, వెంకటముని తదితర సీనియర్లను దూరం చేసుకున్నారు. జిల్లాలో కీలకంగా ఉన్న ఓ మంత్రి అసమ్మతిని పెంచి పోషించారన్న విమర్శలూ లేకపోలేదు. తనకు తెలియకుండానే తనను వ్యతిరేకిస్తున్న నింద్రకు చెందిన రెడ్డివారి చక్రపాణిరెడ్డికి శ్రీశైలం ఛైర్మన్ పదవి ఇప్పించారని అప్పట్లో ఆర్‌కె రోజా గుర్రుమన్నారు. పుత్తూరుకు చెందిన హరికి మున్సిపల్ ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. స్థానికంగా ఉన్న కౌన్సిలర్లు తామూ రేస్‌లో ఉన్నామని, వలసొచ్చిన వారికి ఛైర్మన్ గిరి కట్టబెట్టారని ఆమెపై నిరసన గళం విప్పారు. ఇలా మొదలైన అసమ్మతి పెరుగుతూ గత నాలుగైదు నెలలుగా 'జగన్‌ను గెలిపిస్తాం.. రోజాకు టికెట్ ఇస్తే ఓడించి తీరుతాం' అంటూ అసమ్మతి వర్గం బహిరంగంగానే ఘాటైన విమర్శలు చేస్తూ వచ్చింది. రోజాకు వ్యతిరేకంగా ధర్నాలు సైతం చేపట్టారు. ఓ దశలో రోజాకు టికెట్ డౌటేనని చర్చ నడిచింది. ఎట్టకేలకు రోజాకు టికెట్ లభించింది.

జగన్ బస్సుకు డిపో మేనేజర్ కాపలా!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రస్తుత సాధారణ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థుల గెలుపు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కడప జిల్లా ఇడుపులపాయ నుంచి శ్రీకాకుళం జిల్లా టెక్కలి వరకు బస్సు యాత్ర చేపట్టారు. మార్చి 27న బస్సు యాత్ర మొదలైంది. ఏప్రిల్ 24న ముగుస్తోంది. ఇదంతా రాష్ట్ర ప్రజానీకానికి తెలిసిందే. కాగా జగన్ ప్రయాణిస్తున్న బస్సు గురించి తెలిస్తే జనం అవాక్కవ్వాల్సిందే. సిఎం కోసం ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ మెయిన్ డిపో దాదాపు మూడున్నర కోట్ల రూపాయలతో బస్సును కొనుగోలు చేసింది. మరికొన్ని నిధులతో ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. అంతేనా, యాత్ర ముగిసే వరకు ఆ బస్సును కంటికి రెప్పలా కాపాడుకొనేందుకు ఏకంగా ఒక సీనియర్ డిపో మేనేజర్‌ను

నిరంతర ప్రత్యక్షణ కోసం ఆర్టీసీ నియమించింది. విజయవాడ ఆటోనగర్ బస్ డిపో మేనేజర్ బస్సుకు అనుక్షణం కాపలాగా ఉంటున్నారు. వంద, రెండు వందల బస్సులు కలిగిన డిపోకు కార్యనిర్వహణాధికారిగా వ్యవహరించాల్సిన సీనియర్ అధికారి ఒక్క సిఎం బస్సుకు కస్టోడియన్ కావడం విచిత్రం. యాత్రలో బస్సుకు చిన్న గీత పడినా, మచ్చలు పడినా, దుమ్ము ధూళి పడినా ఊరుకోవట్లేదు. దగ్గరుండి మరీ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. డ్రైవర్లను, సహాయకులను ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల సభల్లో వందల కిలోమీటర్లు రోజుల తరబడి బస్సు తిరుగుతోంది. ఇరుకు సందులు, గొందుల్లోకీ పోనీమంటున్నారు. కిక్కిరిసిన జనం మధ్యలోకీ వెళ్లమంటున్నారు. వైసిపి నేతలను గుంపులుగా బస్సుపైకి, లోపలికి అనుమతిస్తున్నారు. కానీ బస్సుకు మాత్రం ఏమీ కావొద్దని అధికారులు హుకుం జారీ చేస్తున్నారని ఆర్టీసి సిబ్బంది వాపోతున్నారు. కాగా ప్రత్యేకంగా బస్సు కొనుగోలు చేసింది ముఖ్యమంత్రి అధికారిక పర్యటనల కోసమని, ఒక్క జగన్ కోసమే కాదని, ఎవరు ముఖ్యమంత్రిగా ఉన్నా ఉపయోగ పడుతుందని ఆర్టీసి చెబుతోంది. కాగా ఎన్నికల కోడ్ వచ్చాక ముఖ్యమంత్రికి బస్సు సమకూర్చడంపై అభ్యంతరాలొస్తున్నాయి. అధికారిక పర్యటనలు కాదు ఎన్నికల ప్రచారం కోసం అయినందున బస్సు వినియోగానికి అద్దె వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా బస్సు యాత్ర దగ్గరికి ఉన్నతాధికారులొస్తున్నారని టిడిపి నేతలు విమర్శిస్తున్నారు. అందుకు వైసిపి నేతలు గట్టిగా కౌంటర్ ఇస్తున్నారు. చంద్రబాబు సిఎంగా ఉండగా రాజమండ్రిలో గోదావరి పుష్కరాల సమయంలో తొక్కిసలాట జరిగి 30 మంది చనిపోయినప్పుడు, ఆ ప్రాంతంలో ప్రత్యేక బస్సులో బాబు కుంటుంబం ఉందని, తొక్కిసలాట ప్రాంతం నుంచి బాబు ఉన్న బస్సును ఉన్నతాధికారులు కొంత దూరం నెట్టుకుంటూ వెళ్లారని గుర్తు చేస్తున్నారు.

2014 ఎన్నికలు - రాష్ట్ర విభజన - కాంగ్రెస్ ఓటమి

2009 ఎన్నికల అనంతరం కొద్ది నెలలకు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన తరువాత ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రి కావాలని భావించారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం రోశయ్యను ముఖ్యమంత్రిగా ప్రతిష్టించింది. దీంతో వైఎస్ జగన్మోహనరెడ్డి 'వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ'ని స్థాపించారు. కాంగ్రెస్‌కు చెందిన అనేక మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి వైసిపిలో చేరారు. అలా చేరిన వారందరితో తమ పదవులకు రాజీనామా చేయించారు. ఆ స్థానంలో వచ్చిన 18 ఉప ఎన్నికల్లో వైసిపి 15 స్థానాల్లో ఘన విజయం సాధించింది. దీంతో కాంగ్రెస్ పార్టీ నుంచి వైసిపిలోకి వలసలు ప్రారంభం అయ్యాయి. కాంగ్రెస్ బలహీనపడి వైసిపి బలపడింది. పాలక కాంగ్రెస్‌కు గట్టి సవాలు విసిరి తాను బలపడి రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించడం ప్రారంభించిన దశ అది.

టిడిపి, వైఎస్‌ఆర్‌సిపికి మధ్య స్వల్ప ఓట్ల తేడా

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అసెంబ్లీ, లోక్‌సభకు ఎన్నికలు జమిలిగా 2014 ఏప్రిల్ 30, మే 7 తేదీల్లో జరిగాయి. 175 అసెంబ్లీ సీట్లకు జరిగిన ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బిజెపితో పొత్తు పెట్టుకుని విజయం సాధించింది. టిడిపి 102 స్థానాలు గెలిచి, 1,29,16,000 (44.90 శాతం) ఓట్లు సంపాదించింది. వైఎస్‌ఆర్‌సిపి 67 స్థానాలు గెలుచుకొని 1,28,40,033 (44.60 శాతం) ఓట్లు సాధించింది. సీట్ల సంఖ్యలో భారీ వ్యత్యాసం కనిపిస్తున్నా.. ఈ రెండు పార్టీల మధ్య ఓట్ల శాతం చాలా తక్కువగా ఉంది. టిడిపితో వైసిపి హోరాహోరీగా పోటీనిచ్చింది. తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్న బిజెపి 4 సీట్లు గెలిచింది.



ఈ పార్టీకి 6,32,599 (2.20 శాతం) ఓట్లు వచ్చాయి. ఇండిపెండెంట్లు 2 స్థానాలు గెలిచారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, సిపిఐ(ఎం), సిపిఐ, బిఎస్‌పిలకు సీట్లు రాలేదు. 2009 ఎన్నికల్లో 60 లక్షలకు పైచిలుకు ఓట్లు తెచ్చుకుని 18 అసెంబ్లీ సీట్లు గెలిచిన చిరంజీవి 2008లో పెట్టిన ప్రజారాజ్యం పార్టీ 2011 ఆగస్టులో కాంగ్రెస్‌లో విలీనం అయ్యింది. అందువల్ల 2014 ఎన్నికల్లో ఆ పార్టీ పోటీలో లేకుండా పోయింది. అయితే అంతకుముందే చిరంజీవి రాజ్యసభకు కాంగ్రెస్ సభ్యుడుగా ఎంపికై కేంద్రమంత్రిగా నియమితులయ్యారు. జనసేన పార్టీ పెట్టిన పవన్ కళ్యాణ్ ఆ ఎన్నికల్లో పోటీ చేయలేదు. టిడిపి, బిజెపికి మద్దతిచ్చారు.

ఇక అసెంబ్లీ ఎన్నికలతోపాటే లోక్‌సభ జమిలిగా జరిగిన ఎన్నికలకు సంబంధించి 25 సీట్లకుగాను టిడిపి 15 స్థానాలను గెలిచింది. 1,17,29,230 (40.80శాతం) ఓట్లు సంపాదించింది. వైసిపి 8 సీట్లు, 1,31,31,029 (45.67శాతం) ఓట్లు సాధించింది. బిజెపి 2 స్థానాల్లో విజయం సాధించి 20,77,079 (7.22 శాతం) ఓట్లు పొందింది. కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ(ఎం) వంటి జాతీయ పార్టీలకు స్థానాలు రాలేదు.

- యు. రామకృష్ణ

కెసిఆర్ నిరాహారదీక్ష - రాష్ట్ర విభజన

తెలంగాణా ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీకి 2001 ఏప్రిల్ 21న రాజీనామా చేసి తెలంగాణా రాష్ట్ర సమితి (టిఆర్‌ఎస్)ని ఏర్పాటు చేసి యావత్ తెలంగాణా ప్రాంతాన్ని ఉద్యమ బాట పట్టించారు. తెలంగాణ ప్రజల మనోభావాలు గుర్తించి 2004 నుంచే ఉద్యమాన్ని ప్రారంభించాడు. 2009 ఎన్నికల అనంతరం కెసిఆర్ మలిదశ ఉద్యమం తీవ్రం చేశారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది. 2009 డిసెంబరు 9న అంటే నిరాహారదీక్ష 11 రోజులు పూర్తయిన తరువాత కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఇస్తున్నట్లు ప్రకటించింది. 2014 జూన్ 2న రాష్ట్ర విభజన జరిగినట్లు అదే యేడు మార్చి 1న నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అధికారిక ఉత్తర్వు ఇచ్చారు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటును నిరసిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. జై సమైక్యాంధ్ర పార్టీ పెట్టారు. అనేక దశాబ్దాలుగా రాష్ట్ర సమైక్యత కోసం కృషి చేసిన, చేస్తున్న వామపక్షాలతో కలిసి ఆయన ఎన్నికల్లో పోటీ చేశారు. తాను తెలంగాణా రాష్ట్రం ఇచ్చినందుకు తనకు బ్రహ్మరథం పడతారని భావించిన కాంగ్రెస్ పార్టీ 2014 ఎన్నికల్లో ఎపిలోనూ, తెలంగాణాలోనూ రెండు రాష్ట్రాల్లోనూ ఘోరంగా ఓడిపోయింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ 1953నాటి భౌగోళిక ఆంధ్రరాష్ట్ర స్వరూపం కలిగి ఉండి చిన్న రాష్ట్రంగా మారిపోయింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ 294 సీట్ల నుంచి 175 స్థానాలకు పడిపోయింది. లోక్‌సభ స్థానాల సంఖ్య 42 నుంచి 25కి పడిపోయింది.

2014 అసెంబ్లీ పార్టీల బలాబలాలు (మొత్తం స్థానాలు 175)

పార్టీ	గెలుపు	ఓట్లు	శాతం
తెలుగుదేశం	102	1,29,16,000	44.90
వైఎస్ఆర్‌సిపి	67	1,28,40,033	44.60
బిజెపి	04	6,32,599	2.20

2014 లోక్‌సభ పార్టీల బలాబలాలు (మొత్తం స్థానాలు 25)

పార్టీ	గెలుపు	ఓట్లు	శాతం
తెలుగుదేశం	15	1,17,29,230	40.80
వైఎస్ఆర్‌సిపి	08	1,31,31,029	45.67
బిజెపి	02	20,77,079	7.22

'ఎవరెన్ని చెప్పినా మనిషి మనిషి యొక్క అన్ని రకాల పాట్లకూ కారణం. అది ఆనందమైనా, దుఃఖమైనా. ఆ పాట్లకు సంబంధించిన పరిష్కారం కూడా మనిషి దగ్గరే ఉంటుంది.'
-శ్రీశ్రీ

పాత్రలు కల్పితాలు

1
ఎలా వుంటుందంటే,
ముందు ఒక కోతి గాల్లోకి దూకుతుంది
దాన్ని చూసి పక్కనే వున్న మరో కోతి
మొదటిదాని కన్నా కాస్త ఎక్కువ ఎత్తు
రెండూ పోటీలు పడి మరీ దూకుతాయి
కొమ్మలు విరిగి చెట్లు కూలి
అడవికి అడవే నాశనమవుతుంటుంది
ఐనా పాత్రలు
ఎవరి నిశ్శబ్దంలో వాళ్లుంటారు
ప్రశాంతతను ప్రేమించినట్టు
మరి దేన్నీ ప్రేమించరు!

ఈ కథలో
ఒక కీలక మలుపు దగ్గర ప్రధాన పాత్రధారి
మనకు ఎదురవుతాడు!

2
ఒకడుంటాడు
నీ ముందుకు రంగుల వల విసురుతాడు
కొన్నాళ్ళు జాగ్రత్తగా నడుస్తావు
ఒకానొక తుపాను రాత్రి
వల మధ్యలో చిక్కుకున్న నువ్వు
నీ విధేయతను అద్దంలో చందమామను చేయడానికి
సమూహానికి సమూహాన్నే ఒడ్డుతావు

ఈ కథలోనూ
మనిద్దరి నీడలూ పోలిక పట్టలేనంతగా
కలిసిపోయి వుంటాయి!

3
ఒకరోజు నిజంగా
కిరీటం మన చేతుల్లోకి వస్తుంది
తలలు పోటీ పడతాయి
పొరుగువాడి మేలును శాశ్వతంగా వాయిదా వేసి
సొంత లాభమే చూసుకుంటాం!

4
నీరందని ఒక పొలం
మనిద్దర్నీ శపిస్తుంది
రోడ్డున పడ్డ వరికంకులు
ఉరితాళ్ళలో ముఖం దాచుకుంటాయి
అప్పుడే పుట్టిన పిల్లాడు
పలక మీద అబద్ధాన్ని రాసుకుని
ట్రాఫిక్ ఐలాండ్ దగ్గర ఎదురవుతాడు
చూపుడు వేలు రాసుకున్న స్వప్నం
ఈవీఎం బీప్ సౌండ్లో తప్పిపోతుంది
ఎల్ నినో కమ్ముకున్నట్టు
ఆశలు పొడిబారుతుంటాయి
చటుక్కున బొటనవేలును కోసి
పళ్ళెంలో వేసే అలవాటు
హెూమం ముందు తలను నరుక్కునే వరకూ వెళ్తుంది

ఒక యథార్థ కథలో
కల్పిత పాత్రలు
జరుగుతున్నది మాయజూదం అని
పాచికలకు తెలీదనే భ్రమలో వుంటాయి!

– సాంబమూర్తి లండ

రాయి

అవును
రాయేకదా అనుకోకండి
విసిరినవాడెవడో, ఎందుకు విసిరాడోగాని,
ఇప్పుడు రాయికూడా రాజకీయం చేస్తోంది.
రాయి చరిత్ర చిన్నదేమి కాదు

ఆదిమ మానవుడి తొలి ఆయుధం రాయేకదా!
బైబిల్‌లో కూడా రాయి గురించి ఎన్నిప్రవచనాలో,
నిరాకరించిన రాయి తలకు మూలరాయి అయింది.
తిరస్కరించిన రాయి మూలకు శిరస్సుగా మారింది.
మీలోపాపం చేయనివాడు మొట్టమొదట
ఆమె(వేశ్య) మీద రాయివేయవచ్చునని యేసుచెప్పెను.
ఒడిశెలతో దావీదు విసిరిన రాయి గొల్యాతును కూల్చింది.

ఇపుడు జయాపజయాలకు,
రాయి గీటురాయిగా మారింది.
నా చిన్నప్పుడు గొడ్లుకాడ పిల్లలం
రాళ్ళతో చింతకాయలు కొట్టేది.
చిదుగులు పోగేసి రాయితో నిప్పురాజేసేది.
ఇప్పుడైనా రాత్రిపూట
కుక్కలెంటబడితే, రాయేదిక్కు !
ఏ రాయయితేంటి పళ్ళూడగొట్టేందుకు !
అది గులకరాయా, గ్రానైట్‌రాయా,
ఏదైతేంటి ? రాయి ఒకగొప్ప ఆయుధం.
ఇప్పుడురాయే రాజకీయం చేస్తోంది.
ఒక రాజ్యాన్ని కూల్చొచ్చు,
మరొక రాజ్యాన్ని,
తిరిగి లేపనూ వచ్చు !

– కత్తి కళ్యాణ్
63038 47077



ఆ ఒక్క రోజు జాగ్రత్త!

గట్టికో పట్టుకో
ఆ ఒక్క రోజును జాగ్రత్త
డబ్బుకి అతుక్కోని పలుచన కాకు
కులంలో జారిపోయి అజ్ఞానిగా మిగలకు
అదను మరచి పదును పోగొట్టుకోని
పిచ్చోడిగా మారిపోవద్దు!

దూరంగా చూడటం నేర్చుకో
విలువగా మెలగడం తెలుసుకో
ముసుగులను, మూసలను పసిగట్టి
మాటల్లో విషానికి విరుగుడుగా మారి
తెలివిగా మసలుకోని
ప్రజాస్వామ్యంలో నీ పాత్ర స్వచ్ఛతను కాపాడుకో
ఓటు పరువు పోకుండా
ఈ ఒక్క రోజూ స్పృహలో ఉండు...

– శ్రీ సాహితి
97044 37247

అలతి పదాలతో అనంత భావాల సృష్టి

నిగూఢతను కలిగి, సాధారణ వాక్యానికి భిన్నంగా ఉండి మనసును రంజింపజేసే, ఆలోచింపజేసే రచనను కవిత్వం అంటాము. కవిత్వం అంటే అక్షరాల కుంటి నడక కాదు. కవిత్వం అంటే అక్షర తాండవం. కవిత్వం అంటే ఒక అన్వేషణ, ఒక తీరని వేదన. కవిత పాఠకుడిని కదిలించడానికి ముందు కవిని కదిలించాలి. కవిత్వం సమాజ చైతన్యానికి దోహదం చేయాలి.

సాధారణంగా త్యాగం గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు అమ్మని ప్రస్తావిస్తారు. అమ్మ త్యాగం వెనుక నాన్న ఉంటాడు, బాధ్యతని భుజాలపై మోస్తూ కుటుంబానికి భరోసా అవుతాడు. కానీ నాన్న త్యాగాన్ని లోకం పెద్దగా గుర్తించదు. నాన్న కూడా అమ్మతో సమానమే అని చెప్తున్నాడు ప్రకాష్ నాయుడు తన "నాన్న ఎందుకో వెనకబడ్డాడు" కవితా సంపుటిలో.

నాన్నలో ఎన్నో భావోద్వేగాల్ని కవిత్వంతో మమేకం చేసి నాన్న ప్రపంచాన్ని మన ముందు ఉంచాడు. ఎన్నో రకాల కవిత్వ వాదాలు ఉన్నా 'అనుభూతి వాదం' ఎంచుకొని మనకి కన్నీళ్లు తెప్పిస్తాడు. తన కవిత్వం – డిక్షన్ (జూశీవ్‌తీఎ–ఎఅవ్‌ఱశీఅ) ఆలోచింపచేస్తుంది. 'అందరు పోతారు ఎపుడో ఒకప్పుడు/ ఈ లోపు ఒకడిని మరొకడు కూల్చుకోవడమే 'యుద్ధం' అంటాడు. చిన్నదే కానీ అర్థం మాత్రం విస్తృతమే. ఈ కవిత్వంలో నాన్నే సర్వ వ్యాపకం అని అనడు. అమ్మకి అంతే స్థానం ఇచ్చాడు. ఓ చోట ఇలా అంటాడు.

"నువ్వు చంద్రుడు, నాన్న సూర్యుడు అని తెలిసిన అమ్మకి/ ఆ ఇద్దరిని మోసే అవకాశం తానే అన్న నిజం" అమ్మకి నిజంగా తెలియదు" (అమ్మకేమి తెలియదు) .... భావోద్వేగంలో హెచ్చు తగ్గులు ఉంటాయా? అమ్మకి కట్టబెట్టిన పీఠం నాన్నకి ఎందుకు ఇవ్వలేదు? అంతర్మథనంలో నాన్న ఎప్పుడూ వెనుకబడతాడు. ప్రతి ఒక్కరికి సరళ అనుభవాలు (ూఱఎజూశ్రీవ వఞజూవతీఱ–వఅషవం) సాధారణంగా అనుభవానికి గోచరం అయ్యే అనుభవాలు ఉంటాయి. అలాంటి అనుభవం నుంచి వచ్చిందే 'ఈ నాన్న వెనుకబడ్డాడు'. ప్రతి కవిత్వ రచన వెనుక ఒక బలమైన ఘటన ఉంటుంది. నాన్న ఎందుకు వెనుకబడ్డాడో శీర్షిక కవితలో చెప్తాడు.

"ఏది కావాలంటే అది వండి పెడుతూ అమ్మ/ ఏది కావాలంటే అది కొనిపెడుతూ నాన్న/ ఇద్దరి ప్రేమ సమానమే/ అయినా కూడా అమ్మ కొచ్చిన పేరు ముందు నాన్న వెనుకబడ్డాడు" ప్రేమలో సమానం అయినా ఎందుకో నాన్న వెనకనే ఉంటాడు. అలాగే "ఇంట్లో జీతం తీసుకోకుండా అమ్మ/ తన జీతం అంతా ఇంటికే ఖర్చు పెడుతూ నాన్న/ ఇద్దరి శ్రమ సమానమే అయినా అమ్మకంటే నాన్న ఎందుకో వెనకబడ్డాడు"

తల్లి తండ్రి ఇద్దరి ప్రాధాన్యతలు ఒక్కటే అయినా ఒక్కరికి మాత్రమే పేరు రావడం వెనుక సామాజిక ఒత్తిడి ఉన్నది. అయితే దీన్ని మనం నిరాకరించలేము. అదొక వాస్తవికత నిరాకరణ (ణవఅఱశ్రీ శీట క్ష్మఱశ్రీఱ్‌ఎ)గా పేర్కొనవచ్చు. అయితే ఈ కవితలో చివర్లో ముగింపు మాత్రం నాన్న వైపు నిలబడతాడు ఈ కవి. "ఇంత నిస్వార్థ జీవి అయినా నాన్న వెనుకబడి పోవడానికి కారణం ఒక్కటే/ అయన మా అందరికి వెన్నెముక కావడమే!" అంటాడు. ఇంకా వివిధ సాహిత్య కోణాలు ఈ కవితల్లో ఎలా ప్రతిఫలిస్తున్నాయో చూద్దాం.

సన్నివేశ వాదం (ూఙ్‌బఖ్‌ఱశీఱశ్రీఱంఎ), ప్రవర్తన నిర్ణయకాలలో సన్నివేశం లేదా పరిసర పరిస్థితుల ముఖ్యం అని చెప్పే దృక్పథం. ఒక బలాత్కారం జరిగినప్పుడు ఆడపిల్ల/ మహిళా మానసిక స్థితి ఎలా ఉంటుంది? ఒక సమస్యలో ఇరుక్కున్నపుడు సమాజం ఎలా తనని చూస్తుంది? సమస్యాత్మక ప్రవర్తన (ూతీశీఎశ్రీవఎ ఎవష్ఱజఱశీ) ... సమాజ వ్యతిరేకమైనది, వినాశకరమైనది, చికాకు కలిగించేది అయిన ప్రవర్తన. జరిగినదానిలో తన ప్రమేయం లేకున్నా సమాజం చేసే వ్యతిరేక వ్యాఖ్యల వల్ల సమాజంపై వ్యతిరేకత పెంచుకుంటుంది. 'శీలం ఉండేది అక్కడ కాదు' అన్న శీర్షికతో ఈ కవి – బాధితురాలి వెనక నిలబడ్డాడు. "గొడుగు చిల్లు పడిందని ఆకాశాన్ని వర్షానికి తడిసింది అని దేహాన్ని నిందించుకోకు/ ఇదిగో చూడు శీలం కోల్పోవడం అంటే గుండెల మీద కొట్టినవాడి బరువుని/ ఇంకా నువ్వు గుండెలు పైనే మోయడం/ హృదయం స్ఖలించినప్పుడల్లా/ మైలపడ్డ అంగం ఈ ప్రపంచం:" అంటాడు. "గమ్యం తెలియని మెయిలు రాయిలా ఎన్నాళ్లు ఇక్కడే పాతుకు పోతావు? .... ఆ పీడకలని మర్చిపో/ బతుకు బతికించు .. ముందుకు సాగిపో వదిలేసి ... అంటాడు.

శాబ్దిక వాదం (జవతీఱశ్రీఱంఎ) : ఆలోచించేప్పుడు పదాల వెనుక ఉన్న అర్థం మీద గాక పదాల మీదే ఎక్కువ ఆధారపడటం. ప్రకాష్ అర్థం అయ్యే విధం గాను, శాబ్దిహక సాధారణీకరణం (ఎవతీఱశ్రీ స్రవఅవతీఱశ్రీఱఓ్‌ఱశీఅ) సార్వత్రిక సర్వామోదిత సూత్రం అనుసరించి రచన చేసాడు. ఈ కవితలని సాధారణ పాఠకుడు సైతం ఆస్వాదించగలడు. చాలామంది కవులు కాల్పనికవాదం (క్ష్మశీఎఱఅషఱంఎ) రాస్తూ సామాజిక వాస్తవికత (శీఒఱశ్రీ తీఱశ్రీఓ్‌ఎ)ని విస్మరిస్తారు. ప్రకాష్ నాయుడు కవిత్వంలో కూడా కాల్పనిక వాదపు కవిత్వం కనిపిస్తుంది కానీ మొత్తాన్ని ఆక్రమించదు. అభ్యుదయపు ఛాయలు ఉన్న కవితల్ని చూడొచ్చు అందులో. 'వేశ్య' కవిత చదివినప్పుడు ఆలూరి బైరాగి రాసిన 'వేశ్య' గుర్తుకు వస్తుంది.

"జీవితపు కాళ రాత్రి, గుండెలు పిండే చలి
భగభగమండే ఆకలి
పాపపు చిరిగిన దుప్పటిలో
గడగడ వణికే మనకెందుకు చీదర?" అంటాడు బైరాగి.

ప్రకాష్ నాయుడు వేశ్య జీవితంలో చీకటి నీడలని మనకి చూపిస్తాడు. "ఈ శరీరాన్ని పళ్ళ తోటను చేసి చాలా రోజులు అయ్యింది/ వచ్చి ఆకలి తీర్చుకు పోయేవాళ్లు తప్ప/ మా ఆకలి దప్పులని చూసిపోయిన వారు ఎవరూ లేరు." ఈ పురుష జాతికి సుఖమే తప్ప మా బతుకు ఆకలి ఏమి తెలుసు?" అని ఆమె స్వరంలో ప్రశ్నిస్తాడు.

"రైతు కొడుకు" కవితలో కొడుకు నాన్న కష్టం గుర్తుకు వచ్చినప్పుడు మళ్ళీ ఊరు వెళ్ళాలి అనుకుంటున్నాడు. "ఎక్కడో ఉద్యోగం చేసుకుంటున్న నాకు/ వర్షం పడిన రోజు రాత్రి నిద్ర పట్టదు/ తడిసిన రాశులు నాన్న కళ్ళని తడి చేసినప్పుడు/ ఆయన కళ్ళలో దాచుకున్న నేను తడిసిపోతాను" అంటాడు. "పోయిన పంట బిడ్డని చూసి కుమిలిపోతున్న అమ్మా నాన్నల్ని ఓదార్చడానికి నేను మరోమారు ఊరెళ్ళి రావాలి" అనుకుంటాడు. తన కవిత్వం అంతా నాన్న చుట్టే పరిభ్రమిస్తున్నా కూడా అమ్మ వైపు నుంచి కూడా ఆలోచించమంటాడు. ప్రసవించడం అంటే మరో జన్మ ఎత్తడమే. అలాంటిది ఒక బిడ్డకి జన్మ ఇవ్వడం అంటే మరో జన్మ ఎత్తడమే కదా! "నొప్పుల గది" చదివితే మనసు చలించిపోతుంది. "నేను ఆ గదిలోకి వెళ్ళాలి. నేను తన పక్కనే నుంచొని/ మా అమ్మ నన్ను కనడానికి పడ్డ అప్పటి పురిటి నొప్పులన్ని/ ఇప్పుడు కళ్లారా చూడాలి." అని ఆకాంక్షిస్తాడు.

వ్యక్తిగత ప్రేరకం (జూవతీంశీఱశ్రీ ఎశీఱజవ) ఒక వ్యక్తికి విశిష్ట లక్షణమైన అభ్యస్థ ప్రేరకం లేదా ప్రేరణం. ఆ ప్రేరణ ఎవరినుంచి అయినా రావొచ్చు. కట్టుకున్న "ఇంటిది: నుంచి అయినా మరి ఏ బంధం అయినా కూడా .. భార్య గురించి నాలుగు మంచిమాటలు ఎవరు చెప్పగలరు భర్త తప్ప. అందుకే "ఆకాశం లాంటి విశాలమైన ఆమె నుదిటి మీద ఎర్రని సూరీడు కుంకుమై మెరిసినప్పుడు/ ఆమె ఉదయంలా నవ్వుతుంది" అంటాడు. "మా ఇంట్లో గోడకు తగిలించిన దీపమై రాత్రంతా వెలుగుతూనే ఉంటుంది" అంటాడు. ఒకవైపు నాన్న వెనక బడ్డాడు అంటూనే అమ్మకి, భార్యకి సముచిత గౌరవం ఇచ్చాడు ఈ కవి.

వర్షం ఎంత ప్రమాదమో ఎండ కూడా అంతే ప్రమాదమంటాడు. ఎండాకాలం, "ఎండా నిజంగానే పాము/ మూలుగుతున్న మా ముసలాడిని కాటేసి తీసుకు పోయింది" ఎండ దెబ్బలకి ముసిలి వాళ్ళు పండు ఆకుల్లా రాలిపోతున్నారు (ఎండాకాలం). "కాలాలకు కన్నీళ్లు ఉంటాయి/ ఆ కన్నీటి పేరు ఉప్పెన అని తెలిసినప్పుడు, గుండెల్లోకి గోదారి ఒక్కసారిగా భళ్ళున ఉరికిన నీటి శబ్దం (నీటి శబ్దాలు). బతుకంటే మరేమి కాదు "జీవితంలో ప్రతి మనిషి రెండుసార్లు తప్పకుండా చేసే మైల స్నానపు నీటి శబ్దం/ వర్షం ఎవరో కాదు నెలలో దాక్కున్నా విత్తనాలకు పురుడు పోయడానికి వచ్చిన మంత్రసాని" ఇలా కాలాల్ని కూడా కవిత్వం చేస్తాడు.

వ్యక్తిక వాదం (ఱఅసఱఙఱసబఱశ్రీఱంఎ) : మనిషి స్వాతంత్ర్యంగా బతకడం కోసం ఎన్నో పనులు చేస్తాడు. ఆత్మ గౌరవంతో ముందుకు సాగాలని కోరతాడు. అయినా కొన్నిసార్లు తప్పదు ఆధారపడటం. ఎన్ని డబ్బులు సంపాదించిన కానీ కొన్నిసార్లు మన వారి చేతి సహాయం అందుకోవాల్సిందే. అది నాన్న అందించే సాయం అయితే చెప్పక్కర్లేదు. నాన్న పంపే "పొలం బియ్యం" ఎంతో విలువైనవి. "మన పొలంలో పండిన బియ్యం పంపిస్తున్న/ తినండి/ నాన్న చెప్పిన మాటకే నా కడుపు నిండిపోతుంది/ అవును అయినా వాళ్ళ ప్రేమ అది. అయితే, ఇంటికి వెళ్ళినప్పుడు మాత్రం ఇంత మంచి వాతవరణం నుంచి ఎందుకు మనం వలస పోయాము అని బాధ పడతాము. "ఇంటికి వెళ్ళినప్పుడు అమ్మ చేతులు నా కుదుపుని నాన్న చేతులు నా జేబుని నింపి ఊరు వదిలి ఎందుకు వచ్చానో నాకు ఇప్పటికి అర్థం కాదు" అంటాడు. ఇది ప్రతి రైతు బిడ్డ బాధనే!

వైఖరి (ఝ్‌ఙబఎవ) సమాజంలో కొందరు వ్యక్తుల పాత్రాళ, వస్తువుల పట్ల, సన్నివేశాల పట్ల అనుకూలంగా గాని, వ్యతిరేకంగాని ప్రతిస్పందించే ప్రవృత్తి. ఈ కవి వైఖరి చాలా స్పష్టంగా ఉంది. నాన్న గురించే కాకుండా నాన్న చుట్టూ ఉన్న పరిస్థితుల పట్ల సహానుభూతి ఉంది. "నిశ్శబ్దం" నుంచి మాట్లాడే అవసరాన్ని గుర్తు చేస్తాడు. చిన్న మాటల్లో ఎంత బాగా చెప్పాడో!

"ఆకలి నిండా బతుకు వాసన
జీవితం ఉడుకుతున్న పొయ్యి"

అలాగే ప్రపంచం గురించిన చాలా నిశ్శబ్దంగా చెప్తాడు చూడండి.

"ప్రపంచం ఒక పాత చెప్పు
ఎన్ని సార్లైనా తెగుతుందే కానీ తరగదు." అంతే!

ప్రపంచంతో పాటు మనం నడవాలి.

చివరగా, "నీ లోపల ఉన్న మనిషి, మృగాన్ని చంపి వేయి" అని మనిషిగా మసులుకోవలసిన అవసరాన్ని గుర్తు చేస్తాడు. ప్రేమతో పాటు తానూ ఒక సామజిక బాధ్యత కలిగిన కవిగా ఈ సంపుటిలో ప్రతిచోటా కనిపిస్తాడు. మనం రోజు చూసే చెత్త వాడిని తాను ఇంకొక కోణంలో చూసాడు. "వాడు చెత్తోడు కాదు" అంటూ మన ఆలోచన మార్చమంటాడు. "వాడొక్క రోజు రాకపోతే మనమంతా ముక్కులు మూసుకొని కాపురాలు చెయ్యాల్సిందే./ నువ్విచ్చే చెత్తను అపురూపంగా స్వీకరించే అతని చేతులని తాకి/ మనసులోనైనా ఓ నమస్కారం చెయ్యండి/ ఎందుకంటే, మన మాలిన్యాన్ని తానూ తీసుకొని మనల్ని పునీతులుగా ఉంచేవాడు మనకెప్పుడు గురువుతో సమానం". అంటాడు.

వచన కవిత్వంలో భిన్న రకాల వాదనలు వినిపిస్తూ బలంగా దూసుకుపోతున్నాడు ఈ కవి. ఈ సంపుటిలో ఇంకా నటుడు, సంస్కారం, ఆకలి తీరినట్టు, కవినైపోతాను, వాడేం మనిషి, కోరిక, దేవుడు రాడు, అదే నవ్వు లాంటి మంచి కవితలు ఉన్నాయి. "తృప్తిపడ్డ కవి, తృప్తి పడని కథకుడూ నష్టపోతారు" అంటారు. కాబట్టి ప్రకాష్ నాయుడు ఈ కవిత్వాన్ని భావోద్వేగాన్ని మరింత ముందుకు తీసుకు వెళ్తారని ఆశిస్తాను.

– పుష్యమీ సాగర్
79970 72896

ప్రగతిశీల కవిత్వం నీల కురింజి సముద్రం!

"నాన్నా!/ నేను నువ్వెలా అవుతాను/ నువ్వో నీల కురింజి సముద్రం/ నేనో చిన్ని నీలలోహిత సుమాన్ని మటుకే"! అంటూ తన నాన్న ఔన్నత్యాన్ని, వ్యక్తిత్వాన్ని నీల కురింజి సముద్రంతో పోల్చి చెప్పిన కవయిత్రి ప్రగతి అభినందనీయురాలు. సర్వ సాధారణంగా కవులు తమకిష్టమైన వ్యక్తుల వ్యక్తిత్వాన్ని, ఔన్నత్యాన్ని వర్ణించాలంటే మేరు శిఖరం తోనూ, హిమాలయ పర్వతాలతోనూ పోలుస్తుంటారు. ఈ కవయిత్రి అనూహ్యంగా నీల కురింజి సముద్రంతో పోల్చడం చదువరులకు వినూత్నంగా, విడ్డూరంగా అన్పించక మానదు.

ఏమిటీ 'నీల కురింజి'? అది ప్రపంచంలోనే ఒక అరుదైన అద్భుత అపరూప పుష్ప జాతికి సంబంధించినది. 12 సంవత్సరాలకొకసారి మాత్రమే వికసించే పుష్పం. ఇవి 2006 ఒక సారి, 2018లో ఒకసారి వికసించి కనువిందు చేశాయని ప్రపంచ పర్యాటక సంస్థ తెలిపింది. మళ్లీ 2030లో వికసించ బోతుందని తెలియజేసింది.

నీల కురింజి పుష్పాలు మంచుపర్వత శ్రేణుల్లో లేత నీలం రంగు ఛాయలో సూర్యోదయంలో వికసించిమనల్ని మైమరపింప జేస్తాయి. ఈ పుష్పాలు కేరళ, తమిళనాడు, పశ్చిమ కనుమల్లో, మున్నార్ ప్రాంతాల్లో మనకు కనువిందు చేస్తాయి. ఈ అద్భుత సౌందర్య పుష్ప రాశిని తనివిదీరా దర్శించాలని ప్రపంచ పర్యాటకులు సౌందర్యోపాసకులు ఉవ్విళ్లూరుతుంటారు. ఇంతటి అద్భుత సౌందర్య పుష్ప సముదాయాన్ని తన నాన్న వ్యకిత్వంతో పోల్చి మనల్ని నిబిడాశ్చర్యంలో ముంచేసి, మనల్ని పూర్వపరాల అన్వేషణలోకి నడిపించిన కవయిత్రికి అభినందనీయులు.



ప్రగతి గారుకథా రచయిత్రి గానే తన ఉనికిని చాటుకున్నారు. ముఖ్యంగా ఇవాళ్టి విద్యార్థులను సాహిత్య కార్యక్రమాల్లో మమేకం చేస్తూ అనేక ఈవెంట్స్ నిర్వహిస్తూ వస్తున్న ఒక కెమిస్ట్రీ అధ్యాపకులు. ప్రస్తుతం హిందూపురం ప్రభుత్వ మహిళా కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె తన పేరులోనే కాదు, తనదైన ప్రాపంచిక దృక్పథంలోనూ ప్రగతి శీల భావాలతో కథలు, కవిత్వం రాస్తూ ఉంటారు.

ఓ సందర్భంలో వారిని కలిసినప్పుడు నా కవితా సంపుటి త్వరలోనే వస్తోంది సర్, అనగానే నేను ఒకింత సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. ఎందుకంటే కవిత్వమంటే నాకు ప్రాణం గనుక.వారిలో ఒక ప్రగతిశీల కవితా హృదయం ఉందని ఇదిగో ఈ "నీలకురింజి సముద్రం" చదివాకనే అర్థమైంది. ఆమె పుట్టి పెరిగిన వాతావరణం కావచ్చు, తండ్రి నుంచి తనకు అలవడిన వామపక్ష భావజాలం కావచ్చు. మెట్టినింట కూడా అదే భావజాలంతో, ఉద్యమ స్ఫూర్తితో సహచరుడు, వారి కుటుంబ నేపథ్యమంతా పోరాట చైతన్యం కావచ్చు.. చదివిన పుస్తకాల ప్రభావం, వారిని అభ్యుదయ రచయిత్రిగా, కవయిత్రిగా సీమ సాహిత్యం అక్కున జేర్చుకుంది. వారి అమ్మాయిలు ధాత్రి, చైత్ర కూడా వీరి భావాలను పుణికి పుచ్చుకున్న వారే.

ఈ కవితా సంపుటి ప్రారంభంలోనే "ఇది నా ప్రేమ కవిత్వం. నేను ప్రేమించిన వాళ్ళు, నన్ను ప్రేమించిన వాళ్ళు, నన్ను ప్రేమలో పడేసిన సహజ ప్రకృతి కోసం, ఏ విధమైన అంతరాలు, అసమానతలు, వివక్షకు చోటులేని ప్రపంచం మీద ప్రేమ కోసం, సామాజిక మార్పు .. మీద అపారమైన, ఎల్లలు లేని ప్రేమ కోసమే ఈ నా ప్రేమ కవిత్వం అంటూ తనదైన మేనిఫెస్టో ప్రకటించారు. "చిన్ని మిణుగుర్లకు తోడుగా నేనూ/ చీకటి చీకట్లతో పోరాడతా/ ప్రభాతవేళకు వెలుతురు వాకిలి తీసి నిలబడతా"నంటున్న ఆత్మ విశ్వాసం ఈ కవయిత్రిది.

నాన్న విశాల హృదయాన్ని నీల కురింజి సముద్రంతో పోల్చి చెప్పినట్లే, అమ్మను లోకం గుర్తించని విద్యావేత్తగా, అక్షరాలు నేర్పించిన తొలి గురువుగా, ఆమె జ్ఞాపకాన్ని వెచ్చని బొగ్గుల పొయ్యితో పోల్చడం నాకు నచ్చింది. "బొగ్గులు బూడిదగా మారినట్లు/ అమ్మ కూడా మట్టిలో కలిసిపోయింది/ అయినా అమ్మ జ్ఞాపకం/ ఇలా హృదయాన్ని వెచ్చగా ఉంచుతూనే ఉంది".

ఇవాళ్టి సమాజంలో కులం, వర్ణం, వర్గవైరుధ్యాలు పైకి ఎంత సాఫ్ట్‌గా కనిపించినా, మనకు తెలియకుండానే మనకంటే ముందుగానే ప్రయాణిస్తూ మన కాళ్ళ కడ్డం పడుతూనే ఉన్నాయి. యాభై ఏళ్లకు పూర్వం ఈ వివక్ష ఎంత యథేచ్ఛగా తన ప్రతాపం చూపించేదో "మనోళ్లే నా" కవితే సాక్ష్యం. "ఒక రోజు పుస్తకం కోసం తన ఇంటికొచ్చిన స్నేహితురాలితో పక్కింటామె ఆరా. మనోళ్లేనా?/ అవును మా క్లాసే/ అది కాదు నే నడిగేది/ మన కులమేనా?' ఇలా ఉంటుంది ఆనాటి పల్లెటూళ్ళ వ్యవహారం. ఆమెకు పెంకెగా సమాధానమయితే ఇచ్చి నోరు మూయించింది గానీ, తన మనసులో కలవర పెడుతున్న తుఫానుకు ఇలా బదులిచ్చింది.

"మనల్ని మానవ సమూహం నుండి విడదీసే
ఈ తోకలు కొమ్ములు ఇంకా అవసరమా
మన పిల్లలకైనా లేకుండా చేద్దాం
అంతా మనవాళ్లేనని నేర్పిద్దాం"

యోగాసనాలు పేరుతో కార్పొరేట్ వ్యంగ్యాసనాలు బాగున్నాయ్. మరో కవితలో సీమ చీకటి బతుకులను పరామర్శిస్తూ నీతిమాలిన నేతల్ని నిలెయ్యాలని పిలుపు నిస్తున్నారు.

"పంట పొలాల్లో పచ్చటి కాంతులు నిండితే
పట్నాల్లో నిశీధి కూపాల లోగిళ్ళు మాక్యాల
మీకు శాతనైతే కరువును సీమ దాటించాల
మీకు దమ్ముంటే వలసలను బండెక్కించాల
మీకు రోషముంటే నీతిమాలిన నేతలను
నిలేయ్యాల... వెలేయ్యాల..." అని నిలేశారు.

ఆసిఫా ఉదంతాన్ని ప్రస్తావిస్తూ... "బాల్యపు నందనవనాన్ని కకావికలం చేసిన/ క్రూర మృగాలను తరిమికొట్టడానికి / జెండా కున్న కర్ర తిరగబడుతుంది." అన్నారు. తల ప్రాణం తోకలోకి ఎలా చేరుతుందో, ఒక ఇల్లాలిగా, ఉద్యోగినిగా దినచర్యలో ద్విపాత్రాభినాయాన్ని గురించి వ్యాఖ్యానిస్తారు.

"ఇంట్లో అందరి ఆకలిని తీర్చిన ఓ ఇల్లాలు
తన ఆకలిని మాత్రం తీర్చుకునే తీరిక లేక
డబ్బాలో పెట్టి మూత పెట్టేసినట్లు ఉంటుంది"

కవిత్వ మెలా పుడుతుంది? కవిత్వ మెలా రాయాలి? ఎలాంటి అనుభూతి కవిత్వ మవుతుంది? వాక్యాల మీద వాక్యాలు పేరిస్తే కవిత్వమవుతుందా? ఎంతటి ప్రసవ వేదన అనుభవిస్తే కవిత్వ మవుతుంది? ఈ ప్రశ్నలకన్నిటికీ ఒక సమాధానం 'కొత్త సుగంధం' కవిత. "అల్లిబిల్లి పదాల పూలను సౌరభాల మరువాన్ని/ పొందిగ్గా కూర్చితే తయారయ్యే/ కొత్త సుగంధం కవిత్వం కావాలి/ మరో నాసికాగ్రాన్ని చేరి స్పందన కలిగించే / భావ వారధి కావాలి కవిత్వం / కడుపులో వికారం కాదు / మెదడులో సంఘర్షణ పుట్టించాలి కవిత్వం!/ సానుభూతి కవిత్వమక్కర్లేదు./ ఇంటింటా పుస్తక వనం, పొత్తాల తోటగా శోభాయమానంగా వర్ధిల్లాలి" అంటారు.

ప్రేమంటే చేదు అనుభవాల కొమ్మల్లోంచీ పుట్టిన తీయని మకరందమనీ, ఏడాదికో తద్దినం కాదని, అది నిరంతర వసంతమని, అలుపెరుగని పయనమని.. వివరించారు ఈ కవయిత్రి.

డిగ్రీ పరీక్ష రాయడానికి పెయింటింగ్ పనిచేసి చేతులు కూడా సరిగ్గా శుభ్రం చేసుకోకుండా వచ్చిన ఓ విద్యార్థిని చూశాక, అతను పరీక్ష ఎలా రాశాడో తెలియలేదు కానీ

మన కవయిత్రి కలానికి కవితై మెరిశాడు. ఈ సంపుటిలో వాన గీతాలున్నాయ్, ప్రేమ లేఖలు న్నాయ్. ఆకాశ మంత ప్రేమలున్నాయ్. సుద్ద ముక్క లున్నాయ్. తప్పిపోయిన కోయిలలున్నాయ్. కొత్త సుగంధాలున్నాయ్. అనుభూతుల, అనుభవాల వివేచనలున్నాయ్. కవితలన్నీ చదివాక నా అవగాహనలో – ఇందులోని కవిత లన్నీ వస్తు ప్రధానంగా కనిపిస్తాయ్. కవితలన్నీ సామాజిక నేపథ్యం లోంచే మాట్లాడుతున్నాయ్. కథల మీద మక్కువ కాబోలు కొన్ని కవితల్లో కవితాత్మక శైలి కంటే కథన శైలి కనిపిస్తుంది. కొన్ని కవితలు ప్రాంతీయ నుడికారంతో, అనంత యాసలో నడుస్తాయి. కొన్ని నాస్టాల్జియా కవితలు బాగా ఆకట్టు కుంటాయ్. కథా రచయిత్రిగా, కవయిత్రిగా, అధ్యాపకులుగా, సామాజికురాలిగా తన అనుభవాలను, వర్తమాన సామాజిక చలనాలను చక్కగా కవితాత్మకంగా రికార్డు చేసిన ప్రగతి గారికి మనసారా అభినందనలు.

– డా.రాధేయ

ఎదిగిన కొడుకులు!

పల్లె తల్లుల రొమ్ము తాగి
ఎదిగిన పసి పిల్లలు
పల్లెల చెమట చుక్కలతో పోగేసిన
సంపదల సరస్సులో
తుళ్లుతూ ఎగురుతున్న చేపపిల్లలు

పల్లెలు చొక్కా లేకుండా తిరగటం వల్లే
నగరాలు ప్యాంటూ షర్టేసుకుని
కులుకుతున్నాయి
దేశ దేహం నిండా
నగరాలు నరాలై తేలుతోంది
పల్లెల చెమట రక్తమై ప్రవహించటం వల్లే ...
కొమ్మల్లా విస్తరించిన నగరాలకు
బలాన్ని సమకూర్చిన చెట్టు వేర్లు పల్లెలే
ఇవాళ నగరాలు
చెట్టంత ఎదిగిన కొడుకులయ్యాయంటే
పెంచి పెద్ద చేసిన పల్లెతల్లుల చలవే
మూలాలు మర్చిపోతే పుట్టగతులుండవు
పునాదుల్ని కూల్చుకుంటే
లేచిన మేడలు నిలబడవు
వృద్ధాప్యంతో శిథిలమవుతున్న పల్లె తల్లుల్ని
ఎదిగిన కొడుకుల్లా దగ్గరికి తీసుకోవాల్సింది
నగరాలే !

– చిత్తలూరి

మేలో బాల సాహిత్య సమ్మేళనం 2024

తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మే 29, 30 తేదీల్లో హైదరాబాదులో బాల సాహిత్య సమ్మేళనం జరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు, తెలుగు ఉపాధ్యాయులు, బాల సాహితీవేత్తలు, బాలల కోసం రచనలు చేస్తున్నవారు పాల్గొంటారని పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయిలో తెలుగు భాషావికాసం, బడి పిల్లల్లో రచనాభిరుచి పెంపొందించడం, పత్రికల్లో బాలల రచనలకు ప్రచురణావకాశాలు, కథలు చెప్పడంలో మెలకువలు, సంగీతం, నత్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్పం వంటి లలిత కళల పైన ప్రాథమిక అవగాహన మొదలైన సదస్సులు, గోష్టులు జరుగుతాయని తెలిపారు. ప్రతినిధులుగా పాల్గొనదలిచేవారు ఈనెల 30వ తేదీలోగా 960 3727 234 వాట్సాప్ నెంబర్‌కు వివరాలు పంపి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అచ్ఛేదిన్ తూచ్..అంతా ఆకలి రాజ్యమే

• బిజెపి పాలనలో 2015 నుంచి ధరల దరువే • పేదలు, సామాన్య ప్రజల బాధలు వర్ణనాతీతం

అచ్ఛేదిన్ తీసుకొస్తామంటూ అధికారంలోకి వచ్చిన బిజెపి పాలనకు పదేళ్లు నిండి ఇప్పుడు మళ్లీ ఎన్నికల బరిలో నిలిచింది. ఈ పదేళ్లలో దేశంలో ఏ మూలన వెతికినా బిజెపి చెప్పిన 'మంచి రోజులు' (అచ్ఛేదిన్) కానరావడం లేదు. అంతటా ఆకలి మంటలు, నిరుద్యోగం, ధరాఘాతం ఇవే తిష్టవేశాయి. దీంతో బిజెపిని ఈ ఎన్నికల్లో ప్రజలు తరిమికొట్టడం ఖాయమని రాజకీయ విమర్శకులు విశ్లేషిస్తున్నారు.



న్యూఢిల్లీ : బిజెపి పాలనలో ఆహార ద్రవ్యోల్బణం ప్రధాన సమస్యగా మారిపోయింది. 2015 నుంచి ఇదే సమస్య. నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. మధ్యలో కోవిడ్ పరిస్థితి నుంచి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడేసింది. అయినా బిజెపి చేష్టలుడిగి కార్పొరేట్ సేవలో పరితపించిందే కానీ పేదలను పట్టించుకున్న పాపాన పోలేదు.

జేబులకు చిల్లులే..

ధరల పెరుగుదల ప్రభావం కోట్లాది మంది భారతీయులకు కష్టమవుతున్నదని చెప్తున్నారు. ఆహార ద్రవ్యోల్బణం సామాన్య, మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నదని అంటున్నారు. 2014 ఎన్నికల తర్వాత మోడీ సర్కారు కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాతి ఏడాది నుంచే ఆహార ద్రవ్యోల్బణం మోడీ సర్కారుకు అతి పెద్ద సమస్యగా పరిణమించిది. బిజెపి సర్కారు మొదటి సంవత్సరం దాల్ స్కామ్‌తో దెబ్బతిన్నది. దీని ఫలితంగా పప్పుధాన్యాల ధరలు కిలో రూ.200కి చేరుకున్నాయి. ప్రస్తుతం, ఈ ఏడాది ఫిబ్రవరిలో కూరగాయల ధరలు ప్రియం కావటంతో ఆహార ద్రవ్యోల్బణం 8.66 శాతానికి చేరుకున్నది. జనవరిలో కూరగాయలపై 30.25 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది. ధరలు 27.03 శాతం పెరిగాయి. టమాటాలు కిలోకు రూ. 200, ఉల్లిపాయలు, గోధుమలు, పంచదార, ఇతర ఆహార పదార్థాలకు విపరీతమైన ధరలు చెల్లించి కొనాల్సిన దుస్థితి భారతీయులకు ఏర్పడిందని సామాన్య జనం మోడీ సర్కారుపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనలేక..

భారతదేశంలో 2024 ఎన్నికలు సమీపించిన తరుణంలో.. 2022 చివరి నాటికి జాతీయ ఆహార భద్రతా చట్టం నుంచి అదనపు ఆహార రేషన్‌లను తొలగించిన తర్వాత, ప్రభుత్వం ఉచిత రేషన్ కార్యక్రమాన్ని బలవంతంగా నిర్వహించవలసి వచ్చిందనీ, 80 కోట్ల మంది భారతీయులకు ఆహారం అందించడం కొనసాగించిందని విశ్లేషకులు చెప్తున్నారు. నిటి ఆయోగ్ తన 2023 నివేదికలో 74.1 శాతం మంది భారతీయులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయటానికి కష్టపడుతున్నారని పేర్కొన్నది. ఈ గణాంకాలతో ఐక్యరాజ్యసమితి సైతం ఏకీభవించటం గమనార్హం.

2013 జులైలో గోధుమల ధరలు కిలోకు రూ. 16.10 ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్ నాటికి రూ. 23.65కి ఎగబాకింది. గత రెండేండ్లుగా గోధుమల ధరలు ఎప్పుడూ లేనంతగా పెరిగాయి. అధిక ఎరువుల ధరలు, అస్థిర వాతావరణం, విధాన నిర్ణయాల లోపం కారణంగా ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని నిపుణులు అంటున్నారు.

పాలు..వంట గది అవసరాలూ భారమే..

పాలు వంటి ఇతర వంటగది అవసరాలు కూడా గత సంవత్సరం రిటైల్ ధరలో 15 శాతం పెరుగుదలను నివేదించాయి. ఆ తర్వాత వంట నూనెల ద్రవ్యోల్బణం కూడా కనిపించింది. 2021లో ధరలు రూ. 80 నుంచి రూ.180కి పెరిగాయి. కూరగాయలు, ముఖ్యంగా టమాటాలు, పెట్రోలు కంటే ఖరీదైనవిగా మారటం సాధారణ భారతీయుల బాధలను మరింత తీవ్రం చేసిందని విశ్లేషకులు అంటున్నారు. వాతావరణ పరిస్థితులకు తోడు మోడీ సర్కారు తప్పుడు విధాన నిర్ణయాల కారణంగా ఉల్లి ధరలు కూడా చాలా అస్థిరంగా ఉన్నాయి. 2014 ఫిబ్రవరిలో నాసిక్ మండిలో కిలో ఉల్లి రూ. 45గా ఉండగా.. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి రూ.13.8కి పెరిగింది.

వేసవిలో భారతీయులందరికీ నచ్చే పండు మామిడిపండ్లు. ఒక నివేదిక ప్రకారం, 2012 బేస్ ఇయర్ నుంచి 2023 వరకు మామిడి ధర సూచిక విలువ దాదాపు 116 శాతం పెరిగింది. నివేదిక 2013 ఆర్థిక సంవత్సరానికి గానూ ధర రూ.96గా ఉండగా..2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 216.1కి ఎగబాకింది. యాపిల్స్ ధరలు కూడా పెరిగాయి. యాపిల్ మార్కెట్లపై కార్పొరేట్ నియంత్రణకు వ్యతిరేకంగా రైతుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. యాపిల్ రైతులు హిమాచల్ ప్రదేశ్‌లో అదానీ స్టోర్‌లకు వ్యతిరేకంగా, రాష్ట్ర ప్రభుత్వ భవనాల వెలుపల కూడా నిరసనలు నిర్వహించారు.

అధిక ఆహార ద్రవ్యోల్బణంతో షోషకాహార లోపం

అధిక ఆహార ద్రవ్యోల్బణం కారణంగా ఆకలి, మరింత పోషకాహార లోపం సమస్యలు తలెత్తుతాయని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. అధిక ద్రవ్యోల్బణం వచ్చే చిక్కులు ఇప్పటికే పేద, సాధారణ మధ్య తరగతి ప్రజలను పౌష్టికాహారానికి ఏమో కానీ.. కనీస ఆహారానికి కూడా దూరం చేస్తున్నదని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. ఇటు సరైన ధరలు లేకపోవటంతో రైతులు కూడా సవాళ్లను ఎదుర్కొంటున్నారు.

ధరల పెరుగుదల ప్రధానంగా పెద్ద వ్యాపారులు, స్టాకర్లు, అగ్రి-ప్రాసెసర్‌లకు ప్రయోజనం చేకూరుస్తాయనీ, ద్రవ్యోల్బణం దెబ్బకు వినియోగదారులు, పన్ను చెల్లింపుదారులు, రైతులు, చిన్న వ్యాపారులందరూ నష్టాన్ని, ఇబ్బందులను ఎదుర్కొంటారని నిపుణులు చెప్తున్నారు. భారత్‌లో ఆహార ద్రవ్యోల్బణం జాతీయ, ప్రపంచ సగటు కంటే మళ్లీ పెరుగుతున్నదనీ, దశాబ్దం పాటు అధికారంలో ఉన్న మోడీ సర్కారు మాత్రం దానిని నియంత్రించడంలో విఫలమైందని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ ఎన్నికల్లోనూ ఆహార ద్రవ్యోల్బణం సమస్య ఓట్ల రూపంలో ప్రతిబింబిస్తుందని సామాజికవేత్తలు అంటున్నారు.

రైల్వేలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

• రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైల్వే వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని చూస్తోందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ మండిపడ్డారు. రైల్వేలను తన స్నేహితులకు విక్రయించేందుకు ఓ సాకు చూపుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఒక యూజర్ షేర్ చేసిన వీడియోను రాహుల్ గాంధీ రీ పోస్ట్ చేశారు. ఈ వీడియో రైలు ప్రయాణికుల కష్టాలను చూపించారు. రిజర్వ్ బోగీలోనూ ప్రయాణికులు కిక్కిరిసిపోయిన ఉండటం, బోగీలో చోటులేక టాయిలెట్ లో కూర్చుని ప్రయాణిస్తున్న అవస్థను ఈ వీడియోలో చూపించారు. మోడీ పాలనో రైలు ప్రయాణం శిక్షగా మారిందని, జనరల్ బోగీలను తగ్గించి 'ఎలైట్ రైళ్ల'(లగ్జరీ ట్రైన్లను) మాత్రమే ప్రోత్సహిస్తుందని రాహుల్ విమర్శించారు. తద్వారా రైల్వే ప్రయాణికుల్ని ఇబ్బంది పెడుతోందని అన్నారు. కన్ఫర్మ్ చేసిన టిక్కెట్లతో కూడా ప్రయాణీకులు తమ సీట్లపై ప్రశాంతంగా కూర్చోలేకపోతున్నారని, సామాన్యులు మరుగుదొడ్డిలో దాక్కుని లేదా నేలపై కూర్చొని ప్రయాణం చేయవలసి వస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 'మోడీ ప్రభుత్వం తన విధానాలతో రైల్వే వ్యవస్థలను బలహీన పరచి .. రైల్వేను తన స్నేహితులకు విక్రయించేందుకు ఒక సాకు చూపుతుంది' అని గాంధీ ఆరోపించారు. సామాన్యులకు సౌకర్యవంతమైన రవాణా కావాలంటే రైల్వేలను నాశనం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని రాహుల్ గాంధీ పిలుపు నిచ్చారు.

కాంగ్రెస్‌పై మోడీ అవాకులు, చెవాకులు



జైపూర్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్‌లో ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవాకులు, చెవాకులు పేలారు. దేశంలో వ్యక్తిగత సంపదనంతా ముస్లింలకు పంపిణీ చేయాలని కాంగ్రెస్ యత్నిస్తుందని మోడీ ఆరోపించారు. దేశంలోని వనరులపై ముస్లింలకే తొలి హక్కు అని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించిందని అన్నారు. రాజస్థాన్‌లోని జలోర్, బనస్వారా నియోజకవర్గాల్లో బిజెపి అభ్యర్థుల తరుపున మోడీ ప్రచారం నిర్వహించారు. దేశాన్ని కాంగ్రెస్ ఎప్పటికీ బలోపేతం చేయదని ప్రధాని మోడీ ఆరోపించారు. 'ఇప్పటికే జరిగిన మొదటి దశ పోలింగ్‌లో రాజస్థాన్‌లోని సగం మంది ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారు. కాంగ్రెస్ ఎప్పటికీ దేశాన్ని శక్తిమంతం చేయదని ఇక్కడి ప్రజలకు తెలుసు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ రావాలని ప్రజలు కోరుకోవట్లేదు" అని మోడీ అన్నారు. బంధుప్రీతి, అవినీతితో చెదలు పట్టిన కాంగ్రెస్ దేశాన్ని అభివృద్ధి చెందకుండా చేసిందని దుయ్యబట్టారు. గతంలో చేసిన పాపాలకు కాంగ్రెస్ ప్రస్తుతం శిక్ష అనుభవిస్తోందన్నారు. ఒకప్పుడు 400 సీట్లు గెలిచిన ఆ పార్టీ ప్రస్తుతం 300 సీట్లలో కూడా సొంతంగా పోటీ చేయలేకపోయిందని వ్యాఖ్యానించారు. దేశంలోని ప్రతి ఇంటికి, ప్రతి రైతుకు నీరు అందేలా చేయటం తన లక్ష్యమని మోడీ పేర్కొన్నారు. అయితే దురదృష్టం కొద్దీ రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందులో కూడా అవినీతి చేసిందని, ఈ తప్పును మరోసారి జరగనీయకుండా కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని ప్రధాని ప్రజలను కోరారు. రాజస్థాన్‌లో 25 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. వీటిలో 12 స్థానాలకు ఈ నెల 19న పోలింగ్ నిర్వహించగా, మిగిలిన 13 స్థానాలకు ఈనెల 26న రెండో విడత పోలింగ్ జరగనుంది.

కాషాయీకరణ కుట్రకు నాంది

• దూరదర్శన్ రంగు మార్పుపై స్టాలిన్ ఆగ్రహం

చెన్నై : దూరదర్శన్ లోగోను కాషాయ రంగులోకి మార్చడం పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షులు ఎంకె స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రతీ అంశాన్ని కాషాయీకరణ చేసే కుట్రకు నాందిగా దీనిని ఆయన విమర్శించారు. 'తమిళపదం 'వానోలి' స్థానంలో ఇదివరకే 'ఆకాశవాణి'గా బిజెపి మార్పు చేశారు. ఇప్పుడు మళ్లీ అదే రీతిలో కాషాయ రంగులద్దారు. కేంద్రంలోని ఫాసిస్టు పార్టీ అహంకారానికి ప్రతీక' అని స్టాలిన్ అన్నారు. దేశ ప్రజానీకం అంతా సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిపై ఆగ్రహాన్ని ప్రదర్శిస్తారని, వచ్చే జూన్ 4న బిజెపి ఘోర పరాభవాన్ని రుచిచూస్తుందని పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్ మాజీ ఐఎఎస్ అరెస్ట్

రాయ్‌పూర్ : మద్యం కుంభకోణంలో రూ.200 కోట్ల మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఛత్తీస్‌గఢ్‌కి చెందిన మాజీ ఐఎఎస్ అనిల్ తుతే జాను, ఆయన కుమారుడు యష్ తుతేజాను ఇడి అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం సంబంధిత అధికారులు తెలిపారు.

ఫెడరల్ ఏజెన్సీ 2003 బ్యాచ్ అధికారిని శనివారం రాయ్‌పూర్‌లోని ఆర్థిక నేరాల విభాగం (ఇడబ్ల్యుఎస్) అవినీతి నిరోధక బ్యూరో కార్యాలయం (ఎసిబి) నుండి అదుపులోకి తీసుకుంది. ఆదాయ పన్ను శాఖ ఫిర్యాదు ఆధారంగా గతంలో దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత లిక్కర్ స్కామ్ కేసులో ఇడి కొత్త మనీలాండరింగ్ కేసును దాఖలు చేసింది. ఈ కేసులో నేరపూరిత ఆదాయం రూ.2,161 కోట్లుగా ఇడి అంచనా వేసింది.

మాల్దీవుల్లో ముగిసిన పార్లమెంటు ఎన్నికలు

• నేడు ఫలితాలు
• ముయిజ్జుకే విజయావకాశాలు

ఓటు వేస్తున్న మహ్మద్ ముయిజ్జు

మాలె : ద్వీప దేశం మాల్దీవులులో పార్లమెంటు ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. మాల్దీవుల పార్లమెంట్ (పీపుల్స్ మజ్లీస్)లో ఐదేళ్ల కాలానికి 93 మంది సభ్యులను ఎన్నుకునేందుకు ఈ ఎన్నికలు నిర్వహించారు. దాదాపు 2.84 లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యారు. దేశాధ్యక్షులు మహ్మద్ ముయిజ్జు ప్రాతినిధ్యం వహిస్తున్న పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ (పిఎన్‌సి) ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించే వీలుందని స్థానిక మీడియా పేర్కొంది. పూర్తి స్థాయి ఎఇన్నకల ఫలితాలను ఈ నెల 22న ప్రకటించనున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం..పిఎన్‌సి 93 స్థానాలకు గాను 50 స్థానాల్లో విజయం సాధించనున్నట్లు తెలుస్తోంది. సాధారణ మెజారిటీకి 47 స్థానాలు వస్తే సరిపోతుంది. గతేడాది అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన మహ్మద్ మొయిజ్జు.. తన విధానాలను ముందుకు తీసుకువెళ్లేందుకు పార్లమెంట్ మద్దతు లభిస్తుందా లేదా అనేది ఈ నెల 22న తేలనుంది. ముయిజ్జు భారత వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారంటూ ప్రతిపక్షం ఆయనపై ఆరోపణలు గుప్పిస్తున్న నేపథ్యంలో ఈ ఎన్నికలు జరగడం గమనార్హం.

పాక్‌లో సాయుధుల ఘాతుకం

• ఏడుగురు కస్టమ్స్ అధికారుల కాల్చివేత

ఇస్లామబాద్ : పశ్చిమ పాకిస్థాన్‌లో గుర్తు తెలియని సాయుధులు రెచ్చిపోతున్నారు. రోజుల వ్యవధిలోనే ఏడుగురు కస్టమ్స్ అధికారులను కాల్చి చంపారు. మూడు రోజుల కిందట ఐదుగురు కస్టమ్స్ అధికారులను కాల్చి చంపిన దుండగులు అదే రీతిలో ఆదివారం మరో ఇద్దరిని హత్య చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే ఈ సాయుధులు ఎవ్వరనేది ఇప్పటి వరకు తెలియరాలేదు. ఈ రెండు ఘటనలపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులో ఉన్న పాకిస్థాన్ ప్రాంతాల్లో ఇటీవల కాలంలో ఇలాంటి దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పాక్-ఆఫ్ఘన్ మధ్య ఉద్రికత్తలు పెరుగుతున్నాయి.

బ్రెజిల్‌లో డెంగీ విజృంభణ

సావో పోలో : బ్రెజిల్‌లో డెంగీ విజృంభిస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఈ వ్యాధి కారణంగా 1601 మంది చనిపోయినట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. మరో 2061 మరణాలపై దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది 35.3 లక్షల డెంగీ జ్వరం అనుమానిత కేసులు నమోదయ్యాయని తెలిపింది. ప్రతి లక్ష మందికి 1741 చొప్పున డెంగీ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నట్లు వెల్లడించింది. మరణాల రేటు 35 శాతంగా ఉందని, ఇది 2023 కంటే అధికమని, గతేడాది 1179 మంది చనిపోయారని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా డెంగీ నివారణ టీకాల కార్యాక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది.

అసోంలో సిట్టింగ్ ఎంపీకి షాక్

• తిరస్కరణకు గురైన నబా సరానియా నామినేషన్

కోక్రాఝర్ (అసోం): ఇప్పటికే రెండు సార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించాలని కలలుగన్నకోక్రాఝర్ ఎంపి నబ కుమార్ సరానియాకు ఊహించని షాక్ తగిలింది. ఆయన నామినేషన్ చెల్లదని ఎన్నికల సంఘం ఆదివారం ప్రకటించడంతో అవాక్కయ్యారు. నామినేషన్ల స్క్రూటిని అనంతరం జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రదీప్ కుమార్ ద్వివేది ఈ విషయం వెల్లడించారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 16 నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలన అనంతరం నబకుమార నామినేషన్ పత్రాలు సరిగా లేవన్న కారణంతో అధికారులు దానిని తిరస్కరించారు. దీంతో కోక్రాఝర్‌లో పోటీ నుంచి ఆయన అనివార్యంగా నిష్క్రమించాల్సి వచ్చింది.

షెడ్యూల్డ్ తెగలకు రిజర్వ్ చేయబడిన కోక్రాఝర్‌తో పాటు గౌహతి, బార్‌పేట, ధుబ్రీలలో మే 7న మూడో దశలో ఓటింగ్ జరగనున్నది.

2014 నుంచి ఇండిపెండెంట్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న గణ సురక్ష పార్టీ(జీఎస్పీ) అధినేత సరానియా.. తన ఎస్టీ (ప్లెయిన్స్) హెూదాను స్టేట్ స్క్రూటినీ కమిటీ కొట్టివేయటాన్ని సవాలు చేస్తూ గౌహతి హైకోర్టును ఆశ్రయించారు. అయితే, కోర్టు దానిని గురువారం కొట్టివేసింది.

ఆల్ అస్సాం గిరిజన సంఘంచేత 1986 నవంబర్ 18న జారీ చేయబడిన సర్టిఫికెట్‌ను ఆయన తన నామినేషన్‌తో జతపరిచారు. అందులో తాను 'రావ' కమ్యూనిటీకి చెందినవాడినని పేర్కొన్నారు. అయితే, ఆ సర్టిఫికెట్‌ను జారీ చేసిన అథారిటీ సంతకం ఏమీ లేదన్న కారణంతో దానిని తిరస్కరించారు. ఒక వ్యక్తి రెండు వేర్వేరు కమ్యూనిటీలకు చెందినవాడుగా కొనసాగలేడని, వేర్వేరు కమ్యూనిటీలకు చెందిన రెండు ఎస్టీ సర్టిఫికెట్లను కలిగి ఉండకూడదని ఎన్నికల అధికారి చెప్పారు.

ఓటమి తప్పదనే నితీష్‌కు మతి భ్రమించింది !

• ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్

పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ వ్యహార శైలి మతిస్థిమితంలేని వ్యక్తి చేష్టల్లా ఉందని ఆర్‌జెడి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ విమర్శించారు. బిజెపి నాయకులు తమ ప్రచార సభలకు కూడా నితీష్‌ను రానివ్వడం లేదంటే ఆయన మానసిక స్థితిని అర్థం చేసుకోవచ్చునని లాలూ అన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో సరన్ స్థానం నుంచి పోటీ చేస్తున్న తన రెండో కుమార్తె రోహిణి అచార్య తరుపున మూడు రోజుల పాటు ప్రచారం నిర్వహించిన లాలూ ప్రసాద్ ఆదివారం విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఇతర పార్టీలు, మహాఘట్బంధన్ అభ్యర్థులు తరపున కూడా ప్రచారం చేస్తానన్నారు. ఈ నెల 20న ఎన్నికల ప్రచార సభలో నితీష్ కుమార్ మాట్లాడుతూ 'లాలూకు పని ఏమీ లేదు. పిల్లలను కనడం తప్పు' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై అడిగిన ప్రశ్నకు లాలూ స్పందిస్తూ 'నితీష్‌కుమార్‌కు మతి భ్రమించింది. అందుకే ఆయనను బిజెపి కూడా ప్రచారానికి తీసుకెళ్లడం లేదు' అని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదనే నైరాశ్యంలో నితీష్ ఉన్నారని, అందుకే ఇలాంటి అర్థంపర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని లాలూ అన్నారు. ఈ ఎన్నికల్లో బీహార్‌లో బిజెపి తుడుచుపెట్టుకుపోతుందన్నారు. బీహార్‌లోని ఆర్‌జెడి నేతృత్వంలోని మహాఘట్బంధన్ ఎన్ని సీట్లు గెలుచుకుంటుందనే ప్రశ్నకు 'అన్నీ స్థానాలను మేం గెలుచుకుంటాం. బిజెపి తుడుచుపెట్టుకుపోతుంది' అని లాలూ అన్నారు. సరన్ స్థానం నుంచి 1977, 1989ల్లో లాలూ ప్రసాద్ లోక్‌సభ ఎన్నికయ్యారు. ఇప్పుడు ఇక్కడ నుంచి ఆయన కుమార్తె రోహిణి పోటీ చేస్తున్నారు. బీహార్‌లోని మొత్తం 40 లోక్‌సభ స్థానాలకు ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నెల 19న ఔరంగాబాద్, నవాడా, గయ, జముయి స్థానాల్లోకు ఎన్నికలు జరగ్గా 48.23 శాతం పోలింగ్ నమోదైంది.

పదేళ్ల నాటి స్తోమత కూడా లేదు!

• దారుణంగా క్షీణించిన శ్రమజీవుల కొనుగోలు శక్తి
• జైరాం రమేశ్ ఆందోళన

న్యూఢిల్లీ : దేశంలో శ్రమ జీవుల కొనుగోలు శక్తి దారుణంగా పడిపోయిందని, పదేళ్ల కిందట ఉన్న కొనుగోలు స్తోమత కూడా ఇప్పుడు లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఆదివారం ఆందోళన వ్యక్తం చేవారు. అనేక డేటాలు, సర్వేలు ఇదే విషయాన్ని నొక్కి చెబుతున్నాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వేతనాలు, ఆదాయాల పెరుగుదలలో క్షీణత, ద్రవ్యోల్బణం పెరుగదలలో వృద్ధి కారణంగా ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతోందని ఆయన విశ్లేషించారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న పదేళ్ల సమయంలో వ్యవసాయ కార్మికుల వేతనాలు ప్రతీ ఏడాది 6.8 శాతం చొప్పున పెరిగాయని గుర్తు చేశారు. మోడీ ప్రధానిగా గత పదేళ్ల కాలంలో వ్యవసాయ కార్మికల వేతనాలు ప్రతీ ఏడాది 1.3 శాతం చొప్పున తగ్గిపోతూవస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ గణాంకాలే ఈ విషయాలను వెల్లడిస్తున్నాయన్నారు. దేశంలో కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేటు రంగం సిద్ధంగా లేదని అన్నారు. 'దేశంలో పెట్టుబడులు రికార్డు స్థాయిలో కనిష్ట స్థాయికి పడిపోయాయి. మన దీర్ఘ కాలిక వృద్ధికి ముప్పు వాటిల్లింది' అని జైరాం రమేష్ చెప్పారు. యుపిఎ పదేళ్ల కాలంలో జిడిపిలో పెట్టుబడులు 33.4 శాతంగా ఉంటే, మోడీ హయంలోని పదేళ్లలో జిడిపిలో పెట్టుబడులు 28.7 శాతం మాత్రమేనని జైరాం రమేష్ తెలిపారు.

మోడీని ఆరాధించే మతంగా మారిన బిజెపి : చిదంబరం ఎద్దేవా

న్యూఢిల్లీ : బిజెపి అనేది ఒక రాజకీయ పార్టీ కాదని, అది ఇప్పుడు ప్రధానమంత్రి మోడీని ఆరాధించే మతంగా మారిందని కాంగ్రెస్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరం విమర్శించారు. బిజెపి రాజకీయ పార్టీ కాదు.. అది ఒక కల్ట్‌గా మారిందని, ఆ మతం నరేంద్ర మోడీని ఆరాధిస్తున్నదని చిదంబరం అన్నారు. ప్రస్తుతం దేశంలో మతపరమైన ఆరాధన బలం పెరుగుతోందని, ఇది నియంతృత్వానికి దారి తీస్తుందని చిదంబరం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు నిరుద్యోగమని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి గురించి పేర్కొన్నట్లు తెలిపారు. పదేళ్ల మోడీ ప్రభుత్వ పాలనలో వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ పూర్తిగా నశించాయి. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుకుంటున్నారని చిదంబరం తెలిపారు. ఇండియా వేదిక అధికారంలోకి వచ్చిన తర్వాత సిఎఎను రద్దు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అయితే ఈ హామీని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రస్తావించలేదు. తమిళనాడులోని మొత్తం 39 ఎంపి స్థానాలను, పాండిచ్చేరిలోని ఒక సీటును ఇండియా వేదిక గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

14 రోజుల్లోనే బిజెపి తన మేనిఫెస్టోను రూపొందించిందని, అయితే దానికి మేనిఫెస్టో అని పేరు పెట్టలేదని, దానిని 'మోడీ కి గ్యారెంటీ' అని పెట్టారని విమర్శించారు.

నామినేషన్ల దశలోనే అక్రమాలకు తెరలేపిన బిజెపి

• సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

గాంధీనగర్ : గుజరాత్‌లో నామినేషన్ల దశలోనే బిజెపి అక్రమాలకు తెర లేపిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. సూరత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దిగిన నిలేష్ కుంభని నామినేషన్‌ను అధికారులు తిరస్కరించారు. నామినేషన్‌పై ముగ్గురు ప్రతిపాదకుల సంతకాలు చేయలేదన్న కారణంగా ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. కాంగ్రెస్ తరపున ప్రత్యామ్నాయ అభ్యర్థి నామినేషన్‌ను కూడా ఇదే కారణంతో అధికారులు తిరస్కరించారు. దీంతో సూరత్ నియోజకవర్గంలో ప్రస్తుతానికి కాంగ్రెస్ అభ్యర్థి ఎవ్వరూ లేరు. పోలీసులు, అధికారులతో కలిసి బిజెపియే తమకు అభ్యర్థి లేకుండా చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. తమ అభ్యర్థిని పోటీ నుంచి తప్పించేందుకు పోలీసులు, అధికారుల సహాయంతో ప్రతిపాదకుల్ని బిజెపి అపహరించిందని పేర్కొంది. ప్రతిపాదకులు సంతకాలు లేవని శనివారమే కాంగ్రెస్ అభ్యర్థికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆదివారం వరకూ అభ్యర్థి నిలేష్ కుంభని సమయం కోరారు. అయితే తన ముగ్గురు ప్రతిపాదకులు రమేష్ పొలారా, జగదీష్ సవలియా, ధ్రువిన్ ధమేలియా ప్రస్తుతం అందుబాటులో లేరని కుంభని చెబుతున్నారు. వీరినే బిజెపియే అపహరించి నిర్బంధించినట్లు ఆ పార్టీ ఆరోపిస్తోంది.

హైకోర్టుకు వెళ్తాం : శక్తిసింహ్ గోహ్లీ

తమ అభ్యర్థి నామినేషన్‌ను చిన్నపాటి కారణాలను సాకుచూపి తిరస్కరించడంపై గుజరాత్ హైకోర్టును ఆశ్రయిస్తామని, రిటర్నింగ్ అధికారిపై పిటిషన్ దాఖలు చేస్తామని కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ (పిసిసి) అధ్యక్షులు శక్తి సింహ్ గోహ్లీ తెలిపారు. బిజెపికి ప్రయోజనం చేకూర్చేందుకే అధికారులు తమ అభ్యర్థి నిలేశ్ కుంభాని నామినేషన్‌ను తిరస్కరించారని ఆయన ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని ఆయన అన్నారు.

శ్మశానవాటిక గోడకూలి నలుగురు మృతి

చండీగఢ్: హర్యానా రాష్ట్రంలో విషాద ఘటన చోటు చేసుకుంది. శ్మశానవాటిక గోడ కూలి నలుగురు చనిపోయారు. గురుగ్రామ్‌లోని అర్జున్ నగర్‌లో నివాసముంటున్న ఓ కుటుంబంపై ఆదివారం తెల్లవారుజామున శ్మశాన వాటిక గోడ కూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులతో పాటు మరో నలుగురు శిథిలాల కింద చిక్కుకున్నారు. వీరిని కాపాడేందుకు ప్రయత్నించేలోగా తీవ్రంగా గాయపడ్డ 11 ఏండ్ల తాన్యా, దేవి దయాళ్(70), మనోజ్‌గాబా(54), కృష్ణకుమార్ (52) మృతిచెందారు. దీపాప్రధాన్ అనే మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసు అధికారులు తెలిపారు. మృతదేహాలను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

మీ కోసం

ఎంత కడిగినా వాటర్ బాటిళ్లు వాసన వస్తుంటే కొంచెం పేస్ట్ తీసుకుని అందులో కాసిన్ని నీళ్లు పోసి, ఆ మిశ్రమంతో బాటిల్ లోపల, బయట కడగాలి.

జీవన సౌరభం

మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించాలి. బలహీనపరిచే ప్రతి ఆలోచనను తిరస్కరించాలి.

పచ్చా పచ్చని

పచ్చా పచ్చని కాయ
ముచ్చటైన పుచ్చకాయ
స్వచ్ఛమైన పుచ్చకాయ
మంచి చేసే పుచ్చకాయ

పైకి చూడ పచ్చగుండు
కోసి చూస్తే ఎర్రగుండు
తింటే తియ్యగా నుండు
కొంటే చౌకగా ఉండు

పోషకాలు దండి గుండు
జ్ఞాపకశక్తి పెంచు మెండు
వేసవిలో వచ్చే నండి
దాహాన్నే తీర్చేనండి

జీర్ణశక్తి పెంచుతుంది
చర్మమే బాగుండునండి
పుచ్చ రసమే తాగండి
పచ్చగా జీవించండి

- గుండాల నరేంద్రబాబు,
94932 35992.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ

జె.భాను ప్రియ, 1వ తరగతి, ఎం.పి.పి.ఎస్, వానపాముల, పెదపారుపూడి మండలం, కృష్ణా జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కూలి పనులు చేసిన చోటే
స్కూలు నిర్వహిస్తున్నాడు..

'కలలు కనే ధైర్యం చేయండి', 'మూలాలు మర్చిపోవద్ద'న్న స్ఫూర్తివంత మాటలు చాలామంది వినే వుంటారు. అయితే ఆచరణలో పెట్టేది కొందరే. ఒరిస్సాకు చెందిన డాక్టర్ ప్రదీప్ సేథీ మాత్రం ఆ మాటలను అక్షర సత్యాలు చేసి చూపించారు. పేదరిక కుటుంబంలో పుట్టిన అతను డాక్టరు కావాలన్న పెద్ద కల కన్నాడు. అది నెరవేరిన తరువాత తన దారి తాను చూసుకోలేదు. పేదరికం తన చదువుకోసం ఎన్ని ఆటంకాలు సృష్టించిందో ఆ పరిస్థితులు తన ఊరి పిల్లలకు రాకూడదని కంకణం కట్టుకున్నారు. ఫలితంగా ప్రాథమిక విద్యా సౌకర్యాలు కూడా అంతంత మాత్రం లభించే ఆ గ్రామంలో అంతర్జాతీయ స్థాయి పాఠశాలను నెలకొల్పి పేదపిల్లలకు ఉచితంగా విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఎంతోమందికి ఆదర్శవంతంగా నిలుస్తున్న సేథీ ప్రయాణం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న సేథీ, ఒరిస్సాలోని బెరునపాడి గ్రామంలో పుట్టారు. ఉన్నత చదువులు చదవాలని బాల్యం నుండే కలలుకన్నారు. కానీ పాఠశాల విద్యను కూడా సక్రమంగా పూర్తిచేయలేని పరిస్థితులు కుటుంబంలో ఉండేవి. తండ్రికి తోడుగా స్కూలుకు వెళ్లకుండా కూలి పనులకు వెళ్లిన సందర్భాలు సేథీ జీవితంలో అనేకం ఉన్నాయి. ఎంబిబిఎస్ ఫీజు కట్టేందుకు వ్యవసాయ కూలీగా పొలం పనులు కూడా చేశారు. ఇన్ని ప్రతికూలతల మధ్య, తన చదువు సక్రమంగా సాగిందంటే దాతలు చేసిన సాయమే అని ఆయన చాలా సందర్భాల్లో గుర్తుచేసుకుంటారు. 'నేను పుట్టి పెరిగిన గ్రామం, జిల్లా అంతగా అభివృద్ధి చెందినవి కాదు. మేము, రెండు పూటలా తిండి తిన్న రోజులు చాలా తక్కువ. ఒక్క జత బట్టలే వారం రోజులు వేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. పని ఉన్నప్పుడు నాన్నకు తోడుగా స్కూలుకు వెళ్లకుండా ఉండేవాడ్ని. అయితే ఇలా ఎంతకాలం? జీవితమంతా పశువులకు మేత వేస్తూ, పొలంలో గడ్డి కోస్తూ ఉండాల్సిందేనా? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఈ పరిస్థితుల నుండి నన్ను బయటపడవేసేది చదువు మాత్రమే అని బలంగా నమ్మాను' అంటూ గతాన్ని గుర్తుచేసుకున్న సేథీ, 12 ఏళ్లు వచ్చాకే స్కూలుకు వెళ్లడం ప్రారంభించారు.

'ఆ స్కూల్లో నాకు నాణ్యమైన విద్య లభించింది. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం చేయాలని కలలు కన్నాను. ఆ తరువాత డాక్టరు కావాలని ఆశపడ్డాను. నా వైద్య విద్య కోసం నాన్న మా ఇంటిని అమ్మేశాడు. ఫీజు చెల్లించేందుకు నేను కూడా రోజు కూలీగా వెళ్లాను. బాల్యంలో నాకు ఎదురైన కష్టాలు, నాలో ధైర్యాన్ని నింపాయి. కాలం ఎంత కష్టంగా గడిచింది అంటే, నెలకు రూ.1300 వచ్చే స్కాలర్‌షిప్పు డబ్బులతోనే పుస్తకాలు, మెస్ ఛార్జీలు కట్టేవాడ్ని' అంటున్న సేథీకి పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. అలా ఆయన చదివిన 'ఓ యోగి ఆత్మ కథ' పుస్తకం, సేథీ జీవన పంథాను మార్చేసిందని, 'చిన్న చిన్న పనులతోనే అద్భుతాలు సాధించవచ్చ'న్న స్ఫూర్తివంత మాటలు నన్ను బాగా ప్రభావం చేశాయ'ని సేథీ, గతాన్ని మరోసారి జ్ఞాపకం చేసుకున్నారు.



'2004లో ఎంబిబిఎస్ పూర్తి చేసి, ఎయిమ్స్ కళాశాలలో ఎండి చేయాలని దరఖాస్తు చేసుకున్నాను. 2008 నాటికి వైద్యుడిగా స్థిరపడ్డాను. చదువంటే అమితాసక్తి గల నేను దాతల సాయంతోనే ఇంత ఉన్నతస్థానానికి చేరుకున్నాను. దుబాయ్‌లో ఓ క్లినిక్, స్టెమ్ సెల్ ప్రాజెక్టు ప్రారంభించేంతగా ఎదిగాను. కానీ నా ఊరు, అక్కడి పిల్లలు నా గమ్యాన్ని మరో పంథాలోకి తీసుకెళ్లారు' అంటూ తన స్కూలు ప్రారంభ రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు.

'ఉత్కల్ గౌరవ్'కి ఇలా బీజం పడింది..

2016లో గ్రామంలో 'ఉత్కల్ గౌరవ్ ఇంటర్నేషనల్ స్కూల్' ప్రారంభించారు సేథీ. 'నా చదువు కోసం ఉన్న ఒక్క ఇంటిని నాన్న అమ్మేశాడు. తను చనిపోయేలోగా ఎలాగైనా గ్రామంలోనే ఓ సొంత ఇంటిని నిర్మించుకోవాలని ఆయన కలకన్నాడు. ఆయన కల నెరవేర్చేందుకు ఇంటి నిర్మాణం ప్రారంభించాను. అయితే ఇల్లు పూర్తయిన కొంతకాలానికే ఉదర క్యాన్సర్‌తో నాన్న చనిపోయాడు. విశాలమైన ప్రాంగణంతో నిర్మించిన ఆ ఇల్లు కొంతకాలం పాటు నిరుపయోగంగా ఉండిపోయింది' అంటున్న సేథీ, ఆ సమయంలోనే ఓ ఆలోచన చేశారు. గ్రామంలోని విద్యార్థులకు ఆంగ్లం, గణితం నేర్పేందుకు ఆ ఇంట్లో ఓ కోచింగ్ సెంటర్‌ని ప్రారంభించారు. వాలంటీర్లను నియమించి నాణ్యమైన విద్యనందించారు. దూర ప్రాంతాల విద్యార్థులకు అనువుగా వసతి కూడా కల్పించారు. 2016 నుండి 2023 వచ్చేసరికి కోచింగ్ సెంటర్‌లో 300 మంది విద్యార్థుల వరకు చేరారు. వందలాది మందిలో విద్యాచైతన్యం తీసుకొచ్చిన సేథీకి స్కూలు నిర్మిస్తే వేలాదిమంది బతుకులు బాగుచేయొచ్చన్న ఆలోచన కలిగింది. అలా ఉత్కల్ గౌరవ్‌కి బీజం పడింది.

'అవకాశమే వ్యక్తికి, వ్యక్తికి మధ్య అంతరాన్ని పెంచుతుంద'ని బలంగా నమ్ముతాను. నేను కూడా అలా అందివచ్చిన అవకాశాలతోనే పైకి ఎదిగాను. ఇప్పుడు ఆ అవకాశం గ్రామాల్లోని పిల్లలకు అందివ్వాలనుకున్నాను' అంటున్న సేథీ స్కూల్లో ప్రస్తుతం 450 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. భవిష్యత్తులో 2000 మందికి విద్యనందించాలని సేథీ కలకంటున్నారు. విద్యతో పాటు విద్యార్థుల అభిరుచులకు తగ్గట్టుగా వివిధ కళల్లో వారిని నిష్ణాతులుగా చేయాలని కూడా సేథీ సంకల్పించుకున్నారు. వ్యవసాయ పాఠాలు కూడా ఈ స్కూల్లో నేర్పిస్తున్నారు. అధునాతన వసతులతో అంతర్జాతీయ స్థాయిలో ఉచితంగా విద్యనందించడం అంత ఆషామాషీ కాదు. కానీ సేథీ అది సాధ్యం చేసి చూపిస్తున్నారు. ఇక్కడ మనం ఒక విషయం గురించి తప్పక తెలుసుకోవాలి. స్కూలు నిర్వహిస్తున్న స్థలంలోనే ఒకప్పుడు సేథీ రోజు కూలీగా వ్యవసాయ పనులు చేశారు.

విద్వేష సినిమాల 'ఆట'కట్టు!

"చెబుతున్నది అబద్ధమే కావొచ్చు.. దానిని పదే పదే చెప్పు. అది నిజమే అనే భ్రమ ప్రజల్లో ప్రబలిపోతుంది." ఇది గోబెల్స్ థియరీ. మనదేశంలో దానినే ఊపిరిగా చేసుకొని బతికే పార్టీ ఎన్నికల సమయంలో దురుద్దేశ పూరితంగా ఇలాంటి అబద్ధాల, ఆవేశాల సినిమాలను తీయించి, తన అజెండా ప్రచారానికి వాడుకుంటోంది. ఇది 2014 ఎన్నికల నుంచీ ఒక ప్రణాళిక ప్రకారం సాగుతోంది. ఈ సార్వత్రిక ఎన్నికల సందర్భంగానూ ఇలాంటి ఉన్మాద ప్రబోధ సినిమాలు వెండితెరను ముంచెత్తాయి. కానీ, ఈ 'భావావేశాల క్రీడ' క్రమంగా అర్థం కావడం వల్ల కాబోలు, ఈసారి ఆ తరహా సినిమాలకు జనాదరణ దక్కలేదు.

హిందుత్వ భావజాలాన్ని, బిజెపి అనుకూల ప్రచారాన్ని చేయటానికి ఈసారి హిందీలో దాదాపు అర డజను సినిమాలు సిద్ధం అయ్యాయి. 'స్వతంత్ర వీర సావర్కర్', 'జెఎన్‌యు', 'గోద్రా', 'ఆర్టికల్ 370', 'మై అటల్ హూన్', 'బెంగాల్ 1947' వంటివి తెర మీదికి వచ్చాయి. తెలుగులో తెలంగాణా బిజెపి నాయకుడి నిర్మాణంలో 'రజాకార్' అనే సినిమా విడుదలైంది. చరిత్రను ఒక కోణంలోనుంచే వీక్షించి, విద్వేషపూరితంగా 2022లో రూపొందించిన 'కాశ్మీర్ ఫైల్స్' చిత్రం ఎక్కువ లాభాలను తీసుకురావడంతో అది అనేక భాషల్లోకి డబ్ అయింది. అదే ఒరవడిలో పూర్తి అబద్ధాలతో 'కేరళ స్టోరీ' తీసి, దర్శక నిర్మాతలు చేతులు కాల్చుకున్నారు. కొద్దిపాటి ఆదరణ దొరికినా, ఈ ఎన్నికల కోసం రంగంలోకి దిగిన సినిమాలన్నీ ఈ పాటికే అన్ని భాషల్లోకి దిగుమతి అయ్యేవి. కానీ, హిందీ రాష్ట్రాల్లోనూ ఆ సినిమాలు అట్టర్‌ఫ్లాపయ్యాయి.

స్వాతంత్య్ర సమయంలో పాల్గొనని బిజెపి సైద్ధాంతిక సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ – తమ తరఫున గొప్ప వీరుడంటూ సావర్కర్‌ని ముందిపీఠిన నిలపటానికి శాయశక్తులా ప్రచారం చేస్తూ ఉంటుంది. అతడి జీవిత చరిత్ర ఆధారంగా తీసిన చిత్రమే 'స్వతంత్ర వీర్ సావర్కర్'. స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొని తప్పు చేశానని, తనను జైలు నుంచి విడుదల చేస్తే బ్రిటీషు అధికారులకు విశ్వాస పాత్రుడినై ఉంటానని సావర్కర్ రాసుకున్న క్షమాపణ అర్జీంపు లేఖలు చరిత్రలో ఇంకా భద్రంగానే ఉన్నాయి. ఆ వాస్తవాలను దాచేసి, అవాస్తవాలతో తెరకెక్కించిన కథ 'వీర్ సావర్కర్'. దానిని అద్భుతంగా ప్రచారం చేయాలని బిజెపి ప్లాన్ చేసినా, అది నెరవేరలేదు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆ పార్టీ వాళ్లే ఉచిత ప్రదర్శనలు వేసి, ప్రాచుర్యం కల్పించే ప్రయత్నం చేశారు.

మేధావులకు నిలయంగా, మన దేశ ప్రతిష్టకు చిరునామాకు ఉన్న ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జెఎన్‌యు) అంటే బిజెపికి, దాని అనుబంధ సంఘాలకు తొలినుంచీ కడుపుమంట. ఆ విశ్వవిద్యాలయాన్ని అభాసుపాలు చేయటానికి అవి నిత్యం అసత్యాలతో ప్రచారం చేస్తూనే ఉంటాయి. ఇందులో భాగంగా వచ్చిన సినిమా 'జెఎన్‌యు – జహంగీర్ నేషనల్ యూనివర్సిటీ'. బిజెపితో చాలా దగ్గర సంబంధాలు ఉన్న వ్యాపార సంస్థ మహాకాల్ మూవీస్ ప్రయివేటు లిమిటెడ్ దీనిని నిర్మించింది. యూనివర్సిటీ అసాంఘిక శక్తులకు నిలయం అన్నట్టుగా నిర్మించిన ఈ సినిమాని ఎబివిపి వాళ్లు జెఎన్‌యు ప్రాంగణంలో ప్రదర్శించే ప్రయత్నం చేయగా, విద్యార్థులు అడ్డుకున్నారు. విద్వేష రాజకీయాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.



గతంలో 'పిఎం మోడీ' అన్న సినిమాను తీసిన సందీప్ సింగ్ ఈసారి 'మై అటల్ హూన్' సినిమా నిర్మాత. ఇతడిపై మాదక ద్రవ్యాల సరఫరా ఆరోపణలు ఉన్నాయి. బిజెపికి దగ్గరగా ఉంటూ ఆ కేసులను ఎదుర్కొంటున్నాడు. బిజెపి అనుకూల సినిమాలు తీసి, తన భక్తిని ప్రదర్శిస్తున్నాడు. అయితే, ఆ పార్టీ అనుగ్రహమైతే దొరికింది కానీ, తీసిన సినిమాలేవీ ప్రజాదరణ పొందలేదు. 'గోద్రా' సినిమాలో నటించిన కనోడియా గతంలో బిజెపి ఎమ్మెల్యే. బిజెపికి గట్టి మద్దతుగా నిలిచే నిర్మాణ సంస్థే ఈ సినిమాను నిర్మించింది. దేశ విభజన సమయంలో బెంగాల్‌లో జరిగిన హింసపై రూపొందించిన సినిమా 'బెంగాల్ 1947'. ఆ సందర్భంలో మతోన్మాదులు రాజేసిన గొడవల్లో ఎన్నో హిందూ, ముస్లిం కుటుంబాలు బలయ్యాయి. గాంధీ స్వాతంత్య్ర సంబరాల్లో కూడా పాల్గొనకుండా బెంగాల్‌లో ఆ కల్లోలిత ప్రాంతాల్లో పర్యటిస్తూ, సామరస్యం కోసం ప్రయత్నం చేశాడు. ఈ సినిమాలో ఈ చారిత్రిక వాస్తవాలకు చోటివ్వలేదు. ముస్లిములు మొత్తం హిందువులకు శత్రువులు అన్నట్టుగా అవాస్తవాలు తెరకెక్కించారు.

తెలంగాణా బిజెపి నాయకుడు గూడూరు నారాయణ రెడ్డి పూర్తి అసత్యాలతో 'రజాకార్' చిత్రాన్ని రూపొందించారు. దీనిని ప్రమోట్ చేయటానికి బిజెపి నాయకులంతా నేరుగా రంగంలోకి దిగారు. బండి సంజయ్ అయితే ఏకంగా ఆ సినిమాకు పన్ను రాయితీ ఇవ్వాలంటూ తెలంగాణా ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ ధోరణిని బిజెపి అన్నిచోట్లా కొనసాగిస్తోంది. తమకు అనుకూలమైన సినిమాలు అయినప్పుడు సాక్షాత్తూ ప్రధాని మోడీ కూడా బహిరంగ వేదికల మీద నుంచి ఆ సినిమాలను చూడాల్సిందిగా ప్రజలకు పిలుపునివ్వడం అలవాటుగా మారింది. 'కాశ్మీర్ ఫైల్స్', 'కేరళ స్టోరీ', 'ఆర్టికల్ 370' వంటి వివాదాస్పద సినిమాలకు మోడీ ప్రచారం కల్పించారు.

అయితే, ఈ సినిమా కథల వెనుక ఉన్న కథ ప్రజలకు అర్థం అవుతోంది. చరిత్రను వక్రీకరించటం, విద్వేషాన్ని పెంచటం, మతం పేరిట యువతీ యువకుల్లో ఉన్మాదం ఎక్కించటం ఈ సినిమాల అజెండా. ఈ ఎన్నికల సినిమాల పన్నాగం ఈసారి పారలేదు. అబద్ధపు పునాదుల మీద నిర్మించిన సినిమా ఆటలు అన్నిసార్లూ సాగవు. 2024 బిజెపి ఎన్నికల సినిమాలకు ఎదురైన అనుభవం ఇదే!

గెలుపుముంగిట బెంగళూరు బోల్తా

- ఒక్క పరుగు తేడాతో కోల్‌కతా చేతిలో ఓటమి

కోల్‌కతా: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సిబి)జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో అనూహ్యంగా ఓటమిపాలైంది. 223పరుగుల భారీ ఛేదనలో భాగంగా బెంగళూరు చివరి ఓవర్లో 21పరుగులు చేయాల్సి రాగా.. తొలి నాలుగు బంతుల్లో కరణ్ శర్మ మూడు సిక్సర్లు కొట్టి విజయతీరాలకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత రెండు బంతుల్లో మూడు పరుగులు చేస్తే బెంగళూరుదే విజయం అనుకున్న దశలో.. వరుసగా రెండు వికెట్లు కోల్పోయి అనూహ్యంగా ఓటమిపాలైంది. దీంతో బెంగళూరు ఒక్క పరుగు తేడాతో ఓటమిని చవిచూసింది. బెంగళూరు బ్యాటర్లు జాక్స్, రజత్ పాటిదార్ చెరో అర్ధ సెంచరీతో చెలరేగినా ప్రయోజనం లేకపోయింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆండ్రీ రస్సెల్‌కు లభించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ దిగిన కోల్‌కతా బ్యాటర్లు అదిరే ఆరంభం దక్కింది. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ చెలరేగి ఆడాడు. ఫోర్లు, సిక్సర్లతో కేవలం 14బంతుల్లోనే 48 పరుగులు చేశాడు. ఈ క్రమంలో 4.2 ఓవర్ వద్ద సిరాజ్ వేసిన బంతిని భారీ షాట్‌కు యత్నించి ఔటయ్యాడు. మరో ఓపెనర్ సునీల్ నరైన్ 10 పరుగులకే ఔటయ్యాడు. సాల్ట్, నరైన్ తర్వాత క్రీజులోకి వచ్చిన రఘువంశీ(3), వెంకటేశ్ అయ్యర్(16) ప్రభావం చూపించలేకపోయారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, రింకూ సింగ్ దూకుడుగా ఆడారు. 13.1 ఓవర్‌లో రింకూ సింగ్(24) ఔటయ్యాక శ్రేయస్ అర్ధ సెంచరీ చేసి వెంటనే ఔటయ్యాడు. చివరలో ఆండ్రీ రస్సెల్(27), రమణ్‌దీప్ సింగ్(24) రాణించడంతో కోల్‌కతా నిర్ణీత 20ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. భారీ ఛేదనకు దిగిన బెంగళూరు జట్టు ఆరంభంలోనే తడబాటుకు గురైంది. పవర్ ప్లే పూర్తయ్యేలోపే విరాట్ కోహ్లి(18), డుప్లెసిస్(7) వికెట్లు కోల్పోయింది. మూడో ఓవర్‌లో మొదటి బంతికే విరాట్ కోహ్లి ఔటయ్యాడు. హర్షిత్ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. నాలుగో ఓవర్‌లో తొలి బంతికే డుప్లెసిస్ కూడా ఔటయ్యాడు. కోహ్లి, డుప్లెసిస్ ఔటయిన తర్వాత క్రీజులోకి వచ్చిన జాక్స్(55), రజత్ పటీధర్ (52) అర్ధసెంచరీలతో బెంగళూరును లక్ష్యం దిశగా పయనింపజేశారు. 13వ ఓవర్‌లో మూడో బంతికి గ్రీన్ (6).. చివరి బంతికి లోమ్రోర్(4) ఔటయ్యారు. ఆ తర్వాత ప్రభుదేశాయ్(24), దినేశ్ కార్తిక్(25) ధాటిగా ఆడి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. ప్రభు సిమ్రన్ ఔటైనా.. దినేశ్ కార్తిక్ విజయ తీరాలకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. కానీ 19 ఓవర్‌లో దినేశ్ కార్తిక్ ఔటవ్వడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. చివరి ఓవర్లో 21పరుగులు కావల్సిన దశలో మూడు సిక్సర్లు బాదిన కరణ్ శర్మ.. రెండు బంతుల్లో మూడు పరుగులు చేస్తే విజయం దక్కే పరిస్థితు ల్లో ఔటయ్యాడు. చివరి బంతి కి ఫెర్గూసన్ రెండు పరుగులు తీసేం దుకు ప్రయత్నించి రనౌటయ్యాడు. కోల్‌కతా బౌలర్లు ఆండ్రీ రస్సెల్‌కు మూడు, నరైన్, హర్షిత్ రాణాకు రెండేసి వికెట్లు దక్కాయి.

పంజాబ్‌పై గుజరాత్ గెలుపు

ఛండీగఢ్: పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మరో మ్యాచ్‌లో గుజరాత్ జట్టు సునాయాసంగా గెలిచింది. తొలుత పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 142పరుగులకే ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని గుజరాత్ జట్టు 19.1ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ సీజన్‌లో తొలిసారి బౌలర్ల హవా కొనసాగింది. ముల్లన్‌పూర్‌లో జరిగిన ఈ మ్యాచ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. కెప్టెన్ శామ్ కరన్(20), ఓపెనర్ ప్రభ్ సిమ్రన్ సింగ్(35), హర్ ప్రీత్ బ్రార్(29) మాత్రమే రాణించగా.. రిలీ రూసో(9), జితేశ్ శర్మ(13), లివింగ్‌స్టోన్(6), శశాంక్ సింగ్(8), అశుతోష్ శర్మ (3) నిరాశపరిచారు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో సాయి కిశోర్‌కు నాలుగు, మోహిత్ శర్మ, నూర్ అహ్మద్‌కు రెండేసి, రషీద్ ఖాన్‌కు ఒక వికెట్ దక్కాయి. ఛేదనలో గుజరాత్ ఓపెనర్ సాహా(13) నిరాశపరిచినా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(35), సాయి సుదర్శన్(31) రాణించారు. ఆ తర్వాత బ్యాటర్లు నిరాశపరిచారు. చివర్లో తెవాటియా(36నాటౌట్) లోయర్ ఆర్డర్ బ్యాటర్ల సాయంతో మ్యాచ్‌ను ముగించాడు. దీంతో గుజరాత్ జట్టు 19.1 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 146పరుగులు చేసి గెలిచింది. పంజాబ్ బౌలర్లు హర్షల్ పటేల్‌కు మూడు, లివింగ్‌స్టోన్‌కు రెండు వికెట్లు దక్కాయి.

బల్‌రాజ్‌కు ఒలింపిక్ బెర్త్

సియోల్(ద.కొరియా): భారత రోయర్ బల్‌రాజ్ పన్వర్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన ఆసియా ఒలింపిక్ క్వాలిఫికేషన్ రెగట్టా పోటీల్లో బల్‌రాజ్ రికార్డు స్థాయిలో 7నిమిషాల 1.27సెకన్లలో గమ్యానికి చేరి కాంస్య పతకం సాధించాడు. దీంతో భారత్ తరఫునుంచి రోయింగ్ విభాగంలో ఒలింపిక్స్ బెర్త్ సాధించిన తొలి రోయర్‌గా బల్‌రాజ్ నిలిచాడు. బల్‌రాజ్ గత ఏడాది చైనా వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో నాల్గో స్థానంలో నిలిచి ఒలింపిక్ బెర్త్, పతకం సాధించడంలో విఫలమయ్యాడు.

అగ్రస్థానంలో మను బకర్

న్యూఢిల్లీ: తుగ్లకాబాద్‌లోని డా.కర్ణి సింగ్ రేంజ్‌లో జరుగుతున్న ఒలింపిక్ షూటింగ్ పోటీల్లో బను బకర్ అగ్రస్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన స్పోర్ట్స్ పిస్టల్ గ్రూప్ విభాగంలో బను 585పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ఈషాసింగ్ 581పాయింట్లు సాధించగా.. సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ 577పాయింట్లు సాధించి ఫైనల్‌కు చేరారు. ఇక రిథమ్ సాంగ్వాన్ 566పాయింట్లతో ఆ తర్వాత స్థానంలో నిలిచింది.

ఇక పురుషుల 25మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టోల్ విభాగంలో అనిష్ భన్వాల్(582) గ్రూప్ టాపర్‌గా నిలువగా.. విజయ్ వీర్ సిద్ధూ(580), భవేశ్ షెకావత్(580), అంకుర్ గోయల్(573), ఆదర్శ్ సింగ్(571) ఆ తర్వాతి స్థానాలో నిలిచారు. సోమవారం ఫైనల్‌తోపాటు ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారు కానున్నాయి.

ఐపిఎల్‌లో నేడు

రాజస్థాన్ × ముంబయి
వేదిక: జైపూర్; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	7	6	1	12	0.67
కోల్‌కతా	7	5	2	10	1.20
సన్‌రైజర్స్	7	5	2	10	0.91
చెన్నై	7	4	3	8	0.52
లక్నో	7	4	3	8	0.12
గుజరాత్	8	4	4	8	-1.05
ముంబయి	7	3	4	6	-0.13
ఢిల్లీ క్యాపిటల్స్	8	3	5	6	-0.47
పంజాబ్‌కింగ్స్	8	2	6	4	-0.29
బెంగళూరు	8	1	7	2	-1.04

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68